

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 186
సోమవారం 26-9-2022
SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



నేటి నుంచి దసరా ఉత్సవాలు

విజయవాడలోని ఇంద్రకీలాద్రి, శ్రీశైల క్షేత్రం దసరా మహోత్సవాలకు ముస్తాబవ్వగా.. తిరుమల సప్తగిరులు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యాయి. సోమవారం నుంచి అక్టోబర్ 5 వరకు జరగనున్న మహోత్సవాల్లో బెజవాడ కనకదుర్గమ్మ పది విశేష అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు సోమవారం అంకురార్పణతో ఆరంభం కానున్నాయి.


- వివరాలు 8లో



ఉత్తరకొరియా క్షిపణి ప్రయోగం

ఉత్తరకొరియా సముద్రం పైకి స్వల్ప శ్రేణి క్షిపణిని ప్రయోగించింది. ఈ ఏడాది 30 బాలిస్టిక్ మిస్సైళ్లను పరీక్షించింది.

వివరాలు 6లో



షహీద్ భగత్ సింగ్ ఎయిర్‌పోర్ట్

చండీగఢ్ విమానాశ్రయానికి స్వాతంత్య్ర సమరయోధుడు, అమర వీరుడు భగత్ సింగ్ పేరు పెట్టనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

వివరాలు 6లో



బంగ్లాలో పడవ మునక

మహాలయ పర్వదినం సందర్భంగా బంగ్లాదేశ్‌లోని బోదేశ్వరి ఆలయానికి వెళ్తున్న పడవ నీట మునిగి.. 24 మంది చనిపోయారు.

వివరాలు 6లో



దేశ పునర్నిర్మాణం కోసం..

దేశ పునర్నిర్మాణం కోసం చేపట్టిన భారత్ జోడో యాత్రలో ప్రజలంతా పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది.

వివరాలు 6లో

ఏది నిజం?

వక్రీకరణే వజ్రాయుధమా?

- తన కాలమిస్టు ఇంటర్వ్యూను అడ్డుపెట్టుకుని విషం కక్కిన 'ఈనాడు'.. విలువైన భూములు ఎర్తిన్ ప్రాజెక్ట్‌కు రూ.500 కోట్లకేనంటూ రాతలు
- కావాలని సీఎం జగన్ మేనమామ కుమారుడంటూ నరేన్ పేరు ప్రస్తావన
- ఆస్తుల్ని చౌకగా కట్టబెట్టేశారంటూ టీడీపీ, రామోజీ కలిసి మరీ దుష్ప్రచారం
- నిజానికి ఆ 500 కోట్లను కూడా చెల్లించలేకపోయిన 'ఎర్తిన్ ప్రాజెక్ట్స్'
- ఆ ఆస్తులంత విలువైనవే అయితే చెల్లించలేని పరిస్థితి రాదు కదా?
- అయినా లేపాక్షికి భూముల తనఖాకు ఏపీఐఐసీ ఎన్‌ఓసీ ఇచ్చిందెప్పుడు?
- నాటి సీఎం వైఎస్సార్ మరణించాక.. సీఎం రోశయ్య హయాంలో కాదా?
- దాదాపు సగం భూముల కేటాయింపు జరిగిందీ వైఎస్సార్ మరణించాకేగా?
- ఆ నిజాలను అక్షరం కూడా ప్రస్తావించకుండా దిగజారుడు రాతలు
- అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఆ భూములపై హైకోర్టులో కౌంటర్ కూడా వేయని బాబు
- బిడ్డింగ్‌లో పాల్గొంటామని ఏపీఐఐసీ తరఫున ఎన్‌సీఎల్‌టీని కోరిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- గడువు ముగిసిపోయింది కాబట్టి కుదరదంటూ తిరస్కరించిన పరిష్కార నిపుణుడు
- దీంతో తాజాగా హైకోర్టులో ఈ కేసుకు సంబంధించి కౌంటర్‌పై ముందడుగు

4లో



విశాఖలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మేధావులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

శ్రీకాకుళం టు అమరావతి

ఉత్తరాంధ్ర వాసుల ఆకాంక్షలను తెలియజేసేలా పాదయాత్ర

- మూడు ప్రాంతాల అభివృద్ధిని కాంక్షిస్తున్న 3 జిల్లాల ప్రజలు
- పాలనా వికేంద్రీకరణతోనే భవిష్యత్తుకు బంగారు బాటలు
- కేవలం 29 గ్రామాలేనా?.. రాష్ట్రమంతా ముఖ్యమా?.. ఇంటింటా చర్చ జరగాలి
- ఇప్పుడు మేల్కోకుంటే మరోసారి రాష్ట్రం విడిపోయే ప్రమాదం
- ప్రాంతీయ విభేదాలకు సున్నితంగా తెర దించుదాం
- 3 రాజధానుల ఆవశ్యకతను ఊరూరా చాటి చెబుదాం.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
- విశాఖ రౌండ్ టేబుల్ భేటీలో మేధావులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల తీర్మానాలు

సాక్షి, విశాఖపట్నం: పాలనా వికేంద్రీకరణతోనే రాష్ట్ర భవిష్యత్తు బంగారమయమవుతుందని ఉత్తరాంధ్ర మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు ముక్తకంఠంతో చాటి చెప్పారు. ప్రాంతీయ విభేదాలకు సున్నితంగా తెరదించి మూడు రాజధానులకు మద్దతిస్తూ రాష్ట్రమంతా ఏకతాటిపై నిలిచేలా శాంతియుతంగా ఉద్యమాలను నిర్వహించే సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. ఉత్తరాంధ్ర వాసులు శ్రీకాకుళం నుంచి అమరావతి వరకూ పాదయాత్ర చేపట్టి కేవలం 29 గ్రామాలు ముఖ్యమా? లేక రాష్ట్రమంతటా అభివృద్ధి జరగడం ముఖ్యమా? అనే అంశంపై ప్రతి గడపలోనూ చర్చ జరిగేందుకు సమాయత్తమవ్వాలని పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. ఉత్తరాంధ్ర మేధావుల ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలోని గాదిరాజు ప్యాలెస్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ మాజీ ఉపకులపతి హనుమంతు లజపతిరాయ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఉపముఖ్యమంత్రులు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు

మిగతా 2వ పేజీలో ▶

అడ్డుకోవడం.. ఐదు నిమిషాల పని

విశాఖ సదస్సులో మంత్రి బొత్స ఉద్వేగ ప్రసంగం

- శాంతి భద్రతలకు విఘాతం కలగకూడదనే సంయమనం
- రాజధానిపై ఓ న్యాయమూర్తి వ్యాఖ్యలు బాధాకరం
- ఉన్నత పదవుల్లో ఉన్నంత మాత్రాన ఇష్టారీతిగా మాట్లాడకూడదు
- ఇప్పుడు కూడా స్పందించకపోతే పెను ప్రమాదం వాటిల్లే అవకాశం
- కాకినాడ నుంచి ఇచ్ఛాపురం వరకు అందరూ కదలాల్సిన అవసరం ఉంది

2లో



భారత్ భలే గెలుపు

మూడో టీ20లో టీమిండియా విజయం... 2-1తో సిరీస్ కైవసం

6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా జట్టు ఓటమి

రాణించిన కోహ్లి, సూర్యకుమార్ యాదవ్

12లో

ఆస్ట్రేలియాతో జరిగిన మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 2–1తో సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో రోహిత్ శర్మ బృందం ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 186 పరుగులు చేయగా... భారత్ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 187 పరుగులు సాధించి నెగ్గింది. విరాట్ కోహ్లి 48 బంతుల్లో 63 పరుగులు చేయగా.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ 36 బంతుల్లో 69 పరుగులతో మెరిపించాడు. అక్షర్ పటేల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది.

క్యూఆర్ కోడ్‌లో భూమి

అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా సరిహద్దులు పక్కాగా నిర్ధారణ

- పట్టాదార్ పాస్ పుస్తకంలో క్యూఆర్ కోడ్.. స్కాన్ చేస్తే భూమిని చూసుకోవచ్చు
- నకిలీలు, ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదు.. రీ సర్వేతో రెవెన్యూ రికార్డుల సమూల ప్రక్షాళన



సాక్షి, అమరావతి: బ్రిటీష్ కాలం నాటి రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసి వివాదాలకు శాశ్వతంగా తెరదించే లక్ష్యంతో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకం ద్వారా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని శరవేగంగా చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం పట్టాదారు పాసు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ ముద్రించనుంది. దీన్ని స్కాన్ చేయడం ద్వారా భూ కమతం, విస్తీర్ణం, ఎలాంటి భూమి, మ్యాప్ తదితర వివరాలన్నీ తెలుసుకోవచ్చు. రీ సర్వేలో అక్షాంశాలు, రేఖాంశాలతో (జియో కో–ఆర్డినేట్స్) భూమి హద్దులను నిర్ధారిస్తున్నారు. భూమికి నలు వైపులా వీటిని సూచించడం ద్వారా విస్తీర్ణాన్ని కచ్చితంగా తెలుసుకోవచ్చు. వీటి ఆధారంగా రైతుల పట్టాదార్ పాస్ పుస్తకంలో క్యూఆర్ కోడ్ ముద్రిస్తారు. ప్రస్తుతం ఒక సర్వే నెంబర్‌కి ఒక ఎఫ్‌ఎంబీ ఉండగా నలుగురైదుగురు భూ యజమానులుంటే ఉమ్మడిగా ఒక మ్యాప్ కేటాయిస్తున్నారు. రీ సర్వే తర్వాత ప్రతి భూమిని (సెంటు భూమి విడిగా ఉన్నా సరే) సర్వే చేసి ప్రత్యేకంగా రాళ్లు పాతుతారు. దానికి ల్యాండ్ పార్సిల్ మ్యాప్ ఇస్తారు. ఆ సర్వే నెంబర్‌లో ఎంత మంది ఉంటే అందరి మ్యాప్‌లు విడివిడిగా పొందుపరుస్తారు. ప్రతి భూ యజమానికి తమ భూములపై ఎవరూ సవాల్ చేయడానికి వీలు లేని శాశ్వత హక్కులు లభిస్తాయి.

70 బేస్ స్టేషన్లతో కార్స్ నెట్‌వర్క్

జీపీఎస్ కార్స్ నెట్‌వర్క్ (కంటిన్యుస్లీ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్ నెట్‌వర్క్) ద్వారా భూములను కొలుస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 70 బేస్ స్టేషన్లు శాటిలైట్ రేడియో సిగ్నళ్లను స్వీకరించి కచ్చితమైన అక్షాంశ, రేఖాంశాలను సెంట్రల్ కంట్రోల్ స్టేషన్‌కు పంపుతాయి. కార్స్, డ్రోన్, రోవర్ సహాయంతో

మిగతా 8వ పేజీలో ▶



థర్డ్ ఫ్రంట్.. ప్రశ్నే లేదు

6లో

- 2024 లోక్‌సభలో ఎన్నికల్లో బీజేపీని మట్టి కరిపించడానికి కాంగ్రెస్ పార్టీతో కూడిన కొత్త కూటమి ఏర్పాటు కావాలని బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నాయకుడు నితీశ్ కుమార్ పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా బలమైన ఒకే ఒక్క కూటమి బరిలోకి దిగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం హరియాణాలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో నితీశ్‌తో పాటు ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఐఎన్ఎల్‌డీ నేత ఓంప్రకాశ్ చౌతాలా, శిరోమణి అకాలీదళ్ నాయకుడు సుఖ్‌బీర్‌సింగ్ బాదల్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, బిహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, శివసేన నాయకుడు అరవింద్ సావంత్, జేడీ(యూ) నాయకుడు కె.సి. త్యాగీ తదితరులు హాజరయ్యారు.

రాజస్తాన్ కాంగ్రెస్‌లో అలజడి

సచిన్ పైలట్‌కు వ్యతిరేకంగా అశోక్ గెహ్లాట్ వర్గం ఎమ్మెల్యేల రాజీనామా

- రాజస్తాన్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్న అశోక్ గెహ్లాట్ మద్దతుదారులైన 92 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషీకి అందజేశారు. గెహ్లాట్ రాజీనామా తర్వాత రాజస్తాన్ ముఖ్యమంత్రి రేసులో ముందున్న సచిన్ పైలట్‌కు వ్యతిరేకంగా వారంతా ఈ నిర్ణయం తీసుకున్నారు. తమలోనే ఒకరు సీఎం కావాలని గెహ్లాట్ వర్గం భావిస్తోంది.



- వివరాలు 6లో

రైతులకు పుష్కలంగా రుణాలు

- ప్రభుత్వం సున్నా వడ్డీ చెల్లింపుతో రుణాలివ్వడానికి ముందుకొస్తున్న బ్యాంకులు.. ఏడాదికేడాది రైతుల సంఖ్య, రుణాల మంజూరులో పెరుగుదల
- మూడేళ్లలో 307.20 లక్షల మంది రైతులకు రూ.4,37,828 కోట్ల రుణాలు
- ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 48.49 లక్షల మందికి రూ.85 వేల కోట్ల రుణం
- మూడేళ్లలో 4.75 లక్షల మంది కౌలు రైతులకు రూ.3,595 కోట్లు రుణాలు

15లో



ఇదండీ వాలకం



అలాగే బోగస్ నాయకులను కూడా ఏరివేయమంటున్నాడు!

నల్లమల.. అరుదైన పక్షుల నిలయం

మార్కాపురం: నల్లమల అటవీ ప్రాంతం అరుదైన పక్షులకు నిలయంగా మారింది. ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాలతోపాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 2.32 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. విలువైన ఔషధ మొక్కలతోపాటు టేకు, ఇనుమద్ది తదితర వృక్షాలతోపాటు అరుదైన పక్షి జాతులకు కూడా ఈ ప్రాంతం చిరునామాగా మారింది. శ్రీశైలంలోని బయోడైవర్సిటీ సైంటిస్టు, అటవీశాఖ అధికారి మహమ్మద్ హయాత్, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ మున్నా అటవీ ప్రాంతంలో పర్యటించి అరుదైన పక్షిజాతులను గుర్తించారు. వాటి జీవన విధానం, ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై వారు పరిశోధనలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసించే పక్షులు పలు ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. ప్రతి ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు మాత్రమే కనిపించే జర్డాన్స్ కోర్సర్ పక్షి చూడటానికి చాలా అందంగా ఉంటుంది. ఈ పక్షి అరుపు కూడా విచిత్రంగా ఉంటుంది. ఇక దేశంలో ఎక్కడా లేని వింతైన ఉడుము నల్లమల అటవీ ప్రాంతంలోనే కనిపిస్తుంది.




నాబ్‌బిల్డ్ డక్



చౌసింగ



మానిటర్ లిజర్డ్



జర్డాన్స్ కోర్సర్

పది వేల కిలోమీటర్లు ప్రయాణించి..

ఏటా జూన్‌లో విదేశాల నుంచి నాబ్‌బిల్డ్ డక్ పక్షి నల్లమల అటవీ ప్రాంతానికి వచ్చి పిల్లలను పెట్టి నవంబర్ నెలాఖరులో మళ్లీ స్వదేశానికి వెళుతుంది. ఇది సుమారు 10వేల కిలో మీటర్లు ప్రయాణిస్తుంది. పంచ వర్ణాల రంగులో ఈ పక్షి అందంగా ఉంటుంది. వీటితోపాటు క్రిస్టెడ్ హక్ ఈగల్(గద్ద) మన దేశంలో నల్లమలలో మాత్రమే కనిపిస్తుంది. నల్లమల అటవీ ప్రాంతంలో బయోడైవర్సిటీ కేంద్రంగా వివిధ రకాల పక్షులపై పరిశోధనలు చేస్తున్నామని బయోడైవర్సిటీ సైంటిస్టు, అటవీశాఖ అధికారి మహమ్మద్ హయాత్ తెలిపారు. విదేశాల నుంచి కూడా రకరకాల పక్షులు కొన్ని సీజన్‌లలో వచ్చి పిల్లలను పెట్టి వెళుతుంటాయని చెప్పారు. ఈ అరుదైన పక్షుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దుప్పిని పోలి ఉండే కొండ గొర్రె కేవలం నల్లమల అటవీ ప్రాంతంలోనే కనిపిస్తుందని, దీనిని చౌసింగ అంటారని ఆయన వివరించారు.

‘గ్రామీణం’పై పడగెత్తిన పిడుగు

- పిడుగుల కారణంగా రాష్ట్రంలో ఏడాది వ్యవధిలో 100 మంది మృతి
- ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలు, ఎత్తయిన ప్రదేశాల్లోనే పిడుగులు
- పిడుగుపాటుతో ఒకే ఏడాదిలో దేశవ్యాప్తంగా 2,878 మంది మృతి
- మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 496 మంది మరణం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రకృతి విపత్తులు భయాందోళన సృష్టిస్తున్నాయి. అన్నింటికీ మించి క్షణాల్లోనే దూసుకువస్తోన్న పిడుగులు ఇప్పుడు రాష్ట్రంలో కలకలం సృష్టిస్తున్నాయి. ఎక్కడ ఎప్పుడు పిడుగు పడుతుందో ఊహించని పరిస్థితి. గడిచిన ఒక్క ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లో పిడుగులు పడి వంద మంది మృతి చెందినట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. దేశవ్యాప్తంగా గడిచిన ఏడాదిలో 2,878 మంది పిడుగుపాటుతో మృతి చెందినట్లు గణాంకాలు వెల్లడయ్యాయి. అందులో ఏపీలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా 100 మంది మృతిచెందారు. ఇందులో 86 మంది పురుషులు, 14 మంది మహిళలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పిడుగుపాటుతో మృతి చెందిన వారిలో 70 మంది గ్రామీణ ప్రాంత వాసులే కావడం గమనార్హం. ఎక్కువగా పశువుల కాపరులు, పొలంలో పనిచేసుకునే రైతులు, రైతు కూలీలు మృతి చెందారు. ఎత్తయిన కొండలు, గుట్టలు, చెట్లు, భవనాలు ఉన్న ప్రాంతాల్లో పిడుగులు పడుతున్నాయి. భారత్‌లో అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 496 మంది పిడుగుపాటుతో మృతి చెందారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో వరదల కారణంగా 36 మంది, వడదెబ్బతో మరో 22 మంది మృతి చెందారు. ఒక్క ఏడాదిలోనే ప్రకృతి వైపరీత్యాల కారణంగా రాష్ట్రంలో 162 మంది మృత్యువాత పడ్డారు.

ముందస్తు జాగ్రత్తలు ఇలా..

- ఇంట్లో ఉన్నప్పుడు కిటికీలు, తలుపులు మూసివేయాలి
- ద్వార మండపాలు, అడ్డుగోడలకు దూరంగా ఉండాలి
- ఉరుముల చివరి శబ్దం విన్న తర్వాత 30 నిమిషాల వరకూ లోపలే ఉండాలి
- వదులుగా వేలాడుతున్న విద్యుత్‌లైన్లకు దగ్గరగా ఉండకూడదు
- ట్రాక్టర్లు, మోటారు వాహనాలు వంటి వాటికి సమీపంలో ఉండకూడదు
- వర్షం పడే సమయంలో గానీ, ఉరుముల సమయంలో గానీ చెట్ల కిందకు వెళ్లకూడదు
- ఎత్తయిన భవనాల సమీపంలో ఉండకూడదు.

2021-22లో పిడుగు పాటుతో పలు రాష్ట్రాల్లో మృతి చెందిన వారి సంఖ్య

రాష్ట్రం	మృతులు	రాష్ట్రం	మృతులు
		మహారాష్ట్ర	238
ఆంధ్రప్రదేశ్	100	ఒడిశా	287
బిహార్	286	రాజస్తాన్	132
చత్తీస్‌ఘడ్	230	తమిళనాడు	109
జార్ఖండ్	254	తెలంగాణ	66
కర్ణాటక	121	ఉత్తరప్రదేశ్	219
మధ్యప్రదేశ్	496	పశ్చిమ బెంగాల్	228

40 నిమిషాల ముందే సమాచారం

పిడుగులు పడే అవకాశం ఉన్నప్పుడు 40 నిమిషాల ముందే విపత్తుల శాఖ నుంచి సమాచారం వస్తుంది. ఏ ప్రాంతంలో పిడుగు పడే అవకాశముందో అందులో చెబుతారు. దీన్ని తహశీల్దార్లకు, వీఆర్‌వోలకు పంపించి ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తాం. వర్షం పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. – నిశాంత్‌రెడ్డి, ఆర్డీవో, కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా

అడ్డుకోవడం.. ఐదు నిమిషాల పని

- సేవా సంఘాలు, స్వచ్ఛందసంస్థలు, మేధావులంతా వీధుల్లోకి రావాలి
- అందరితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి మన ఉద్దేశాన్ని చాటుదాం
- మీడియా ఉత్తరాంధ్ర మనోభావాల్ని దెబ్బతీసేలా వ్యవహరించొద్దు
- ఎన్టీఆర్ వచ్చిన తర్వాతే ఉత్తరాంధ్ర ప్రజలకు అన్నం గురించి తెలిసింది
- వైఎస్సార్ జలయజ్ఞం చేపట్టిన తర్వాత వలసలు ఆగాయి
- అంతగా వెనుకబడ్డ ప్రాంత అభివృద్ధికి సీఎం జగన్ అవకాశం కల్పిస్తున్నారు

సాక్షి, విశాఖపట్నం: ''విశాఖలో రాజధాని ఏర్పాటు చేస్తే ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసుకోవచ్చనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకానీ ఏ ఒక్కరినో ఇబ్బంది పెట్టాలని, కించపరచాలని కాదు. పాదయాత్రల్ని అడ్డుకోవడం, దండయాత్రలు చేయడం ఐదు నిమిషాల పని. కానీ వ్యవస్థని గౌరవించాలి. శాంతి భద్రతల్ని కాపాడుకోవాలనే సంయమనం పాటిస్తున్నాం. దురదృష్టం ఏమిటంటే 29 గ్రామాల్లో రియల్ ఎస్టేట్ అమ్మకాలు, వ్యవహారాల అంశాన్ని 26 జిల్లాలకు ముడిపెట్టి ఆందోళనలు చేయడం అత్యంత బాధ కలిగిస్తోంది. రాష్ట్రంలోని 26 జిల్లాలను అభివృద్ధి చేయాలని అనుకోవడం ధర్మం. దానికి కట్టుబడి ఉండకపోతే నా మంత్రి పదవికి అర్హుడిని కాదు. రాష్ట్రాభివృద్ధి కోసం దీన్ని త్యాగం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. దుర్మార్గమైన ఆలోచనలతో ఉన్న చంద్రబాబు కుటిలయత్నాల కారణంగా వ్యవస్థ, సమాజం, రాష్ట్రం నష్టపోతోంది. దీనిపై అంతా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది'' అని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉద్వేగపూరితంగా మాట్లాడారు. ఆదివారం విశాఖలో జరిగిన పాలనా వికేంద్రీకరణ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆ వివరాలివీ..

పన్నులు, ఆదాయం మట్టిలో పోయాలా?

అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలి, ఐదు కోట్ల మందికీ ఫలాలు అందాలి.. ఏ ఒక్కరికీ అసంతృప్తి ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వనరులు, వసతులపై సమగ్ర అధ్యయనం అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల విధానంపై ప్రకటన చేశారు. అమరావతి ఈ రాష్ట్రంలో ఒక భాగమే. అమరావతి రాజధానికి ప్రభుత్వం వ్యతిరేకం కాదు. రాజధానిని విజయవాడ, గుంటూరు నగర ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ఉంటే రూ.5 వేలు లేదా రూ.10 వేల కోట్లు సమకూర్చుకుంటే సరిపోయేది. అమరావతిలో ఆ పరిస్థితి లేదు. రూ.1.09 లక్షల కోట్లు అవసరమని గణాంకాలు వెల్లడించాయి. దీనిపై విచారణ జరిపి ఆర్గనైజింగ్ చేసిన కంపెనీకి రూ.400 కోట్లు ఫీజు రూపంలో చెల్లించినట్లు గుర్తించాం. 29 గ్రామాల పరిధిలో కాకుండా మిగిలిన ఏ ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టినా 50 శాతం ఖర్చు తగ్గుతుందని అర్థమైంది. ఎందుకింత వ్యత్యాసమని పరిశోధనలు చేస్తే అమరావతిలో పునాదులు తవ్వాలంటే వందల అడుగుల లోతుకు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. ప్రజలు కట్టే పన్నులు, ఆదాయం మొత్తం అక్కడి మట్టిలో పోయాల్సి వస్తుంది. ఏ ఒక్కరైనా దీనిపై మాట్లాడితే అధికారికంగా వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు త్యాగాలు చేశారు, భూములిచ్చారని కొన్ని పార్టీలు చెబుతున్నాయి. ల్యాండ్ పూలింగ్ చట్టం ప్రకారమే అక్కడ భూముల సమీకరణ చేశారు. అక్కడ అగ్రిమెంట్ రియల్ ఎస్టేట్ మాదిరిగా జరిగింది. గత ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం కంటే అదనంగా అమరావతి రైతులకు చెల్లింపుల సమయాన్ని సీఎం పొడిగించారు.

ఎన్టీఆర్ దయతోనే ఉత్తరాంధ్ర ప్రజలు అన్నం తిన్నారు

ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.రెండు కిలో బియ్యం ఇచ్చాక ఉత్తరాంధ్ర ప్రజలు అన్నం తిన్నారు. అప్పటివరకూ రాగులే ఆహారం. వైఎస్సార్ సీఎం అయ్యాక జలయజ్ఞంతో పంటలు పండి వలసలు ఆగాయి. గతంలో ఉత్తరాంధ్ర రైల్వే స్టేషన్లు వలస వెళ్లే కూలీలతో కిటకిటలాడేవి. వైఎస్సార్ నిర్ణయాలతో వలసలు ఆగాయి. ఇందులో ఏ ఒక్కటి అబద్ధం అయినా నేను తలదించుకుంటా. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ఉత్తరాంధ్రకు ఏం చేశారు? వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే మన తల్లిని మనం అవమానించుకున్నట్లే.

న్యాయమూర్తి మాటలు బాధాకరం..

ఇటీవల రాజధానిపై ఒక న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు ఇబ్బందికరంగానూ, బాధాకరంగా ఉన్నాయి. రాజ్యాంగం బద్ధంగా మాట్లాడే అవకాశం అందరికీ ఉంటుంది. కానీ సంయమనం పాటించాలి. ఇలాంటి పరిస్థితులకు మీలాంటి వారు కూడా కారణమే. ఉన్నత పదవుల్లో ఉన్నంత మాత్రాన ఇష్టారీతిగా మాట్లాడకూడదు. పదవుల్లో ఉన్నప్పుడు అందరి అభిప్రాయాలకు అనుగుణంగా ఆలోచనలు ఉండాలి. ఇప్పుడు పదవుల్లో ఉండొచ్చు. కానీ మన గతం కూడా గుర్తుంచుకోవాలి. పత్రికా యాజమాన్యాలు కూడా ఆలోచన చేయాలి. ఈ ప్రాంతం నుంచే పెద్దవాళ్లయ్యారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. వ్యాపారాన్ని వ్యాపారంగా చేసుకోండి. అంతేకానీ వర్గ విబేధాలు, ప్రాంతీయ విబేధాలు తీసుకురావొద్దని హెచ్చరిస్తున్నాం.

అమరావతి రైతులు బాబును నిలదీయాలి

వీళ్లు చేస్తోంది పాదయాత్రా.. దండ యాత్రా..? రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంపాదన కోసం చేస్తున్న యాత్రా? టీడీపీ రాజకీయ యాత్రా? అనేది అర్థం కావడం లేదు. విశాఖను రాజధానిగా చేస్తే మీకొచ్చిన నష్టం ఏమిటి? ఇక్కడ రాజధాని ఏర్పాటు చేస్తే మీకొచ్చిన ఇబ్బంది ఏమిటి? అప్పటి అగ్రిమెంట్‌లో అమరావతిలోనే రాజధాని ఏర్పాటు చేయాలని ఏమైనా వాక్యం ఉందా.? మీతో లాలూచీ పడిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుని ఈ విషయంపై అమరావతి రైతులు నిలదీయాలి. పాదయాత్రకు స్వాగతం పలుకుతామంటున్న నాయకుల్ని అడుగుతున్నా. ఉత్తరాంధ్రలో రాజధాని పెడితే మీకొచ్చిన నష్టం ఏంటి? తల్లిపాలు తాగి రొమ్ము గుద్దుతారా.? అమరావతిలో భూములు కొనుక్కొని ఎంగిలి మెతుకుల కోసమా ఇలా మాట్లాడటం భావ్యం కాదు. ఈ ప్రాంతంలో ఎలా తలెత్తుకొని తిరుగుతారు? అమరావతి నిర్మాణ వ్యయం ఇప్పుడు రూ.1.09 లక్షల కోట్లు.. భవిష్యత్తులో రూ.5 లక్షల కోట్లకు పెరగదా?

మేం కూడా మీలాగే ఆలోచిస్తే..

చంద్రబాబు ప్రతి కార్యక్రమం ఆయన కుటుంబం, వ్యక్తిగత లబ్ధి కోసమే చేస్తారు. వైఎస్సార్, వైఎస్ జగన్ సామాజిక అభివృద్ధి కోసమే పథకాలు, కార్యక్రమాలు చేస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు చేతకానివాళ్లని భావించొద్దు. చేతులు ముడుచుకొని కూర్చొనే రోజులు పోయాయి. ఈ పోరాటాన్ని కొనసాగించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. అన్ని సంఘాలకూ లేఖలు రాయాలి. ప్రతి వారం, 15 రోజులకు సమావేశం నిర్వహించి దానికనుగుణంగా పోరాటం కొనసాగించాలి. 500 కుటుంబాల కోసం ఈ రాష్ట్ర సంపదని తాకట్టు పెట్టాలనడం భావ్యం కాదు. శాసన రాజధానిని అమరావతిలో కొనసాగిస్తే మీకొచ్చిన ఇబ్బంది ఏమిటి? విశాఖలో రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే ముంబైని తలదన్నే నగరంలా అభివృద్ధి చెందుతుంది. కొన్ని రాజకీయ పార్టీలు దుర్మార్గంగా ఆలోచనలు చేస్తున్నాయి. దోచుకోవాలనే ఉద్దేశంతోనే చేస్తున్నారు. పాతికేళ్లుగా రాజకీయాల్లో ఉన్నాం. మేం కూడా మీలాంటి ఆలోచనలతో ఉంటే విశాఖలో సగం ప్రాంతం మా పరిధిలోనే ఉండేది. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం అమలు కావాల్సిందే. హైకోర్టు బెంచ్ విశాఖలో ఏర్పాటు చేయాలన్నది ఇప్పటి డిమాండ్ కాదు. దీన్ని కూడా రాజధాని ఏర్పాటైన తర్వాత పెడతాం. స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు, వైద్యులు, మేధావులతో రాజకీయాలకు అతీతంగా ర్యాలీని త్వరలోనే నిర్వహించి మన అభిప్రాయల్ని వ్యక్తం చేద్దాం. కుటిల బుద్ధితో వ్యవహరిస్తున్న రాజకీయ నాయకులకు కనువిప్పు కలిగిద్దాం.

రాజస్థాన్, మహారాష్ట్రపై తొలివేవ్ తీవ్ర ప్రభావం

ఆ రెండు రాష్ట్రాల్లో అత్యధికంగా ఆర్థిక సూచికలు పతనం

- తెలంగాణ, అస్సోం, పశ్చిమ బెంగాల్‌పై రెండో వేవ్ ప్రభావం
- ఏపీలో రెండో వేవ్ ప్రభావం అత్యల్పం
- 2021 జనవరి నుంచి రాష్ట్రంలో ఆర్థిక సూచికలు మెరుగు
- కోవిడ్ ప్రభావంపై ఆర్బీఐ బులెటిన్ విశ్లేషణ
- 2020 ఏప్రిల్ – 2022 ఫిబ్రవరి వరకు నివేదిక

సాక్షి, అమరావతి: కోవిడ్ మహమ్మారి, లాక్‌డౌన్ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆర్థిక కార్యకలాపాలు తీవ్ర పతనానికి దారితీశాయని ఆర్బీఐ తెలిపింది. కోవిడ్ తొలివేవ్ తీవ్రంగా ఉన్న 2020 ఏప్రిల్‌లో మహారాష్ట్ర, రాజస్థాన్‌లో ఆర్థిక సూచికలు అత్యధికంగా పతనం అయినట్లు పేర్కొంది. కోవిడ్ రెండో వేవ్ తెలంగాణ, అస్సోం, పశ్చిమ బెంగాల్ ఆర్థిక వ్యవస్థలపై అత్యధికంగా ప్రభావం చూపింది.

ఏపీలో ప్రభావం అత్యల్పం

ఏపీలో రెండో వేవ్ ప్రభావం అత్యల్పంగా ఉందని ఆర్బీఐ బులెటిన్ పేర్కొంది. ఏపీలో 2021 జనవరి నుంచి ఆర్థిక సూచికల్లో మెరుగుదల కనిపించిందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో ఆర్థిక కార్యకలాపాలతో పాటు జీఎస్టీ వసూళ్లు, విద్యుదుత్పత్తి, ఉద్యోగాల రేటు, ఎగుమతులు, ఉపాధి హామీ పనుల ఆధారంగా 2020 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు నెలల వారీగా ఆర్థిక సూచికలను ఆర్బీఐ విశ్లేషించింది.

- కోవిడ్ తొలివేవ్‌లో 2020 ఏప్రిల్, మే నెలల్లో అన్ని రాష్ట్రాల్లో ఆర్థిక సూచికల విలువ భారీగా తగ్గిపోయింది. వ్యాక్సినేషన్‌తో పాటు చికిత్సల పరంగా రాష్ట్రాలు ముందస్తు ఏర్పాట్లు చేయడంతో రెండో వేవ్ కొన్ని రాష్ట్రాల్లో స్వల్ప ప్రభావమే చూపిందని బులెటిన్ పేర్కొంది.
- కోవిడ్ తొలి వేవ్‌లో ఏపీ –2.03 మేర ఆర్థిక సూచికలు పతనం అయ్యాయి. రెండో వేవ్‌లో ఏపీలో అత్యల్పంగా –0.02 మేరకు సూచికలు పతనమయ్యాయి. ఏపీలో 2020 జూన్ నుంచి ఆర్థిక సూచికల పతనం తీవ్రత డిసెంబర్ వరకు తగ్గుతూ వచ్చింది. ఏపీలో 2021 జనవరి నుంచి ఆర్థిక సూచికలు 0.71తో మెరుగుపడ్డాయి.

శ్రీకాకుళం టు అమరావతి

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, డా.బీవీ సత్యవతి, గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, దుంపల రవీంద్రబాబు, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్‌లు, డైరెక్టర్లు, మేధావి వర్గాల ప్రతినిధులు, ఉద్యోగ, న్యాయవాద, వైద్య, అధ్యాపక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, అమరజీవి పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మూడు రాజధానులకు మద్దతుగా విశాఖలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు

తొలి పంచవర్ష ప్రణాళికలోనే..



మద్రాస్ నుంచి విడిపోయిన సమయంలో తొలుత విశాఖనే రాజధానిగా ప్రతిపాదించారు. దీనికి 61 మంది ఎమ్మెల్యేలు మద్దతిచ్చారు. చివరి నిమిషంలో కర్నూలుకు మార్చారు. వికేంద్రీకరణ భావన ఇప్పటిది కాదు. 1951 మొదటి పంచవర్ష ప్రణాళికలో వికేంద్రీకరణ అంశాన్ని మూడో లక్ష్యంగా పేర్కొన్నారు. ఇప్పటికైనా మూడు రాజధానులను ఏర్పాటు చేయకుంటే భవిష్యత్తులో రాష్ట్రం మూడు ముక్కలయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన అందరిలో ఉంది. ఒకేచోట రాజధాని ఉంటే ప్రకృతి విపత్తులు వస్తే మొత్తం నాశనమయ్యే ప్రమాదం ఉంది. ఉక్రెయిన్ రాజధాని విషయంలోనూ ఇటీవల అదే జరిగింది.

– ప్రొ.హనుమంతు లజపతిరాయ్, మాజీ ఉపకులపతి


నాడు.. దొంగ లెక్కలతో



రాజధానిని నిర్ణయించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని రాజ్యాంగంలో అంబేడ్కర్ స్పష్టం చేశారు. 2014–15లో రాజధానిపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడితే 42 శాతం మంది విశాఖకు మద్దతిచ్చారు. 22 శాతం మంది విజయవాడ, 25 శాతం గుంటూరుకు మద్దతిచ్చారు. మిగిలిన వారు ఇతర ప్రాంతాల్ని ఎంపిక చేశారు. నాడు విశాఖను రాజధానిగా ఎందుకు ఎంపిక చేయలేదని చంద్రబాబు, నారాయణను నిలదీస్తే గుంటూరు, విజయవాడ కలిపి 47 శాతం అయిందంటూ దొంగ లెక్కలు చెప్పారు. అమరావతిని అభివృద్ధి చేయాలంటే రూ.లక్ష కోట్లు అవసరం. అంత డబ్బుతో 200 మెడికల్ కాలేజీలు, 200 స్టీల్ ప్లాంట్‌లు వస్తాయి. సీఎం జగన్ నిర్ణయానికి అంతా మద్దతు పలకాలి.

– వాసుపల్లి గణేష్‌కుమార్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే

70 ఏళ్లుగా ఉత్తరాంధ్రపై నిర్లక్ష్యం



అన్ని ప్రాంతాలు, మతాల వారికి విశాఖ భద్రమైన నగరం. సీఎం నిర్ణయానికి పూర్తి మద్దతు పలుకుతున్నాం. వైజాగ్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని గతంలో 200 రోజుల పాటు పోరాటం చేశాం. రాజధానితో పాటు బెంచ్ కూడా నెలకొల్పాలి.

– కృష్ణమోహన్, బార్‌కౌన్సిల్ సభ్యుడు

ఉద్యమంలో ముందుంటాం..



విశాఖను రాజధానిగా ప్రతి ఒక్కరూ పరిగణించాలి. సీఎం నిర్ణయంతో మూడు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించాలి. రాజధానిగా విశాఖకు సంబంధించిన ఏ ఉద్యమంలోనైనా మా ఉద్యోగుల సంఘం ముందు వరుసలో ఉంటుంది.

– పోలాకి శ్రీనివాసరావు, ఏపీ ఎలక్ట్రికల్ బీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు

బాబు బినామీల యాత్ర



అది చంద్రబాబు బినామీల యాత్ర. విశాఖ పరిపాలన రాజధానిగా మారితే ఉత్తరాంధ్రలో వలసలు ఆగిపోతాయి. గతంలో చంద్రబాబును విశాఖ ఎయిర్‌పోర్టు నుంచే వెనక్కి పంపించాం. పాదయాత్రను కూడా అదేమాదిరిగా తిప్పికొట్టాలి.

– కాంతారావు, ఏయూ విద్యార్థి జేఏసీ నాయకుడు

29 గ్రామాలా.. రాష్ట్రాభివృద్ధా?



రాజధానిగా అమరావతి పనికిరాదని అన్ని కమిటీలు చెప్పాయి. 29 గ్రామాలు ముఖ్యమా? లేక రాష్ట్రం మొత్తం ముఖ్యమా? అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. 19 దేశాల్లో, 13 రాష్ట్రాల్లో రాజధాని వికేంద్రీకరణ జరిగింది. హైకోర్టు సీట్ ఒకచోట, బెంచ్ ఒక చోట ఉన్న రాష్ట్రాలు, దేశాలు చాలా ఉన్నాయి. ఎమ్మెల్యే క్వార్టర్లు కాకుండా మూడు చోట్లా ఎమ్మెల్యే హాస్టళ్లు నిర్మించాలి.

– ప్రొ.బాలమోహన్‌దాస్, నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్

విశాఖ రెడీమేడ్ రాజధాని



విశాఖ మహా నగరం అన్ని సదుపాయాలున్న రెడీమేడ్ క్యాపిటల్. అతి తక్కువ ఖర్చుతో రాజధానిని ఏర్పాటు చేయవచ్చు. దీన్ని ఎవరూ కాదనే ప్రసక్తే ఉండదు. టూరిజం, ఇండస్ట్రియల్, ఎడ్యుకేషన్ పరంగా ప్రధాన నగరం. ఇలాంటి నగరాన్ని విడిచిపెట్టి రాజధాని ఎక్కడో ఉండటం సరికాదు. మూడు రాజధానులే సబబు. ప్రభుత్వ నిర్ణయం పర్‌ఫెక్ట్.

– జీఎస్ఎన్ రాజు, సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్

విద్వేషాలను రెచ్చగొడుతున్నారు..



అమరావతి రాజధానిని వ్యతిరేకిస్తూ 729 రోజులుగా మందడంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నాం. చంద్రబాబుకు పేదల అభివృద్ధి ఇష్టం లేదు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని అడ్డుకుని కోర్టులో పిల్‌వేశారు. దుర్బుద్ధితో పాదయాత్రలు నిర్వహిస్తూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారు.

–పెరికె వరప్రసాద్, దళిత జేఏసీ నాయకుడు

క్షుద్రశక్తులు.. వెన్నుపోటు రాజకీయాలు



రూ.3 లక్షల కోట్లు రెవెన్యూ వచ్చే విశాఖకు రాజధానిగా అన్ని హక్కులున్నాయి. కొన్ని క్షుద్రశక్తులు, ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు వికేంద్రీకరణను వ్యతిరేకిస్తూ వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారు. నెత్తిపై తన్నేవారిని చూస్తూ ఊరుకోలేం. ఉద్యమాల పురిటిగడ్డ ఉత్తరాంధ్రలో శాంతియుతంగా పోరాడతాం.

– కరణం ధర్మశ్రీ, చోడవరం ఎమ్మెల్యే

విస్తృతంగా చాటి చెప్పాలి..



వికేంద్రీకరణ ద్వారా ఉత్తరాంధ్రకు ఒనగూరే, ప్రయోజనం, మూడు రాజధానుల ఏర్పాటుతో రాష్ట్రవ్యాప్తంగా జరిగే అభివృద్ధిపై ప్రజలకు విస్తృతంగా తెలియచేయాలి. మేధావులు ఈ తరహా సదస్సులను నిర్వహించాలి. రాజకీయ అజెండాతో చేపట్టిన పాదయాత్ర లాంటి కార్యక్రమాలను విరమించుకోవాలని ఈ వేదిక ద్వారా పిలుపునిస్తున్నాం. ప్రాంతాల మధ్య చిచ్చు రగిల్చే చర్యలకు సున్నితంగా తెర దించాలని భావిస్తున్నాం.

– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి

సులువుగా అభివృద్ధి



రాష్ట్ర ప్రగతికి ఏది మంచిదో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ దానికే మద్దతిస్తుంటుంది. వికేంద్రీకరణతో ఎన్నో ప్రయోజనాలుంటాయి. రాష్ట్రం మొత్తం ప్రగతి పథంలో పయనించేందుకు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిందే. విశాఖ అన్నింటికంటే పెద్ద నగరం. దీన్ని అభివృద్ధి చేయడం చాలా తేలిక. ఒక రాజధానిని పునాదుల నుంచి అభివృద్ధి చేయాలంటే చాలా శ్రమతో కూడుకున్నది. హైదరాబాద్‌తో పోటీ పడాలంటే కచ్చితంగా విశాఖకే సాధ్యమవుతుంది. పరిశ్రమలు, ఐటీ సంస్థలు రావాలంటే విశాఖ కార్యనిర్వాహక రాజధాని కావాల్సిందే. దీనివల్ల వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలన్నీ ముందుకెళ్తాయి.

– పైడా కృష్ణప్రసాద్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు

సంక్షోభ రాష్ట్రంపై మరింత భారం



అమరావతి నిర్మాణంతో ఇప్పటికే సంక్షోభంలో ఉన్న ఏపీకి ఎలాంటి ఉపయోగం ఉండదు. పుత్రజయని రాజధానిగా మలేషియా నిర్మించింది. అక్కడ ఇప్పటికీ ప్రజలు నివసించడం లేదు. అమరావతి కూడా అదే మాదిరిగా మారుతుంది. ఇలాంటి సదస్సులతో ప్రజలను చైతన్యం చేయాలి. శ్రీకాకుళం నుంచి అమరావతికి యాత్ర చేపట్టాలి.

– శివశంకర్, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక కన్వీనర్

భావితరాలు క్షమించవు..



విశాఖను రెండో ముంబైగా పోలుస్తూ హైదరాబాద్ తర్వాత అభివృద్ధి చెందే కీలక ప్రాంతమని దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ గతంలోనే చెప్పారు. అలాంటి నగరాన్ని వదిలేసి ఎక్కడో రాజధాని ఏర్పాటు తప్పిదమే. ఇప్పటికే హైదరాబాద్‌లో అన్నీ అభివృద్ధి చేసి ఒక తప్పు చేశాం. మరోసారి పునరావృతం చేస్తే భావితరాలు క్షమించవు.

– షంషుద్దీన్, ముస్లిం సంఘాల ప్రతినిధి

అందరి నగరం విశాఖ



అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. గత ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకొని ఉంటే విభజన తర్వాత ఇన్ని ఇబ్బందులు ఎదురయ్యేవి కాదు. దేశంలో అన్ని ప్రాంతాలకు చెందిన వారు విశాఖలో నివసిస్తున్నారు.

– పల్లవి, ఏయూ చీఫ్ వార్డెన్, స్పోర్ట్స్ డైరెక్టర్

పాదయాత్ర ఎవరి కోసం.?



అమరావతి రైతుల పాదయాత్ర ఎవరి కోసం? లోకేష్‌ను సీఎం చేయాలనే దుర్బుద్ధితో చంద్రబాబు ఈ పాదయాత్ర చేయిస్తున్నారు. మూడు రాజధానులు ఏర్పడితే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుంది.

– పొకా సత్యనారాయణ, న్యాయవాది

మీ వెంటే మేమంతా

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తోన్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రజా సంక్షేమానికై అహర్నిశలూ శ్రమిస్తున్న జగనన్న వెంటే తామంతా నడుస్తామని నాయకులతో ప్రజలు చెబుతున్నారు. అన్ని జిల్లాల్లో ఆదివారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జట్లకొండూరులో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి



శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో సంక్షేమ పథకాల గురించి ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రైఫిల్ రాష్ట్ర సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఎన్టీఆర్ జిల్లా కేంద్రమైన విజయవాడలో ఆదివారం జరిగింది. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వర్లు, పరిశీలకుడిగా నేషనల్ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్‌సింగ్ కపసియా వ్యవహరించారు. సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా సలలిత్ తొట్టెంపూడి, డి.రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జీవీఆర్ రాజు, దరసాని మౌలిక్‌కిరణ్‌రెడ్డి, బొమ్మిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, కమ్మ కదీర్‌బాబు, వై.చంద్రమౌళి, కోశాధికారిగా ఎస్.దేవరాజ్, కార్యవర్గ సభ్యులుగా షేక్ జహీర్, మహ్మద్‌బాషా, సి.విజయ్‌పార్థసారథి, ఎం.రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు.

కర్నూలుకు హైకోర్టును తరలించాల్సిందే

ఏడో రోజుకు చేరుకున్న న్యాయవాదుల దీక్షలు

కర్నూలు(సెంట్రల్): ఏపీ హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించాల్సిందేనని ఏపీ హైకోర్టు సీనియర్ న్యాయవాది జయరాజు డిమాండ్ చేశారు. హైకోర్టును కర్నూలుకు తరలించాలని న్యాయవాదులు చేపట్టిన దీక్షలు ఆదివారంతో ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలుకు హైకోర్టును తరలించే వరకు దీక్షలను కొనసాగిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్ హైకోర్టును కర్నూలుకు తరలించేందుకు సానుకూలంగా ఉన్నా ప్రతిపక్ష పార్టీలు అమరావతి భ్రమలో ఉన్నాయన్నారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాజధాని కోస్తాలో ఉంటే హైకోర్టు రాయలసీమలో ఉండాలన్నారు. దీనిని అమలు చేయకుండా గతంలో చంద్రబాబు సీమకు అన్యాయం చేశారన్నారు. దీక్షల్లో న్యాయవాదులు శ్రీనివాసులు, సోమశేఖర్, కె.రవికుమార్, ఎం.సుంకన్న, ఎం.మహావిష్ణు విజయలక్ష్మి కూర్చున్నారు. వారికి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఆర్ కృష్ణ, కె.రంగడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రావిగువేరా, సీనియర్ న్యాయవాదులు ఓంకార్, వెంకటస్వామి, సుబ్బయ్య మద్దతు తెలిపారు.


దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకుంటే చాలు..

ఒక చోట నుంచి మరో చోటుకు మారిన పింఛన్‌దారులకు ప్రభుత్వం వెసులుబాటు

సాక్షి, అమరావతి: పింఛన్ లబ్ధిదారు సొంత రాష్ట్ర పరిధిలో తన పింఛన్‌ను ఓ చోట నుంచి మరొక చోటకి మార్చుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇందులో భాగంగా లబ్ధిదారులు తమ నివాసాన్ని ఒక చోట నుంచి మరొక చోటకి మారే సమయంలో ఆ వివరాలతో సంబంధిత గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులిచ్చారు. అలాగే, నిబంధనల ప్రకారం అర్హత లేని వారికి కూడా కొత్తగా పింఛన్లు మంజూరు చేసే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనుంది. అనర్హులకు పింఛన్ మంజూరు చేస్తే ఆ సొమ్మును మంజూరు చేసిన వారి నుంచి రికవరీ చేయనుంది. పింఛన్ల సొమ్మును దుర్వినియోగ పరచడం..పంపిణీ చేయకుండా మిగిలిపోయిన సొమ్మును తిరిగి ప్రభుత్వ ఖాతాలో జమ చేయకుండా ఉండే సిబ్బందిపైనా తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



తక్షణమే పరిపూర్ణత సాధ్యం కాదన్న కారణంగా మార్పు కోసం ప్రయత్నమే వేయకూడదన్న ముగింపునకు రావాల్సిన తార్కిక ఆవశ్యకత లేదు.
- అరవిందులు

సాక్షి

సోమవారం, సెప్టెంబర్, 26

రైటర్స్ బ్లాక్

చాలా చిన్న విషయమే ఇది. ఏం లేదు... ఫలానా ఊళ్లో నివసించే ఒక రచయిత తన ఊళ్లో పూర్తిగా గుంతలు పడ్డ రోడ్లు చూసి 'చిల్లుల కంబళి' అనే కథ రాయాలనుకున్నాడు. కొంచెం వ్యంగ్యం రాయగలడు. మాట విరుపులో అందె వేసిన చేయి. ఈ గుంతలకు కారకులెవరో నేరుగా చెప్పకుండా కాకినీ, పిచ్చుకనూ పాత్రలుగా చేసి మొత్తం కథ చెప్పేయగలడు. అయినా సరే చిన్న సంశయం వచ్చింది. కథ ఎట్లాగూ తన ఊళ్లోని ఘోరమైన రోడ్ల గురించి. మరి అచ్చయ్యాక మునిసిపల్ కమిషనర్ గారికి ఈ కథ ఎవరైనా చూపిస్తేనో! ఎం.ఎల్.ఏ సముఖాన ఎవరైనా చదివి వినిపిస్తేనో! పార్టీ కార్యాలయంలో ఔత్సాహికులైన కార్యకర్తలు దీనిని రెడ్‌ఇంక్‌తో మార్క్ చేస్తేనో! పాఠకులు చదివి ధర్నాకు ప్లాన్ చేస్తారని పోలీసు వారికి సందేహం వస్తేనో! ఎందుకొచ్చిన గొడవ. 'చిల్లుల కంబళి'ని మూల పడేశాడు. ఆ తర్వాత ఏ కథా రాయలేక పోయాడు. రైటర్స్ బ్లాక్.

'ఎక్స్' మతం, 'వై' మతం, 'జడ్' మతం గురించి ఒక రచయిత ఎంతో అధ్యయనం చేశాడు. మతాల సకారాత్మక, నకారాత్మక చర్యలను, ప్రపంచవ్యాప్తంగా వాటి మధ్య ఘర్షణను, దరిమిలా స్థానిక ప్రతిఫలనాలను విశదం చేసే 500 పేజీల నవల రాయదలిచి మూడు సంవత్సరాలు సెంట్రల్ లైబ్రరీలో మెటీరియల్ కోసం కూసాలు కదుల్చుకున్నాడు. మతాల కంటే ముందు మనిషే ఉంటాడని మనిషిని దాటి దాటి దాటి మతాల దగ్గరకు రావాలని తన నవలకు 'ఏ టు ఆర్' అని పేరు పెట్టుకున్నాడు. నవల చివరలో మార్క్స్‌ను ప్రస్తావిస్తూ 'మతం ఒక మత్తుమందు' అని కూడా రాస్తాడట. మిత్రుడు అంతా విని తక్కిందంతా ఓకేగాని ఈ చివరి వాక్యాన్ని పట్టుకుని తమ వ్యాపారాన్ని దెబ్బ తీసేందుకే ఈ నవల రాశావని 'డిస్టిలరీల జాతీయ సమాఖ్య' వ్యాజ్యం వేస్తే ఏం చేస్తావ్? అన్నాడు.

అంతే. సదరు రచయిత ఆ నవలను అటక ఎక్కించేశాడు. తర్వాత ఏమీ రాయలేదు. రైటర్స్ బ్లాక్.

'సగటు పట్టణం' అనే పట్టణానికి ఢిల్లీ ఎంతో దూరమైనా నిజానికి ఢిల్లీ దూరంగా లేదని అక్కడ నివసించే మరొక రచయితకు తెలిసొచ్చింది. అతడు రాయదలిచింది 'హాయి నడక' అనే కథను! అందులో పెట్రోలు పోయించుకోలేక ఒక సగటు ఉద్యోగి స్కూటర్ మాని ఆఫీసుకు నడక మీద వెళ్లడం మొదలెడతాడు. తొలత ఇబ్బందిగా ఉన్నా తర్వాత నడకలో ఏదో హాయి ఉందని గ్రహిస్తాడు. దారిలో తన లాంటి వాళ్లే పదిమంది కలవడంతో వారి మధ్య స్నేహం చిగురిస్తుంది. వారంతా వాట్సప్ గ్రూప్ పెట్టుకుంటారు. ఈ కథ అచ్చుకు ముందు చదివిన విమర్శక మిత్రుడు 'మంచి కథే గాని స్నేహానికి కొత్త వారధే గాని వాళ్లంతా ఎప్పుడైతే వాట్సప్ గ్రూప్ పెట్టారో అప్పుడే దేశానికి ప్రమాదకరంగా మారారు. కథ అచ్చయ్యాక కేంద్ర జాగరూకత సంస్థ వచ్చి దేశ సార్వభౌమత్వానికి విఘాతం కలిగించడానికే ఆ పది మందీ వాట్సప్ గ్రూప్ పెట్టుకున్నారని అంటే కాదని ఎలా నిరూపిస్తావ్' అన్నాడు. కథ చిరిగిపోయింది.

ప్రస్తుతం ఆ రచయిత సగటు పట్టణంలో సగటు బతుకు బతుకుతున్నాడు. రైటర్స్ బ్లాక్.

దుప్పి పిల్లల్ని, అప్పుడే పుట్టిన లేడి కూనల్ని నోట కరిచి అవి ఆర్తనాదాలు చేస్తున్నా నిశ్చలంగా ఉండగలిగే పులులను 'క్షమాభిక్ష' పేరుతో బోన్ల నుంచి విడిచి పెడతారు. పర్యావరణ హితం కోరే ఒక రచయితకు కథ రాయాలనిపిస్తుంది. రాయలేడు. మిట్ట మీద ఉండే వర్గం వారు పల్లంలో ఉండే వర్గం వారికి కంచె కట్టి ఇబ్బంది పెడతారు. హింసిస్తారు. వివక్షను నిరసించే ఒక రచయితకు కథ రాయాలనిపిస్తుంది. రాయలేడు. కోర్టుకెక్కిన ఫలానా ప్రజావ్యాజ్యంలో న్యాయం ఇదేనని అందరికీ తెలిసినా తీర్పు ఎందుకు ఆలస్యమవుతోంది అని ఒక రచయితకు అసహనం కలుగుతుంది. కథ రాయాలనుకుంటాడు. రాయలేడు. ఆడవాళ్ల బాధలు, ఆదివాసుల బాధలు, ఉద్యోగాలు రాక ఖర్చులకు డబ్బులు లేక కటకటలాడే నిరుద్యోగుల వేదనలు, పేదల పెను ఆర్తనాదాలు, మూలకు నెట్టివేయబడేవారి మూల్గులు, తల్లితండ్రుల చేత చిక్కి ర్యాంకుల వేటలో అల్లాడుతున్న పిల్లల శోకాలు, విస్తారమైన దేశ సంపదలో ఆవగింజంత భాగం కూడా దొరకని కోట్లాది దీనుల మాట పడిపోవడాలు, 12 గంటల చాకిరీకి పొందే చిల్లర జీతాల దీనుల ఈసురోలు, పెను సర్పాలను పట్టి చంపే శక్తిని మరిచిన చలిచీమల మతిమరుపులు... ఇవి కథలు రాయాలని ఉంటుంది చాలామంది రచయితలకు. కానీ రాయలేకపోతున్నారు. రైటర్స్ బ్లాక్.

మామూలుగా అయితే ఏదైనా రాయాలనుకుని రాయలేకపోవడం, రాసేందుకు ఆలోచన, ఆసక్తి సన్నగిల్లిపోవడాన్ని 'రైటర్స్ బ్లాక్' అంటారు. కాని సత్యం పలకక పోవడం వల్ల, పలకలేని వాతావరణం ఉండడం వల్ల బలవంతపు రైటర్స్ బ్లాక్‌కు నేడు రచయితలు గురవుతున్నారు. రచయితలు అప్రియమైన సత్యాలు పలికేది జనం పట్ల ఉన్న ప్రియత్వం వల్లే! పాలకుల పట్ల ఉన్న బాధ్యత వల్లే! సత్యం వినే ఓర్పు ఉండాలి. సత్యం లేని చోట చీకటి చోటు చేసుకుంటుంది.

సరే! మరి రైటర్స్ బ్లాక్ రిస్క్ వద్దనుకునే వారికి రాయడానికి ఏం మిగులుతాయి? ఎన్నో! శృంగార కథలు, ఉద్రేక నవలలు, నేరగాథలు, అత్తాకోడళ్ల కీచులాటలు, వెకిలి హాస్యాలు, కాలక్షేప బఠాణీలు, కన్నీటి చుక్కకుగాని ఆలోచనా వీచికకు గాని వీలు లేని శుష్క వైకల్యాలు.

జాతి సత్యం వైపు ఉండాలా? శుష్కతలో మునిగి తేలాలా?

ఎచ్చట రైటర్స్ బ్లాక్ లేకుండా ఉండునో... అచ్చట ధర్మం ఒక పాదానైనా నడుచును!!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.పాడ్యమి రా.3.11 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తర ఉ.6.56 వరకు, తదుపరి హస్త **వర్జ్యం:** ప.3.32 నుండి 5.12 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.15 నుండి 1.05 వరకు, తదుపరి ప.2.42 నుండి 3.30 వరకు **అమృతఘడియలు:** రా.1.22 నుండి 3.00 వరకు.

సూర్యోదయం: 5.50
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

వక్రీకరణే వజ్రాయుధమా?

తన కాలమిస్టు ఇంటర్వ్యూను అడ్డుపెట్టుకుని విషం కక్కిన 'ఈనాడు'

విలువైన భూములు ఎర్తిన్ ప్రాజెక్ట్‌కు రూ.500 కోట్లకేనంటూ రాతలు

వార్త ఏదైనా వక్రీకరణే ప్రధానం. ఇదీ... రామోజీరావు తాజా సూత్రం. ప్రత్యేక కథనం కావచ్చు... న్యాయస్థానం వ్యాఖ్యలు కావచ్చు... న్యాయ ప్రక్రియ కావచ్చు... ఆఖరికి ఎవరిదైనా ఇంటర్వ్యూ కావచ్చు. దానికి సొంత వ్యాఖ్యానాలు జోడిస్తూ... టార్గెట్ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అంటూ విషం కక్కడమే ఆయన ధ్యేయం. తన పత్రికలో కాలమిస్టుగా వ్యాసాలు రాసే బ్యాంకింగ్ రంగ నిపుణుడు కె.నరసింహమూర్తి ఇంటర్వ్యూను ఆదివారం నాడు పనిగట్టుకుని పతాక శీర్షికల్లో వేయటం కూడా అలాంటి రాజకీయ ఎజెండాలో భాగమే. ఆయన చెప్పిన విషయాలకు... తన సొంత వ్యాఖ్యానం జోడిస్తూ 'ఇందూ సంస్థ తాకట్టుపెట్టిన ఆస్తులన్నింటినీ ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేనమామ కుమారుడు నరేన్ రామానుజుల రెడ్డి డైరెక్టరుగా ఉన్న ఎర్తిన్ ప్రాజెక్ట్స్ ఇటీవల రూ.500 కోట్లకే పొందేందుకు ప్రయత్నించటం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది" అని పేర్కొనటం... ఆ కుట్రలో ఓ ప్రధానాంకం.

- కావాలని సీఎం జగన్ మేనమామ కుమారుడంటూ నరేన్ పేరు ప్రస్తావన
- ఆస్తుల్ని చౌకగా కట్టబెట్టేశారంటూ టీడీపీ, రామోజీ కలిసి మరీ దుష్ప్రచారం
- నిజానికి ఆ 500 కోట్లను కూడా చెల్లించలేకపోయిన 'ఎర్తిన్ ప్రాజెక్ట్స్'
- ఆ ఆస్తులంత విలువైనవే అయితే చెల్లించలేని పరిస్థితి రాదు కదా?
- అయినా లేపాక్షికి భూముల తనఖాకు ఏపీఐఐసీ ఎన్‌ఓసీ ఇచ్చిందెప్పుడు?
- నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ మరణించాక... సీఎం రోశయ్య హయాంలో కాదా?
- దాదాపు సగం భూముల కేటాయింపు జరిగిందీ వైఎస్సార్ మరణించాకేగా?
- ఆ నిజాలను అక్షరం కూడా ప్రస్తావించకుండా దిగజారుడు రాతలు
- అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ భూములపై హైకోర్టులో కౌంటర్ కూడా వేయని బాబు
- బిడ్డింగ్‌లో పాల్గొంటామని ఏపీఐఐసీ తరఫున ఎన్‌సీఎల్‌టీని కోరిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- గడువు ముగిసిపోయింది కాబట్టి కుదరదంటూ తిరస్కరించిన పరిష్కార నిపుణుడు
- దీంతో తాజాగా హైకోర్టులో ఈ కేసుకు సంబంధించి కౌంటర్‌పై ముందడుగు
- ఎర్తిన్ డబ్బులు చెల్లించలేదు కాబట్టి మళ్లీ కొత్తగా ఎన్‌సీఎల్‌టీ బిడ్లు పిలిచే అవకాశం
- హైకోర్టులో కేసు తేలేదాకా ఈ భూముల్ని మినహాయించాలంటున్న ప్రభుత్వం
- ఈ మేరకు ఎన్‌సీఎల్‌టీ ముందు అప్పీలు చేయడానికి కసరత్తు
- భూములు కాపాడటంలో ఎవరికి చిత్తశుద్ధి ఉందో చెప్పటానికి ఈ వాస్తవాలు చాలు
- వీటిని వీసమాత్రమైనా ప్రస్తావించకుండా దుష్ప్రచారంతో రెచ్చిపోతున్న పచ్చ మీడియా



అనంతపురంలో లేపాక్షి భూములు

జగన్ మోహన్ రెడ్డిని రాజకీయంగా దెబ్బతీయటానికి హద్దులే లేనట్లుగా నానాటికీ దిగజారిపోతున్న రామోజీ రావుకు తనలానే తన కుట్రలకూ వయసు మళ్లిందనే విషయం అర్థంకావటం లేదనే అనుకోవాలి. 'ఇందూకు విందు' అంటూ గతనెల్లో పేజీలకు పేజీలు వండేసిన 'ఈనాడు'... ఆ ఆస్తులన్నీ ఎన్‌సీఎల్‌టీ బిడ్డింగ్‌లో ఎర్తిన్ ప్రాజెక్ట్స్ సంస్థ చౌకగా కొట్టేసిందని, అందులో వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మేనమామ కుమారుడు డైరెక్టరని, ఇదంతా పథకం ప్రకారం జరిగిందని రాసి పారేసింది. దానిపై పయ్యావుల కేశవ్ వంటి తెలుగుదేశం నేతలనూ మాట్లాడించేసి... మొత్తంగా అదో కుంభకోణమనే రీతిలో బురద జల్లటానికి ప్రయత్నించింది. కానీ ఏం జరిగింది? ఎర్తిన్ ప్రాజెక్ట్స్ సంస్థ ఇప్పటికీ డబ్బులు పూర్తిగా చెల్లించలేకపోయింది. గడువు ముగిసినా చెల్లింపులు పూర్తి చేయలేదు కాబట్టి బిడ్డింగ్‌ను మళ్లీ నిర్వహిస్తామని ఎన్‌సీఎల్‌టీ పేర్కొంటోంది. అంటే దీనర్థమేంటి రామోజీరావు గారూ?

మీరు చెబుతున్నదే నిజమైతే వేల కోట్ల విలువైన ఆస్తులను రూ.500 కోట్లకే దక్కించుకున్న ఎర్తిన్ సంస్థ డబ్బులు ఎందుకు చెల్లించలేకపోయింది?

వేల కోట్ల విలువైన ఆస్తులు అంత చౌకగా వస్తున్నపుడు ఆ ఎర్తిన్ సంస్థ పిలిచినా ఇన్వెస్టర్లెవరూ ముందుకు రాలేదెందుకు?

అసలు మీరెందుకు బిడ్లు వేయలేదు? మీరో మీ తెలుగుదేశం స్నేహితులో బిడ్లు వేయొచ్చుగా? అంతే చౌకగా కొట్టేయొచ్చుగా? ఎవరు ఆపారు మిమ్మల్ని?

పోనీ ఇప్పుడు మీరు రాస్తున్నట్లుగానే మళ్లీ ఎన్‌సీఎల్‌టీ బిడ్లు పిలిస్తే మీరు ఒంటరిగానో లేక మీ దోచుకో-పంచుకో - తినుకో(డీపీటీ) భాగస్వాములతో కలిసో టెండర్లు వేస్తారా?

వీటికి మీ దగ్గర సమాధానాలున్నాయా రామోజీరావు గారూ!!?

దగుల్బాజీ, దౌర్భాగ్యపు రాతలు కాక వీటినేమనాలి? టెండర్లలో ఎవరూ పాల్గొనకుంటే అప్పుడో రకం రాతలు. ఎవరో ఒకరు దక్కించుకుంటే మరో రకం రాతలు. ఎందుకిదంతా? అసలు లేపాక్షి సంస్థకు ఆ భూముల్ని తనఖా పెట్టుకోవచ్చని ఏపీఐఐసీ నిరభ్యంతరపత్రం (ఎన్‌ఓసీ) ఇచ్చింది ఎప్పుడు? నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి మరణించిన తరవాత కాదా? ఆ విషయాన్ని ఎందుకు రాయరు? లేపాక్షికిచ్చిన భూముల్లో దాదాపు సగం భూముల్ని ఇచ్చింది కూడా వై.ఎస్. రాజశేఖరరెడ్డి మరణించాకేనన్నది నిజం కాదా? మరణించాక జరిగిన పరిణామాలను కూడా దివంగత నేత వైఎస్సార్‌కో, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డికో అంటగడుతూ కథనాలు రాయటం ఏ స్థాయి పాత్రికేయం?


'అసైన్డ్'కు అంత ధర ఎప్పుడైనా ఇచ్చారా?

ఏ ప్రభుత్వమైనా కంపెనీలకు భూములిచ్చేది ఆ ప్రాంత అభివృద్ధి కోసమే. అందుకే అక్కడున్న మార్కెట్ ధరకు కేటాయించటం రివాజు. లేపాక్షి వ్యవహారంలోనూ అంతే. అప్పట్లో అక్కడున్న మండలాల్లో ఎకరా రూ.20-30 వేలకన్నా ఎక్కువ పలకటం లేదని స్థానిక అధికారులు నివేదిక సైతం ఇచ్చారు. అయినా ప్రభుత్వం తన భూములకు ఎకరాకు రూ.50వేలు, రైతుల నుంచి తీసుకునే అసైన్డ్ భూములకు మాత్రం అంతకు దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా... ఎకరా రూ.1.75 లక్షల చొప్పున నిర్ణయించింది. రైతుల కోసం మీ చంద్రబాబు ఇలా ఒక్కరోజైనా ఆలోచించారా? అసలు చంద్రబాబు హయాంలో అసైన్డ్ భూములు లాక్కున్నపుడు రైతులకు చెల్లించిన ధర ఎంత? దీన్ని ఏనాడైనా మీరు ప్రశ్నించారా? మరి మీది పాత్రికేయమంటారా? వైఎస్సార్ గనక మరణించకుండా ఉంటే అక్కడి ప్రాజెక్టు సాకారమై కొన్ని వేల మందికి ఉపాధి దొరికి ఉండేది కాదా? దురదృష్టవశాత్తూ ఆయన మరణించాక జరిగిన సంఘటనలతో ఆయనకు ఏం సంబంధం? ఆయనే ఏదో తప్పు చేశారనే భ్రమ కలిగించేలా ఇంకెన్నాళ్లీ నీచపు రాతలు?

ఎన్‌సీఎల్‌టీ మీ పెరట్లోని చిట్‌ఫండ్ సంస్థా?

జాతీయ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఓ చట్టబద్ధ సంస్థ. అది చేపట్టే ప్రక్రియలోనూ రంధ్రాలు వెదికి... అదేదో కావాలని చౌకగా కట్టబెట్టేసినట్లు అపోహలకు తావిచ్చే కథనాలు వండటం ఎంతవరకూ సమంజసం రామోజీరావు గారూ? అదేమీ మీ పెరట్లోని చిట్‌ఫండ్ సంస్థ కాదు కదా? ఫలానా కంపెనీ పరిష్కార ప్రక్రియ కోసం బిడ్లు పిలుస్తున్నామని అది పత్రికల్లో ప్రకటనలిచ్చి బహిరంగంగా బిడ్లు పిలిచినపుడు మీరెందుకు పాల్గొనలేదు? పాల్గొని దక్కించుకున్నవారిపై ఇలా దిగజారుడు కథనాలు రాయటం ఎంతవరకూ సమంజసం? అసలు ఎన్‌సీఎల్‌టీ బిడ్లలో తామూ పాల్గొంటామని వై.ఎస్.జగన్ ప్రభుత్వమే ఎన్‌సీఎల్‌టీ పరిష్కార నిపుణుడికి లేఖ రాసింది. కానీ గడువు ముగిసిందంటూ ఎన్‌సీఎల్‌టీ తిరస్కరించింది. దీన్నిబట్టి ఆ భూములు కాపాడటానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్న విషయం అర్థంకావటం లేదా? ఈ భూముల కేటాయింపును రద్దుచేస్తూ ఇచ్చిన జీవోను హైకోర్టు పక్కనబెట్టకుండా పెండింగ్‌లో ఉంచింది. అధికారంలో ఉన్న ఐదేళ్లు చంద్రబాబు నాయుడు దీనికి కౌంటర్ వేయకుండా నానుస్తూనే వచ్చారు. మీరు కూడా ఒక్కటంటే ఒక్క అక్షరాన్ని కూడా వృథా చేయలేదు. ఎందుకంటే బాబు ఏం చేసినా మీ మేలు కోసమే గదా మరి!!. ప్రస్తుత ప్రభుత్వమే దీనికి కౌంటర్ దాఖలు చేస్తోంది. అంతేకాకుండా హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది కనక అది తేలేదాకా బిడ్డింగ్ ప్రక్రియ నుంచి ఈ భూముల్ని మినహాయించాలని తాజాగా ఎన్‌సీఎల్‌టీని కూడా కోరింది. చంద్రబాబు హయాంలో ఇలాంటి ప్రయత్నమే జరగలేదు. మీరు మాత్రం ఇప్పుడే ఏదో అన్యాయం జరిగిపోతున్నట్లుగా శివాలెత్తటం చిత్రాతిచిత్రం.

ఏది నిజం?




2008లో చిలమత్తూరు మండలంలోని భూముల మార్కెట్ విలువ ఎకరా రూ.20వేల నుంచి రూ.74,500 మాత్రమే పలుకుతున్నట్లు చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ అధికారికంగా పేర్కొన్న అప్పటి పత్రాలివి. కోడూరులో ఎకరా రూ.24వేల నుంచి రూ.53వేల వరకూ ఉన్నట్లు అధికారులే పేర్కొనటాన్ని చూడొచ్చు.

ఆ డీపీటీ ఇప్పుడు లేదనేగా?

'మంచిని చెప్పకు... వక్రీకరణ వదలకు' అనే రీతిలో ప్రతిరోజూ రాజకీయ ఎజెండాతో చెలరేగిపోతున్న రామోజీ అండ్ కో లక్ష్యం ఒక్కటే. అర్జెంటుగా చంద్రబాబు నాయుడిని తెచ్చి అధికార పీఠంపై కూర్చోబెట్టేయడం. ఎందుకంటే మూడేళ్లుగా వీరి దోపిడీకి... డీపీటీకి అడ్డుకట్ట పడింది. బాబు హయాంలో... నైపుణ్యాభివృద్ధిలో యువతకు శిక్షణ ఇస్తామంటూ 'ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కేంద్రంగా భారీ కుంభకోణం చేసి డొల్ల కంపెనీల ద్వారా కొట్టేసింది రూ.241 కోట్లపైనే. ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టులో ఫేక్ సర్టిఫికెట్లు పెట్టిన కంపెనీలకు రాజమార్గంలో పంపించింది 321 కోట్లపైనే. ఇక ఇసుక ఉచితమంటూ మొత్తం నదులనే కబ్జా పెట్టారు. వేలకోట్లు కొల్లగొట్టేశారు. సాక్షాత్తూ చంద్రబాబు ఇంటివెనకే రాత్రింబవళ్లూ లారీలకొద్దీ ఇసుక రవాణా అయ్యేదంటే పరిస్థితి వేరే చెప్పక్కర్లేదు. అక్రమాలకు అడ్డొచ్చారని మహిళా తహసీల్దారును టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జుట్టుపట్టుకుని ఈడ్చేసినా ఒక్క వార్త ప్రసారం కాలేదు. మద్యం డిస్టిలరీలకు తన వారికే అనుమతులిచ్చి కోట్లు కొల్లగొట్టారు. పర్మిట్ రూమ్‌లకు అనుమతులిచ్చి, బెల్టు షాపులు పెంచి... టార్గెట్లు పెట్టి మరీ విక్రయాలు పెంచారు. పెంచినందుకు ప్రోత్సాహకాలిచ్చారు. ఇక అమరావతి కుంభకోణం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఒక్క అసైన్డ్ భూముల వ్యవహారంలోనే పథకం ప్రకారం చంద్రబాబు, అతని అనుయాయులు 1,100 ఎకరాలు కొట్టేశారు. కాకపోతే వీటన్నిటిపై రామోజీరావుగానీ, ఆయన బృందంలోని ఏబీఎన్, టీవీ5 వంటివేవీ ఒక్క కథనాన్నీ వండి వార్చలేదు. ఎందుకంటే వారి వాటాలు వారికొచ్చాయి. ఇప్పుడు ఇసుక విషయంలో ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్లు.. అంటే ఐదేళ్లలో దాదాపు 4వేల కోట్లు వస్తున్నా... దుష్టచతుష్టయం దృష్టిలో అదో ఘోరమైన తప్పిదమే. కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి సబ్ కాంట్రాక్టుకిచ్చేశారంటూ అదో ఘోరమైన నేరంలా బురద జల్లే కథనాలు దాదాపు రోజూ కనిపిస్తూనే ఉన్నాయి. మద్యం విక్రయాలు తగ్గించడానికి పర్మిట్ రూమ్‌లు రద్దు చేసి, బెల్టుషాపులు తీసేసినా తప్పే. బాబు అనుమతిచ్చిన డిస్టిలరీలే ఇప్పుడూ మద్యం సరఫరా చేస్తున్నా... నాసిరకమంటూ, పేరులేని బ్రాండ్లంటూ ప్రతిరోజూ తప్పుడు ప్రచారమే. అయినా... బాబు హయాంలో జరిగిన ఐఎంజీ లాంటి కుంభకోణాల్ని కూడా అందమైన చందమామ కథల్లా పాఠకులకు చెప్పిన చరిత్ర 'ఈనాడు'ది. అలాంటి పత్రిక నుంచి ఇంతకన్నా మెరుగైన కథనాలెలా ఆశించగలం??

సాహితీ చక్రవర్తి

కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం... కవి, విద్యాదాత, పత్రికా సంపాదకుడు, సమాజసేవకుడు. పలు రంగాల్లో ఆయన చేసిన కృషి అనన్యమైనది. 'కర్పూర మంజరి', 'రఘుకుల చరిత్ర', 'సిద్ధార్థ', 'ప్రసన్న యాదవం', 'గణపతి', 'గయోపాఖ్యానం' వంటి ఎన్నో రచనలు చేశారు. పత్రికా సంపాదకుడిగా 'దేశమాత', 'మనోరమ' పత్రికల ద్వారా పాలకుల అవినీతి, అక్రమాలను ఎత్తిచూపారు. ఇందుకు బ్రిటిష్ వాళ్లు హెచ్చరికలు జారీ చేసినా వాటిని లెక్కచేయకుండా ధిక్కరించిన ధైర్యశాలి ఆయన. విద్య ఏ ఒక్కరి సొత్తు కాదనీ, అది అందరికీ లభించాలనే ఆశయంతో ఎన్నో పాఠశాలలు నడిపారు. దళితులకు ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించి ఉచితంగా పుస్తకాలు, పెన్సిళ్లు అందించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన మహనీయుడు. ఆ రోజుల్లోనే వయోజనులకు రాత్రి పాఠశాలలు నెలకొల్పారు. అలాగే స్వాతంత్ర్యోద్యమంలోనూ ఆయన చురుకుగా పాల్గొన్నారు. 1914లో మద్రాసులో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో ఉపన్యసించి ప్రజల్లో దేశాభిమానాన్ని రేకెత్తించారు. చిలకమర్తివారు అంధులైనప్పటికీ ఎందరి జీవితాలకో వెలుగు నిచ్చిన ప్రకాశవంతుడు. దేశ సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసిన ధన్యజీవి.



చిలకమర్తి లక్ష్మీనరసింహం

– చిలకమర్తి కృష్ణ మల్లేశ్వర కుమార్

(నేడు హైదరాబాద్ త్యాగరాయ గానసభలో చిలకమర్తి 155వ జయంతి ఉత్సవం)


సినీ నవ్య పథగామికి సెలవ్!

"సంగీతానికి బాబ్ డిలాన్ ఎంతో... సినిమాకు గొడార్డ్ అంత!"
– నేటి మేటి హాలీవుడ్ దర్శకుడు క్వెంటిన్ టరంటినో

అవును... గొడార్డ్ అంతటి సినీ దిగ్గజమే! వెండితెర విప్లవమైన ఫ్రెంచ్ న్యూవేవ్ సినిమా ఉద్యమాన్ని తెచ్చిన ఆరేడుగురు మిత్రబృందంలో అగ్రగామి. సినీ రూపకల్పన సూత్రాలను తిరగరాసిన అనేక చిత్రాలకు తన తొలి సినిమాతోనే బీజం వేసిన పెద్దమనిషి. విమర్శకుడిగా మొదలై దర్శకుడైన సినీ మేధావి. ఈ 91 ఏళ్ళ ప్రపంచ ప్రసిద్ధ ఫ్రెంచ్ సినీ దర్శక వరేణ్యుడు విషాదభరిత రీతిలో సెప్టెంబర్ 13న ఇంట్లోనే తుదిశ్వాస విడిచారు. ఆత్మహత్యకు సాయం తీసుకొని అంతిమ ప్రయాణం చేశారు. అవయవాలేవీ పనిచేయనివ్వని అనేక వ్యాధుల పాలైన ఆయనకు స్విట్జర్లాండ్‌లో చట్టబద్ధమైన ఆ రకమైన తుది వీడ్కోలు సాంత్వన చూపింది. అంతేకాదు... ఆ రకమైన ఆత్మహత్య సంగతి అధికారికంగా చెప్పాలనీ ముందే ఆయన మాట తీసుకున్నారు. అలా ఆఖరులోనూ గొడార్డ్‌ది నవ్య పంథాయే!

1930 డిసెంబర్‌లో పుట్టిన గొడార్డ్ 1950లో కొందరితో కలసి 'గెజెట్ డ్యూసినిమా' అనే సినిమా పత్రిక స్థాపించి, అనేక వ్యాసాలు రాశారు. 1952 నుంచి ఆ మిత్ర బృందంతో గొంతు కలిపి, న్యూవేవ్ సినిమాకు దన్నుగా విమర్శ వ్యాసాలు వెలువరించారు. మొదట లఘుచిత్రాలు, ఆనక 1959లో తొలి సినిమా తీశారు. దాన్ని ఖండఖండాలుగా కట్ చేయాల్సి వచ్చినప్పుడు, అవసరానికి ఆయన మొదలెట్టినదే 'జంప్ కట్' ఎడిటింగ్. ఇవాళ అదే ప్రపంచ సినిమాలో ఓ వ్యవస్థీకృత విధానమైంది.

విమర్శకుడిగా మొదలై దర్శకుడైన ఈ సినీ మేధావి రూటే సెపరేటు. నటీనటులు సహజంగా ప్రవర్తిస్తుంటే, కెమేరా నిరంతరం కదులుతూ పోతుంటే, స్క్రిప్టు అక్కడికక్కడ స్పాట్‌లో మెరుగులు దిద్దుకుంటూ ఉంటే, ఎడిటింగ్‌లో మునుపెరుగని వేగం ఉంటే... అదీ గొడార్డ్ సినిమా. స్టయిలిష్‌గా సాగే తొలి చిత్రం 'బ్రెత్‌లెస్'తోనే ఇటు విమర్శక లోకాన్నీ, అటు బాక్సాఫీస్ ప్రపంచాన్నీ కళ్ళప్పగించి చూసేలా చేసిన ఘనత ఆయనది. ఆ పైన 'కంటెప్ట్' లాంటి గొప్ప చిత్రాలు తీశారు. మలి చిత్రంలో నటించిన డ్యానిష్ మోడల్ అన్నా కరీనాను పెళ్ళాడి, ఆమెతో హిట్ సినిమాలు చేశారు. 1968లో ఫ్రాన్స్‌లో విద్యార్థుల, శ్రామికుల నిరసనకు సంఘీభావంగా నిలబడి కాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను రద్దు చేయించారు. ఆ ఏడాదే ఓ మార్క్సిస్ట్ సినీ బృందాన్ని స్థాపించి, సామ్యవాదాన్ని అక్కున చేర్చుకోవడం మరో అధ్యాయం. 1960లలో విరామం లేకుండా వరుసగా సినిమాలు తీసిన గొడార్డ్ 1970లకు వచ్చేసరికి స్విట్జర్లాండ్‌లోని ఓ టీవీ స్టూడియోలో పనిచేస్తూ, కొత్త మీడియమ్ వీడియో వైపు దృష్టి మళ్ళించారు. 1980లలో సినీ రూపకల్పనకు తిరిగొచ్చి, '94 వరకు అనేక చిత్రాలు తీశారు.





ఫ్రెంచ్ సినీ దిగ్గజం గొడార్డ్ (1930 - 2022)

దర్శకుడిగా గొడార్డ్‌లో మూడు దశలు. న్యూవేవ్ గొడార్డ్ (1960-67)గా మొదలైన ఆయన ర్యాడికల్ గొడార్డ్ (1968-72)గా పరిణామం చెంది, 1980ల అనంతరం వీటన్నిటికీ భిన్నమైన దర్శకుడిగా పర్యవసించారు. వస్తువుకూ- శిల్పానికీ, మనసుకూ - మెదడుకూ సమరస మేళవింపు ఆయన సినిమాలు. ఆయన రాజకీయాలు చూపెడతారు. కానీ ప్రబోధాలు చేయరు. సినిమానే శ్వాసించి, జీవించడంతో తెరపై అణువణువునా దర్శనమిస్తారు. ప్రతి సినిమాతో సినీ ప్రేమికుల మతి పోగొడతారు. సినిమాలో కవిత్వాన్నీ, తనదైన తాత్త్వికతనూ నింపేసిన ఆయన, నిర్దిష్ట పద్ధతిలోనే కథాకథనం సాగాలనే ధోరణినీ మార్చేశారు. స్థల కాలాదులను అటూ ఇటూ కలిపేసిన కథాంశాలతో సినిమాలు తీశారు. 'కథకు ఆది మధ్యాంతాలు అవసరమే. కానీ, అదే వరుసలో ఉండాల్సిన పని లేద'ని నమ్మారు. దాదాపు 100కు పైగా సినిమాలు తీసినా, ఎప్పటికప్పుడు కొత్తదనం కోసమే పరితపించారు. ఆయన సినిమాల్లో రిలీజ్ కానివి, సగంలో ఆగినవి, నిషేధానికి గురైనవీ అనేకం.

నాలుగేళ్ళ క్రితం 87 ఏళ్ళ వయసులో 2018లోనే గొడార్డ్ తాజా చిత్రం రిలీజైంది. కెరీర్‌లో ఒక దశ తర్వాత ఆలోచనాత్మకత నుంచి అర్థం కాని నైరూప్య నిగూఢత వైపు ఆయన కళాసృష్టి పయనించిందనే విమర్శ లేకపోలేదు. అయితేనేం నేటికీ పాత చలనచిత్ర ఛందోబంధాలను ఛట్‌ఫట్‌మనిపించిన వినిర్మాణ శైలి దర్శకుడంటే ముందు గొడార్డే గుర్తుకొస్తారు. అందుకే, 2011లో గొడార్డ్‌కు గౌరవ 'ఆస్కార్' అవార్డిస్తూ 'సినిమా పట్ల మీ అవ్యాజమైన ప్రేమకు.. నిర్దిష్ట సూత్రాలపై మీ పోరాటానికి.. నవీన తరహా సినిమాకు మీరు వేసిన బాటకు..' అంటూ సినీ ప్రపంచం సాహో అంది.

రచయితల్లో జేమ్స్ జాయిస్, రంగస్థల ప్రయోక్తల్లో శామ్యూల్ బెకెట్‌లా సినిమాల్లో గొడార్డ్ కాలాని కన్నా ముందున్న మనిషి. సమకాలికులు అపార్థం చేసుకున్నా, భావి తరాలపై ప్రభావమున్న సృజనశీలి. నవీన మార్గం తొక్కి, ఇతరులు తమ ఆలోచననూ, ఆచరణనూ మార్చుకొనేలా చేసిన ఘనుడు. ఏ రోజు సీన్లు ఆ రోజు సెట్స్‌లో రాస్తూ, చేతిలో పట్టుకొనే చౌకరకం కెమెరాలతో, ఎదురెదురు అపార్ట్‌మెంట్లలో, తెలిసిన బంధుమిత్రులే నటీనటులుగా సినిమా తీస్తూ అద్భుతాలు సృష్టించిన జీనియస్. ఆయన ర్యాడికల్ శైలి ఎందరిలోనో సినీ సృజనకు ఉత్ప్రేరకం. ఆ ప్రభావం అనుపమానం. అది ఎంత గొప్పదంటే... ఆయన సినిమాలు చూస్తూ వచ్చిన హాలీవుడ్ కుర్రకారులో అసంఖ్యాకులు కెమేరా పట్టి, లోబడ్జెట్, స్వతంత్ర చిత్రాలు తీయసాగారు. ఆయన టెక్నిక్‌లే వారి యాడ్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీల రూపకల్పనకు తారకమంత్రమయ్యాయి.

సంప్రదాయంపై తిరుగుబాటు చేసి, హాలీవుడ్‌నే ధిక్కరించిన ఓ దర్శకుడిని ఆ హాలీవుడ్డే అలా ఆరాధించడం వింతల్లోకెల్లా వింత. మరెవరికీ దక్కని ఘనత. హాలీవుడ్ దర్శకుడు క్వెంటిన్ టరంటినో పైనా 'అమితంగా ప్రభావం చూపిన దర్శకుడు' గొడార్డే! తన గురువు కాని గురువు తీసిన 'బ్యాండ్ ఆఫ్ అవుట్‌సైడర్స్' స్ఫూర్తితోనే టరంటినో తన స్వీయ సినీ నిర్మాణ సంస్థకు 'ఎ బ్యాండ్ ఎపార్ట్' అని పేరు పెట్టారు. అన్ని వ్యవస్థలనూ ప్రతిఘటించిన గొడార్డ్ తనకు తెలియకుండా తానే ఒక వ్యవస్థ కావడం ఓ విరోధాభాస. ఆయన తన సినిమాల్లో చెప్పిన అంశాలు ముఖ్యమైనవే. కానీ, చెప్పీచెప్పకుండా అంతర్లీనంగా అలా వదిలేసినవి మరీ ముఖ్యమైనవి. 'ఫోటోగ్రఫీ సత్యం. సినిమా సెకనుకు 24 సార్లు తిరిగే సత్యం. ఎడిట్ చేసిన ప్రతిదీ అసత్యమే' అనేవారాయన. ఆ సత్యాసత్యాల సంఘర్షణలే ఆయన చిత్రాలు. ఒక్కమాటలో సినిమాను తన సెల్యులాయిడ్ రచనగా మలుచుకున్న అరుదైన దర్శకుడు గొడార్డ్.

బతికుండగానే ఆయనపై ఆయన శైలిలోనే ఒక సినిమా రావడం విశేషం. గొడార్డంటే ఫ్రెంచ్ న్యూవేవ్ అంటాం. కానీ, జాగ్రత్తగా గమనిస్తే 1960ల తర్వాత ప్రపంచం నలుమూలల్లో ప్రతి నవ్యధోరణిలో ఆయన దర్శనమిస్తారు. ఆయన శైలి, సంతకాలు మన బాలీవుడ్ సినిమాల్లోనూ కనిపిస్తాయి. సినిమా సరిహద్దుల్ని విస్తరించిన గొడార్డ్‌తో ప్రభావితుడైన దర్శకుడు మార్టిన్ స్కార్సెసే అన్నట్టు "సినీ రంగంలో అతి గొప్ప ఆధునిక దృశ్యచిత్రకారుడు." చిత్రకళకు ఒక పికాసో. సినిమాకు ఒక గొడార్డ్! రాబోయే తరాలకూ ఆయన, ఆయన సినిమా గుర్తుండిపోయేది అందుకే!

– రెంటాల జయదేవ



SAATCHI & SAATCHI

ప్రధాని మోదీ బతుకమ్మ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ: తెలంగాణ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ నారీ శక్తికి శుభాకాంక్షలంటూ ట్వీట్ చేశారు. ''మహాలయ అమావాస్య సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలి'' అని ఆకాంక్షించారు.

క్లుప్తంగా...

మరింత మందిని కనండి

ఇటాలియన్లకు పోప్ పిలుపు



మటేరా: ఎన్నికల వేళ ఇటాలియన్లు మరింత మంది పిల్లలను కనాలంటూ పోప్ ఫ్రాన్సిస్ ఇచ్చిన పిలుపు అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఆదివారం మటేరాలో ఆయన బిషప్‌ల సమావేశంలో ఈ మేరకు కోరారు. వలసదారులను స్వాగతించాలని పిలుపునిచ్చారు. దేవుడు కుటుంబం, మాతృభూమి'నినాదంతో ప్రచారం చేస్తున్న మెలోనీ నేతృత్వంలోని రైటిస్ట్ పార్టీ కూడా ఎక్కువ మందిని కంటే ప్రోత్సాహకాలిస్తామని వాగ్దానం చేస్తోంది. ప్రపంచంలోనే అత్యంత తక్కువ జననాల రేటున్న దేశాల్లో ఇటలీ ఒకటి.

ఏజీ పోస్ట్ నాకొద్దు: రొహత్గీ



న్యూఢిల్లీ: అటార్నీ జనరల్ పదవిని సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రొహత్గీ తిరస్కరించారు. వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆదివారం చెప్పారు. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్(91) పదవీ కాలం ఈ నెల 30వ తేదీతో ముగియనుండటంతో ఆ పదవికి రొహత్గీని కేంద్రం ఎంపిక చేయడం తెలిసిందే.

బంగ్లాలో పడవ మునక.. 24 మంది భక్తులు మృతి

ఢాకా: మహాలయ సందర్భంగా ఆదివారం బంగ్లాదేశ్‌లోని పురాతన బోదేశ్వరి ఆలయానికి 80 మందితో వెళ్తున్న పడవ నీట మునిగింది. 24 మంది చనిపోగా పలువురు గల్లంతయ్యారు. సామర్థ్యానికి మించి ప్రయాణిస్తున్నందునే పడవ మునిగిందని తేలింది.

ఉత్తర కొరియా మళ్లీ క్షిపణి ప్రయోగం

సియోల్: ఉత్తరకొరియా ఆదివారం స్వల్ప శ్రేణి క్షిపణి ప్రయోగం జరిపింది. దక్షిణ కొరియాతో సంయుక్త సైనిక విన్యాసాల కోసం అమెరికాకు విమాన వాహక నౌక ఆ ప్రాంతానికి చేరడంతో ఉద్రిక్తతలను రాజేసేందుకే ఉత్తర కొరియా ఈ చర్యకు పూనుకున్నట్లు భావిస్తున్నారు. ఈ ఏడాది ఆ దేశం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి సహా 30 బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించింది.

కశ్మీర్‌లో ఇద్దరు అక్రమ చొరబాటుదారుల కాల్చివేత

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఆదివారం నియంత్రణ రేఖ వెంబడి అక్రమ చొరబాటును బలగాలు విజయవంతంగా అడ్డుకున్నాయి. మాచిల్ సెక్టార్‌లో సరిహద్దు ఆవలి నుంచి అక్రమ చొరబాట్లకు అవకాశం ఉందన్న నిఘా వర్గాల సమాచారం మేరకు బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉదయం 7.30 గంటల సమయంలో టెక్రినార్ వద్ద సైన్యం ఇద్దరు ముష్కరులను కాల్చి చంపింది. వారి వద్ద ఉన్న రెండు ఏకే–47 రైఫిళ్లు, నాలుగు గ్రనేడ్లు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ఆధార్ చూపిస్తేనే పెళ్లి భోజనం

అమ్రోహా(యూపీ): అక్కాచెల్లెళ్ల వివాహాలను ఒకే రోజు జరిపించింది ఓ కుటుంబం. దాంతో బంధు మిత్రులు, తెల్సినవారు తండోపతండాలుగా హాజరయ్యారు. అంతమందికీ సరిపడా భోజన ఏర్పాట్లు చేయడంలో కుటుంబం విఫలమైంది. పైగా పిలవని వాళ్లు కూడా భారీగా వచ్చారేమోనని అనుమానం. దాంతో, ఆధార్ కార్డును చూపిస్తేనే భోజనం ప్లేటు ఇస్తామని ప్రకటించారు. దీంతో అతిథులు హతాశులయ్యారు. ఆధార్ కార్డులున్న వారు వాటిని చూపించి భోజనాలు కానిచ్చేశారు. మిగతావాళ్లు ఇదేం అవమానమంటూ వెళ్లిపోయారు. యూపీలోని అమ్రోహా జిల్లాలోని హసన్‌పూర్‌లో జరిగిన ఈ వింత ఘటన తాలూకు వీడియోలు వైరల్‌గా మారాయి.

పాక్ నేతల ఆడియో సంభాషణలు లీక్ కలకలం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రభుత్వంలోని కీలక నేతల మధ్య సాగిన సంభాషణల ఆడియో క్లిప్పులు బయటకు రావడం కలకలం రేపుతోంది. అత్యంత భద్రత ఉండే ప్రధానమంత్రి కార్యాలయంలో అధికార పాకిస్తాన్ ముస్లిం లీగ్(నవాజ్) నేతల సంభాషణలు ఆ క్లిప్పుల్లో ఉండటం గమనార్హం. అంతర్గత, రక్షణ, న్యాయ, ఆర్థిక శాఖల మంత్రులు రాణా సనా ఉల్లా, ఖ్వాజా ఆసిఫ్, ఆజం తరార్, అయాజ్ సాదిఖ్‌లు గత తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ ప్రభుత్వం గద్దె దిగడంపై చేసిన వ్యాఖ్యలు అందులో ఉన్నాయి. మరో ఆడియో క్లిప్పులో, ఆర్థిక మంత్రి ఇస్మాయిల్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పీఎంఎల్–ఎన్ ఉపాధ్యక్షురాలు మరియం నవాజ్, ఆర్థిక మంత్రి షెహబాజ్ షరీఫ్‌ల మధ్య జరిగిన సంభాషణ ఉంది. ప్రభుత్వం ఈ వ్యవహారంపై స్పందించలేదు. ప్రతిపక్షాలు మాత్రం సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి.

దివ్యాంగురాలైన కూతురి కోసం రోబో

గోవాలో ఓ దినసరి కూలీ ఘనత

పనజి: ఆయన పేరు బిపిన్ కదమ్. వయసు 40 ఏళ్లు. ఉండేది గోవాలో. పని చేసేది దినసరి కూలీగా. కదమ్‌కు ఓ 14 ఏళ్ల కూతురు. దివ్యాంగురాలు. చేతులు కదపలేదు. తినిపించడం మొదలుకుని అన్ని పనులూ దగ్గరుండి చూసుకునే తల్లేమో దీర్ఘకాలిక వ్యాధితో రెండేళ్ల క్రితం పూర్తిగా మంచాన పడింది. కదమ్ సాయంత్రం పని నుంచి ఇంటికొచ్చాక తినిపిస్తేనే పాపకు భోజనం. భార్య నిస్సహాయత, కూతురి కోసం ఏమీ చేయలేక ఆమె పడుతున్న వేదన ఆయన్ను బాగా ఆలోచింపజేశాయి. దాంతో కూతురికి వేళకు తిండి తినిపించేందుకు ఏకంగా ఓ రోబోనే తయారు చేసేశాడు కదమ్! ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా ఎవరి సాయమూ తీసుకోకుండా ఏడాది పాటు తదేకంగా శ్రమించాడు. ఆన్‌లైన్ సమాచారం ఆధారంగా చివరికి సాధించాడు. ఈ రోబో వాయిస్ కమాండ్‌కు అనుగుణంగా పని చేస్తుంది. పాప కోరిన మేరకు పండ్లు, దాల్ రైస్ వంటివి తినిపిస్తుంది. అమ్మలా ఆకలి తీరుస్తోంది గనుక దీనికి 'మా రోబో' అని పేరు పెట్టాడు కదమ్. ఇప్పుడు రోజంతా కష్టపడి సాయంత్రం ఇంటికి రాగానే కూతురి నవ్వు ముఖం చూస్తే ఎనలేని శక్తి వస్తోందని చెబుతున్నాడు. కదమ్ ఘనతను గోవా ఇన్నొవేషన్ కౌన్సిల్ ఎంతో మెచ్చుకుంది. కమర్షియల్‌గా మార్కెటింగ్ చేసేందుకు వీలుగా రోబోను మరింత మెరుగుపరచాలని సూచించింది. అందుకు ఆర్థిక సాయం కూడా చేస్తోంది. ''ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్‌ను ప్రోత్సహిస్తున్నారు. అదే మాదిరిగా నా కూతురు కూడా నాతోపాటు ఎవరి మీదా ఆధారపడకుండా ఆత్మనిర్భర్‌గా ఉండాలన్న తపనే నాతో ఈ పని చేయించింది'' అంటున్నాడు కదమ్.



బరువు తగ్గితే రూ.10 లక్షలు

ఉద్యోగులకు సీఈఓ బంపర్ ఆఫర్



ముంబై: జెరోడా అనే ఆన్‌లైన్ బ్రోకరేజీ కంపెనీ ఉద్యోగులకు సీఈఓ నితిన్ కామత్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. బరువు తగ్గితే మంచి ఇన్సెంటివ్‌లు ఇస్తారట. అంతేకాదు, ఒక లక్కీ విజేతకు ఏకంగా రూ.10 లక్షల రివార్డు ప్రకటించారు. ఇందుకోసం వారు రోజుకు కనీసం 350 క్యాలరీలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలా ఏడాది పాటు శ్రమించి లక్ష్యంలో 90 శాతం సాధించిన వారందికీ నెల వేతనం బోనస్‌గా ఇస్తారు! దీనికి తోడు రూ.10 లక్షల బంపర్ బొనాంజా ఉండనే ఉంది! దాంతో ఈ ఫిట్‌నెస్ చాలెంజ్‌ను సీరియస్‌గా తీసుకుని ఉద్యోగులంతా గట్టిగానే శ్రమిస్తున్నారట. అన్నట్టూ, ఎవరు ఏ మేరకు కొవ్వు కరిగిస్తున్నదీ కంపెనీ తాలూకు ఫిట్‌నెస్ ట్రాకర్ గమనిస్తుంటుందట. ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఈ కంపెనీకి కొత్తేమీ కాదట. 25 కంటే తక్కువ బీఎంఐ ఉన్న ఉద్యోగులకు ఇప్పటికే సగం నెల వేతనం బోనస్‌గా ఇస్తోంది!! వర్క్ ఫ్రం హోం వల్ల స్థూలకాయం తెచ్చుకుని అనారోగ్యం పాలు కావొద్దన్నదే తమ ఉద్దేశమంటున్నారు కామత్. కరోనా కాలంలో పెరిగిన బరువును తానెలా తగ్గించుకున్నదీ చెబుతూ ఉద్యోగులను మోటివేట్ చేస్తున్నారు.

రాజస్తాన్ కాంగ్రెస్‌లో అలజడి

- అశోక్ గెహ్లోట్ వర్గం ఎమ్మెల్యేల రాజీనామా
- స్పీకర్‌కు రాజీనామా సమర్పించిన 92 మంది ఎమ్మెల్యేలు
- పైలట్ అభ్యర్థిత్వానికి వ్యతిరేకత





జైపూర్: రాజస్తాన్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. పార్టీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్న అశోక్ గెహ్లోట్ మద్దతుదారులైన 92 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఆదివారం సాయంత్రం అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషీకి అందజేశారు. గెహ్లోట్ రాజీనామా తర్వాత రాజస్తాన్ సీఎం రేసులో ముందున్న సచిన్ పైలట్‌కు వ్యతిరేకంగా వారంతా ఈ నిర్ణయం తీసుకున్నారు. సచిన్ పైలట్ అభ్యర్థిత్వం పట్ల గెహ్లోట్ వర్గం ఎమ్మెల్యేలు ఆగ్రహంతో ఉన్నారు. గెహ్లోట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైతే రాజస్తాన్ సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు పైలట్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, పైలట్‌కు అవకాశం ఇవ్వొద్దని, తమ వర్గంలోనే ఒకరు సీఎం కావాలని గెహ్లోట్ వర్గం భావిస్తోంది. కొత్త ముఖ్యమంత్రి ఎవరన్నది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అశోక్ గెహ్లోట్ నిర్ణయిస్తారని రాజస్తాన్ మంత్రి ప్రతాప్‌సింగ్ చెప్పారు. పైలట్ సీఎం కావడం ఎమ్మెల్యేలకు ఇష్టం లేదని, అందుకే రాజీనామాలు సమర్పించారని అన్నారు. స్పీకర్ సీపీ జోషీ, రాజస్తాన్ పీసీసీ అధ్యక్షుడు గోవింద్‌సింగ్ దొటాస్రా కొత్త సీఎం రేసులో ఉంటారని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తమ అభిప్రాయాన్ని పార్టీ నాయకత్వానికి తెలియజేస్తామన్నారు. అశోక్ గెహ్లోట్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిలోపాటు సీఎం పోస్టులనూ కొనసాగితే బాగుంటుందని కాంగ్రెస్ నేత గోవింద్‌రామ్ మేఘ్వాల్ అభిప్రాయపడ్డారు.

రాకీ సావంత్ కూడా పోటీ చేయొచ్చు: హేమమాలిని

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని మథుర లోక్‌సభ స్థానం నుంచి వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బాలీవుడ్ నటి కంగనా రనౌత్ పోటీ చేయబోతున్నారంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే అంశంపై మీడియా అడిగిన ప్రశ్నకు మథుర ప్రస్తుత బీజేపీ ఎంపీ, సినీ నటి హేమమాలిని వ్యంగ్యంగా స్పందించారు. మథురలో కేవలం సినీ నటులే కావాలనుకుంటే రాకీ సావంత్ కూడా పోటీ చేయొచ్చు అని బదులిచ్చారు. ఎవరు ఎక్కడ పోటీ చేయాలో దేవుడే నిర్ణయిస్తాడని అన్నారు.

థర్డ్ ఫ్రంట్ ప్రశ్నే లేదు

కాంగ్రెస్‌తో కూడిన కొత్త కూటమి

- ఐఎన్‌ఎల్‌డీ బహిరంగ సభలో నితీశ్
- హాజరైన పలు విపక్షాల నేతలు



ర్యాలీ వేదికపై ఓపీ చౌతాలా, శరద్ పవార్, నితీశ్, తేజస్వీ యాదవ్, ఏచూరి, బాదల్ తదితరులు

ఫతేబాద్: 2024 లోక్‌సభలో ఎన్నికల్లో బీజేపీని మట్టి కరిపించడానికి కాంగ్రెస్ పార్టీతో కూడిన కొత్త కూటమి ఏర్పాటు కావాలని బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నాయకుడు నితీశ్ కుమార్ పిలుపునిచ్చారు. బీజేపీకి వ్యతిరేకంగా బలమైన ఐక్య కూటమి బరిలోకి దిగాల్సిన అవసరముందన్నారు. థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు అనే ప్రశ్నే లేదని తేల్చిచెప్పారు. బీజేపీని ఓడించడం కాంగ్రెస్‌తో కూడిన కూటమితోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. దివంగత ఉప ప్రధానమంత్రి దేవీలాల్ జయంతి సందర్భంగా ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డీ) ఆధ్వర్యంలో ఆదివారం హరియాణాలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పలువురు ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు. నితీశ్‌తోపాటు ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఐఎన్ఎల్‌డీ నేత ఓంప్రకాశ్ చౌతాలా, శిరోమణి అకాలీదళ్ నాయకుడు సుఖ్‌బీర్‌సింగ్ బాదల్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, బిహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, శివసేన నాయకుడు అరవింద్‌సావంత్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ నేతలెవరూ పాల్గొనలేదు. పశ్చిమ బెంగాల్, తెలంగాణ సీఎంలు మమతా బెనర్జీ, కేసీఆర్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ కూడా దూరంగా ఉండడం గమనార్హం.


కేంద్రంలో మార్పు జరిగితేనే..

రాజకీయ లబ్ధి కోసం హిందూ, ముస్లిం అంటూ ప్రజలను బీజేపీపై విభజిస్తోందని నేతలు నిప్పులు చెరిగారు. తప్పుడు హామీలిస్తూ మభ్యపెడుతోందని విమర్శించారు. జీవనోపాధి లేక రైతులు, యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో కేంద్రంలో బీజేపీని ఓడించడమే పరిష్కార మార్గమన్నారు. కేంద్రంలో మార్పు జరిగితేనే రైతన్నలు, నిరుద్యోగ యువత జీవితాలు బాగుపడతాయన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు.

మెయిన్ ఫ్రంట్ కావాలి

దేశాన్ని సరైన దిశలో నడిపించలేకపోతున్న మేనేజర్(ప్రధానమంత్రి)ని మార్చేయాలని ఏచూరి అన్నారు. కాంగ్రెస్‌తో సహా విపక్షాలన్నీ ఒకే వేదిక పైకి రావాలన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు లేకుండా విపక్ష ఫ్రంట్ అసాధ్యమని నితీశ్ తేల్చిచెప్పారు. సమస్యలను వదిలి బీజేపీ ముస్లిం, పాకిస్తాన్, మందిర్, మసీద్ జపం చేస్తోందని తేజస్వీ ధ్వజమెత్తారు. ఇప్పుడు ఎన్డీయే ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ అంటే బడా ఝూటా పార్టీ అని ఎద్దేవా చేశారు. బహిరంగ సభ అనంతరం నితీశ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి పదవికి తాను పోటీ పడడం లేదని చెప్పారు.

ఎయిర్‌పోర్టుకు భగత్ సింగ్ పేరు: మోదీ



న్యూఢిల్లీ: చండీగఢ్ విమానాశ్రయానికి స్వాతంత్య్ర సమరయోధుడు భగత్ సింగ్ పేరు పెట్టనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. వాతావరణ మార్పులు మానవళికి పెను సవాళ్లు విసురుతున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు మనమంతా కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ఆదివారం 'మన్ కీ బాత్'లో మాట్లాడారు. బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా నివాళులర్పించారు.

చీతాలను పరిశీలించడానికి టాస్క్‌ఫోర్స్

''చీతాలు తిరిగిరావడం 130 మంది భారతీయులకు గర్వకారణం. అడవిలో వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించడానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నాం. చీతాలను ప్రత్యక్షంగా వీక్షించడానికి ప్రజలను ఎప్పటినుంచి అనుమతించాలన్నది టాస్క్‌ఫోర్స్ సూచనల ఆధారంగా నిర్ణయిస్తాం. మన దేశంలో చీతాలను పెంచే కార్యక్రమానికి మీరే ఒక పేరు పెట్టండి. చీతాలకు కూడా పేర్లు సూచించండి. మీ పేర్లు ఎంపికైతే చీతాలను మొదటగా చూసే అవకాశం మీదే. సెప్టెంబర్ 28న భగత్ సింగ్ జయంతి. ఆయనకు ఘనంగా నివాళులర్పించడానికి చండీగఢ్ ఎయిర్‌పోర్ట్‌కు ఆయన పెట్టాలని నిర్ణయించాం. ఈ నిర్ణయం కోసం చాలా ఏళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. స్వాతంత్య్ర యోధుల నుంచి స్ఫూర్తి పొందుదాం. వారి ఆదర్శాలకు అనుగుణంగా దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దుకుందాం. అదే వారికి అసలైన నివాళి. సమర యోధుల స్మారకాలు, వారి పేర్లతో కూడిన ప్రదేశాలు, సంస్థలు మనలో స్ఫూర్తిని నింపి, కార్యాచరణ దిశగా నడిపిస్తాయి.

సర్జికల్ స్ట్రైక్.. ఫుల్ జోష్

సెప్టెంబర్ 28న వేడుకలు చేసుకోవడానికి మరో కారణమూ ఉంది. అదే సర్జికల్ స్ట్రైక్. వింటేనే జోష్ పెరుగుతోంది కదా! మూగ, బధిరుల సమస్యలను పరిష్కరించడానికి 2015లో 'ఇండియన్ సైన్ లాంగ్వేజ్ అండ్ ట్రైనింగ్ సెంటర్' ఏర్పాటు చేశాం. ఈ సంస్థ 10 వేల పదాలు, వ్యక్తీకరణలతో కూడిన డిక్షనరీ రూపొందించడం సంతోషంగా ఉంది. వాతావరణ మార్పులు సముద్ర పర్యావరణ వ్యవస్థకు పెద్ద ముప్పుగా మారాయి. తీర ప్రాంతాలు, బీచ్‌ల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త బెంబేలెత్తిస్తున్నాయి. వీటిని పరిష్కరించుకోవడం మన బాధ్యతే.

మన నినాదం 'వోకల్ ఫర్ లోకల్'

యోగాతో ఎన్నో ఉపయోగాలున్నాయి. దీన్ని జీవితాల్లో భాగంగా మార్చుకోవాలి. సూరత్‌కు చెందిన అన్వీ అనే బాలిక డౌన్ సిండ్రోమ్ యోగాభ్యాసంతో నయమైంది. మందులు వాడాల్సిన అవసరం చాలా వరకు తగ్గిపోయింది. ముఖ్యమైన పండుగలు రాబోతున్నాయి. ఈ పర్వదినాల సమయంలో స్థానిక ఉత్పత్తులను వాడుకుందాం. 'వోకల్ ఫర్ లోకల్' నినాదానికి కట్టుబడి ఉందాం. అక్టోబర్ 2న జాతిపిత మహాత్మాగాంధీ జయంతి జరుపుకోబోతున్నాం. ఈ సందర్భంగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేలా ఒక ప్రతిజ్ఞ చేద్దాం. ఖాదీ, చేనేత వస్త్రాలను ధరించండి. స్థానికంగా తయారు చేసిన వస్తువులను, చేతితో రూపొందించిన కళాఖండాలను కొనుగోలు చేయండి'' అని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

దేశ పునర్నిర్మాణం కోసమే 'జోడో'

ప్రజలంతా పాల్గొనాలి: కాంగ్రెస్ వినతి

త్రిసూర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం కేరళ రాష్ట్రం త్రిసూర్ జిల్లాలోని తిరూర్ నుంచి భారత్ జోడో యాత్రను ప్రారంభించారు. వందలాది మంది కార్యకర్తలు ఆయన వెంట పాదయాత్రలో పాల్గొన్నారు. వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ఉదయం వడక్కంచేరీలో పాదయాత్ర ముగిసిన తర్వాత రాహుల్ హెలికాప్టర్‌లో నీలంబూర్‌కు చేరుకున్నారు. అక్కడ మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత అర్యదన్ మొహమ్మద్(87)కు నివాళులర్పించారు. మొహమ్మద్ ఆదివారం మృతిచెందారు. పార్టీకి ఆయన అందించిన సేవలను రాహుల్ గుర్తుచేసుకున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడానికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. దేశ పునర్నిర్మాణం కోసం తాము చేపట్టిన చరిత్రాత్మక భారత్ జోడోయాత్రలో ప్రజలంతా పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది. బలమైన, స్వావలంబన భారత్ మనకు కావాలని పేర్కొంది. ఆదివారం రాహుల్ గాంధీ పాదయాత్రకు విశేషమైన ప్రజా స్పందన లభించింది. మహిళలు, పిల్లలు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకొని రాహుల్ వద్దకు చేరుకున్నారు. ఆయనతో కలిసి ఫొటోలు తీసుకున్నారు.



ఇందిరాగాంధీ ఆహార్యంతో ఉన్న చిన్నారి, ఎంపీ రమ్య హరిదాస్‌తో రాహుల్



18 క్యారెట్లకుపైగా బరువున్న అత్యంత అరుదైన గులాబీ రంగు రత్నమిది. పేరు ఫార్చ్యూన్ పింక్. నవంబర్‌లో జెనీవాలో వేలం వేయనున్నారు. దీనికి దాదాపు రూ.285 కోట్ల ధర పలకవచ్చని అంచనా.

అంకిత హత్యపై... 'ఫాస్ట్‌ట్రాక్' విచారణ

డెహ్రాడూన్/రిషికేశ్: రిషికేశ్‌లోని రిసార్టు రిసెప్షనిస్ట్ అంకితా భండారి(19)హత్యపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపిస్తామని సీఎం పుష్కర్ సింగ్ ధామి ఆదివారం ప్రకటించారు. పోస్ట్‌మార్టం రిపోర్టు బయట పెడతామన్నారు. ఈ హామీ అనంతరం కుటుంబసభ్యులు అంకిత అంత్యక్రియలు పూర్తి చేశారు. హత్యపై కీలక ఆధారాలు దొరికే అవకాశమున్న రిసార్ట్‌ను ప్రభుత్వం ఎందుకు కూల్చేసిందని అంకిత తండ్రి అంతకుముందు ప్రశ్నించారు. దోషులను శిక్షించాలంటూ రిషికేశ్–బద్రీనాథ్ జాతీయ రహదారిపై 8 గంటలు ఆందోళన జరిగింది. మరోవైపు హత్యను పక్కదారి పట్టించేందుకు నిందితుడు, మాజీ మంత్రి వినోద్ దకొడుకు పులకిత్ ప్రయత్నించినట్లు వెలుగులోకి వచ్చింది. వినోద్ మాత్రం తన కొడుకు అమాయకుడంటూ వెనకేసుకుని వచ్చారు.

విపక్షాల ఐక్యతకు కార్యాచరణ

- కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక ముగిశాక రూపకల్పన: నితీశ్
- సోనియాతో లాలూ, నితీశ్ భేటీ



న్యూఢిల్లీ: దేశంలో అధికార బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఐక్యం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. జేడీ(యూ) నేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్ ఆదివారం కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీతో ఢిల్లీలోని ఆమె నివాసం 10 జన్‌పథ్‌లో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, ప్రతిపక్షాల ఏకీకరణ గురించి చర్చించుకున్నట్లు సమాచారం. నితీశ్ ఎన్డీయే నుంచి బయటకు వచ్చాక సోనియాను కలవడం ఇదే మొదటిసారి. అనారోగ్యంతో బాధపడుతున్న లాలూ సైతం చాలా రోజుల తర్వాత సోనియాతో భేటీ అయ్యారు. సమావేశం తర్వాత లాలూ మీడియాతో మాట్లాడారు. బీజేపీని గద్దె దించి దేశాన్ని కాపాడుకోవాలని విపక్షాలకు పిలుపునిచ్చారు. అవి ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడి ఎన్నిక ముగిశాక కలుద్దామంటూ సోనియా చెప్పారన్నారు. ఇతర పార్టీలను పిలిచి మాట్లాడాలని సోనియాకు సూచించామని చెప్పారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే విపక్షాలన్నీ చేతులు కలిపి, కలిసి పనిచేయాలని నితీశ్ పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక పూర్తయ్యాక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని, దీనిపై సోనియా ప్రకటన చేస్తారని అన్నారు.

చైనాలో 'సైనిక కుట్ర'పై... అదే అస్పష్టత

బీజింగ్: చైనాలో సైనిక కుట్ర జరిగిందనీ, అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను నిర్బంధించారని వచ్చిన వార్తల్లో నిజానిజాలపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఇవన్నీ వదంతులే కావచ్చని పరిశీలకులు అంటున్నారు. ఎస్‌సీవో శిఖరాగ్రం కోసం రెండేళ్ల తర్వాత దేశం దాటిన నేపథ్యంలో జిన్‌పింగ్ తిరిగి రాగానే క్వారంటైన్‌లో ఉండి ఉంటారని అంటున్నారు. 2021లోనూ జిన్‌పింగ్ కొన్ని రోజులు కనిపించకపోయేసరికి ఇలాగే పుకార్లు వచ్చాయని గుర్తు చేస్తున్నారు. కాకపోతే శనివారమంతా ఇంటర్నెట్ 'కుట్ర' వార్తలతో హోరెత్తినా ఇలాంటి వాటిపై చురుగ్గా ఉండే చైనా సోషల్ మీడియా ఇప్పటిదాకా స్పందించకపోవడం ఆశ్చర్యమేనంటున్నారు. బహుశా అక్టోబర్ 16వ తేదీన అధ్యక్ష ఎన్నిక నాటికే దీనిపై స్పష్టత వస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

రేప్ చేసి..రాడ్లతో కొట్టి

ఢిల్లీలో పదేళ్ల బాలుడిపై కిరాతకం

ముగ్గురు నిందితులూ 10–12 ఏళ్లవాళ్లే

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో అమ్మాయిలపైనే కాదు అబ్బాయిలపై కూడా అత్యంత దారుణాలు జరుగుతున్నాయి. ఈశాన్య ఢిల్లీలోని సీలమ్‌పూర్‌లో ఓ పదేళ్ల బాలుడిని అదే వయసున్న ముగ్గురు స్నేహితులు అసహజ పద్ధతుల్లో రేప్ చేశారు! అంతేగాక అత్యంత కిరాతకంగా బాలుడి ప్రైవేటు భాగాల్లో రాడ్ జొప్పించారు. కర్రలతో, రాడ్లతో చావబాది రోడ్డుపక్కనే పడేసి వెళ్లారు. ఈ నెల 18న జరిగిన ఈ దారుణం జరిగింది. నిందితులంతా 10–12 ఏళ్ల పిల్లలే, వారంతా ఇరుగు పొరుగునే ఉంటారని పోలీసులు తెలిపారు. బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసుకి సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు. బాలుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరినట్టు పోలీసులకు సమాచారమందింది. వారు బాలుడ్ని తల్లిదండ్రుల్ని విచారించగా ఈ దారుణం బయటపడింది. దీనిపై ఢిల్లీ కమిషన్ ఫర్ వుమెన్ (డీసీడబ్ల్యూ) తీవ్రంగా స్పందించింది. పోలీసులకు నోటీసులు జారీ చేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ ఘటనపై డీసీడబ్ల్యూ చీఫ్ స్వాతి మలివాల్ ట్వీట్ చేస్తూ, ''ఢిల్లీలో అబ్బాయిలకు కూడా భద్రత లేదు. పదేళ్ల బాలుడిపై అత్యంత కిరాతకంగా వ్యవహరించారు'' అన్నారు.

నిమ్న కులానికి చెందిన వైద్యుడు పోస్టుమార్టమ్ చేశారని...



బరఘా: కుల వివక్ష వెర్రి తలలు ఎలా వేస్తోందో చెప్పే ఉదంతమిది. ఒడిశాలోని బరఘా జిల్లాలో ముచును సంధా అనే వ్యక్తి ఆస్పత్రిలో మరణించారు. పోస్టుమార్టం చేసిన వైద్యుడు నిమ్న కులానికి చెందిన వ్యక్తి కావడంతో గ్రామస్తులు ఏకంగా అంత్యక్రియలను బహిష్కరించారు. కనీసం బంధువులెవరూ అటువైపు తొంగి కూడా చూడలేదు. దాంతో గ్రామ సర్పంచ్ భర్త సునీల్ బెహరా ఇలా బైక్ మీద మృతదేహాన్ని తీసుకువెళ్లి ఒకరిద్దరి సహకారంతో అంతిమ సంస్కారం నిర్వహించారు.



శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కోల్‌కతాలో దుర్గా మాత మండపంలో దేవత విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

క్లుప్తంగా

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సంఘం కమిటీ నియామకం



అభివాదం చేస్తున్న అసోసియేషన్ కమిటీ

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల ఐక్యవేదిక రాష్ట్ర స్థాయి సదస్సు ఆదివారం విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి డీఎంఈ, ఏపీ వీవీపీ, డీపీహెచ్ మూడు విభాగాలకు చెందిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ అసోసియేషన్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా ఏజీకే చైతన్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఆశాదీపిక, కోశాధికారి శ్రీలత, కార్యనిర్వాహక అధ్యక్షులుగా మౌనిక రోషిణి, డి.వేణుగోపాలచారి, ముఖ్య సలహాదారుగా ఎ.శివకృష్ణ ఎంపికయ్యారు. ఏజీకే చైతన్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

మంత్రి విశ్వరూప్‌కు సీఎం జగన్ పరామర్శ

అమలాపురం టౌన్: గుండె శస్త్రచికిత్స కోసం ముంబైలోని ఏషియన్ హార్ట్ సెంటర్‌లో చేరిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఫోన్‌చేసి పరామర్శించారు. మంత్రి విశ్వరూప్‌కు సోమవారం గుండె శస్త్రచికిత్స చేయనున్నారు. ఈ క్రమంలో శస్త్రచికిత్స విజయవంతం అవుతుందని ఆయనకు సీఎం జగన్ ధైర్యం చెప్పారు. మంత్రి సతీమణి బేబీమీనాక్షి, కుమారుడు కృష్ణారెడ్డిలతో కూడా సీఎం మాట్లాడారు. తాను అన్నివేళలా అందుబాటులో ఉంటానని, విశ్వరూప్ ఆరోగ్యం పూర్తిగా మెరుగు పడుతుందని అన్నారు. సీఎం జగన్ తమతో మాట్లాడారని మంత్రి విశ్వరూప్ కుమారుడు కృష్ణారెడ్డి అమలాపురం 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు.

అంబేడ్కర్ జీవిత చరిత్ర పాఠ్యాంశంగా ఉండాలి

ఏపీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అంబేడ్కర్ జీవిత చరిత్ర అన్ని తరగతుల పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశంగా ఉండాలని ఏపీ సీఐడీ చీఫ్, 'ఎయిమ్' వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ సునీల్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్ ఏ ఒక్క జాతి కోసమో చట్టాలు తీసుకురాలేదని, అందరి కోసం రాజ్యాంగ రచన చేశారన్నారు. అమెరికా, న్యూయార్క్‌లోని యూనివర్సిటీల్లో సైతం అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసిన సంఘటనలను తాను చూశానన్నారు. దీనిపై అక్కడి వారిని ప్రశ్నించగా నెల్సన్ మండేలా కంటే అంబేడ్కర్ ఓ ప్రముఖ వ్యక్తని వారు చెప్పడం విశేషమన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం అంబేడ్కర్ ఇండియా మిషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత వాడలను దళిత పంచాయతీలుగా తీర్చిదిద్దడమే అంబేడ్కర్స్ ఇండియా మిషన్ (ఎయిమ్) ప్రధాన లక్ష్యమని చెప్పారు.

స్వాతంత్ర్య యోధురాలు బసవమ్మ మృతి



తెనాలి: ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె మండలం నల్లూరిపాలెంకు చెందిన స్వాతంత్ర్య యోధురాలు సుఖవాసి బసవమ్మ (100) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా ఆమె గుంటూరులో నివసిస్తున్నారు. అక్కడే ఆమె చివరి శ్వాస తీసుకున్నట్లు బంధువులు తెనాలిలో వెల్లడించారు. బసవమ్మకు ముగ్గురు కుమార్తెలు, మనుమల సంతానం ఉన్నారు.

ఆకట్టుకుంటున్న ఆర్బీకే చానల్

దేశంలోనే తొలిసారిగా ఏపీలో వినూత్న ప్రయోగం

- వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రత్యేకంగా చానల్
- రెండేళ్లలోనే 1.95 లక్షల సబ్‌స్క్రైబర్లు.. 21.50 లక్షల వీక్షకులు
- యూట్యూబ్ నుంచి సిల్వర్ బటన్
- ఆర్బీకే చానల్ ప్రసారాలు ఎంతో ఉపయోగపడుతున్నాయంటున్న రైతులు
- దేశ, విదేశీ ప్రముఖులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచీ ప్రశంసలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను నాలెడ్జ్ హబ్‌లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్నదాతల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్బీకే చానల్ విశేష ఆదరణతో దూసుకుపోతోంది. రెండేళ్లలోనే 1.95 లక్షల సబ్‌స్క్రైబర్లను, 21.50 లక్షల వ్యూయర్‌షిప్‌ను సాధించింది. రైతులతో పాటు జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల ప్రశంసలందుకుంటోంది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అభినందనలూ చూరగొంటోంది.

శాస్త్రవేత్తలతో సందేహాల నివృత్తి..

ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నూతన సాగు విధానాలను రైతులకు చేరువ చేసే లక్ష్యంతో యూట్యూబ్‌లో ఈ చానల్‌ను ఏర్పాటు చేశారు. ప్రసారాల వివరాలను ఎప్పటికప్పుడు ఆర్బీకేల పరిధిలోని వాట్సాప్ గ్రూపుల ద్వారా రైతులకు, ఎస్‌ఎంఎస్‌ల ద్వారా సబ్‌స్క్రైబర్లకు తెలియజేస్తున్నారు. ఈ చానల్ కోసం గన్నవరంలోని సమీకృత రైతు సమాచార కేంద్రం(ఐసీసీ కాల్ సెంటర్)లో ప్రత్యేకంగా స్టూడియో ఏర్పాటు చేశారు.



ఈ చానల్ ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాల కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నారు. శాస్త్రవేత్తల ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఆదర్శ రైతుల అనుభవాలను తెలియజేస్తున్నారు. వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాల్లో ఉండే పరికరాలు, ఉపయోగాలు వివరించేందుకు రైతు గ్రూపులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ చానల్ ద్వారా 371 ప్రత్యక్ష ప్రసారాలతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన 895 రైతు ప్రాయోజిత వీడియోలను అప్‌లోడ్ చేశారు. ఆర్బీకే 2.0 వెర్షన్, ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలపై ప్రసారం చేసిన కార్యక్రమానికి అత్యధికంగా 87,233 వ్యూయర్‌షిప్ లభించింది. రైతులు ఈ చానల్ కార్యక్రమాలను వీక్షించేందుకు అమితాసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఇటీవలే యూట్యూబ్ నుంచి సిల్వర్ బటన్‌ను కూడా సాధించింది.

అనతికాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతి

ఆర్బీకే చానల్ అతి తక్కువ కాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించింది. నీతి ఆయోగ్, ఐసీఏఆర్ తదితర జాతీయ సంస్థతో పాటు వరల్డ్‌బ్యాంక్, యూఎన్‌కు చెందిన ఎఫ్‌ఏవో సహా వివిధ దేశాల ప్రముఖులు ఈ చానల్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. తెలంగాణ, తమిళనాడు, కేరళతో పాటు వివిధ రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు ఈ చానల్ కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ తీరును ప్రశంసించారు. తెలంగాణ ప్రభుత్వం ఈ తరహా చానల్‌ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు కూడా చేస్తోంది.

అనూహ్య స్పందన..

ఆర్బీకే చానల్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. రైతులు స్వచ్ఛందంగా సబ్‌స్క్రైబ్ చేసుకుంటున్నారు. యూట్యూబ్‌తో పాటు ఆర్బీకేల్లోని డిజిటల్ స్టూడియో ద్వారా ప్రసారాలను వీక్షిస్తున్నారు. శాస్త్రవేత్తలు, అధికారులతో మాట్లాడుతూ తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు.

– వల్లూరి శ్రీధర్, జేడీఏ, ఆర్బీకేల ఇన్‌చార్జి

ఎంతో మేలు..

సాగు సమయంలో ఎప్పుడు, ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి, ఏ తెగులు నివారణకు ఏం చేయాలనే వాటి గురించి ఆర్బీకే చానల్ ద్వారా శాస్త్రవేత్తలిస్తున్న సూచనలు బాగా ఉపయోగపడుతున్నాయి. పంటల బీమా, రైతు భరోసా, యంత్ర సేవ పరికరాలు, ఇతర సంక్షేమ పథకాల గురించి కూడా ఈ చానల్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం.

– కొండవీటి కిశోర్, విప్పర్ల రైతు, పల్నాడు జిల్లా

దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



బాలికకు వినికిడి పరికరాన్ని అందిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి, అమరావతి/మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వినికిడి సమస్యతో బాధపడుతున్నవారికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఖరీదైన పరికరాలను ఉచితంగా అందించడం అభినందనీయమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. భారత జనసంఘ్ సహ వ్యవస్థాపకుడు పండిట్ దీన్ దయాళ్ జయంతిని పురస్కరించుకుని దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి లోపం గల 300 మందికి ఆదివారం వినికిడి పరికరాలను అందజేశారు. విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ దీన్ దయాళ్ ఎంతో విలువలతో కూడిన జీవితాన్ని గడిపారని కొనియాడారు. సమాజం పట్ల బాధ్యత గల వ్యక్తిగా 'సర్వోదయ' వంటి గాంధేయ సోషలిస్టు సిద్ధాంతాలను బలంగా పాటించేవారన్నారు. మానవుడికి అత్యంత విలువైన ఇంద్రియాలలో వినికిడి శక్తి ఒకటని, ఈ లోపాన్ని చిన్న వయసులోనే గుర్తిస్తే చికిత్స చేయవచ్చన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి ఉచితంగా వినికిడి పరికరాలను పంపిణీ చేస్తున్న దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆర్.రామాంజనేయులును గవర్నర్ అభినందించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, రామినేని ఫౌండేషన్ కన్వీనర్ పాతూరి నాగభూషణం, ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్ సీహెచ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



సుధాకరరావు

ఒంగోలు సబర్బన్: ఎన్జీవో అసోసియేషన్ అనుబంధ వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర కమిటీ ఎన్నికలు ఆదివారం ఒంగోలులో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష పదవి మినహా కమిటీ మొత్తం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొప్పోలు సుధాకరరావు (నరసరావుపేట డివిజన్) ఎన్నికయ్యారు. సహ అధ్యక్షుడిగా ఎల్.వెంకటేశ్వరరావు (కాకినాడ), ఉపాధ్యక్షులుగా జి.రవికృష్ణకుమార్ (వైఎస్సార్), డి.వాసుదేవరావు (గుంటూరు), జి.సురేంద్ర (కర్నూలు), ఆర్.వినోద్‌కుమార్ (గుంటూరు), పి.శ్వేత (ఏలూరు), కార్యదర్శులుగా ఏఎం డేవిడ్‌రాజు (గుంటూరు), కె.రాజు (అనంతపురం), కె.విజయకుమార్ (విజయనగరం), ఎల్ఎంవీ ప్రసాద్ (కర్నూలు), పి.గజపతి వర్మ (విశాఖపట్నం), కార్యనిర్వాహక కార్యదర్శిగా షేక్ మస్తాన్ వలి (విజయవాడ), కోశాధికారిగా జీఎన్‌వీ రత్నకుమార్ (విజయవాడ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు, సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, పరిశీలకుడిగా వై.ప్రసాద్ (వైఎస్సార్) వ్యవహరించారు.

2న అధ్యక్ష పదవికి ఎన్నిక

రాష్ట్ర అధ్యక్ష పదవికి అక్టోబర్ రెండో తేదీన ఒంగోలులోని ఎన్జీవో హోమ్‌లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అధ్యక్ష పదవికి అనంతపురం జిల్లాకు చెందిన వెంకటేశ్‌బాబు, విజయవాడకు చెందిన రామస్వామి నామినేషన్లు వేయటంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి.

పేదల దేవుడు డాక్టర్ వైఎస్సార్

- హెల్త్ యూనివర్సిటీకి వైఎస్సార్ పేరే సరైనది
- ఎన్టీఆర్‌ను ఘోరంగా అవమానించిన చంద్రబాబు
- ఎన్టీఆర్‌పై చెప్పులు విసిరినప్పుడు కుటుంబ సభ్యులు ఏం చేశారు?
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



చిలకలూరిపేట: పేదల దేవుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. వైద్య రంగంలో వైఎస్సార్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి చరిత్రలో నిలిచిపోయారని ఆమె కొనియాడారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం మంత్రి రజిని విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ బతికుండగా ఘోరంగా అవమానించిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని, ఆయన బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు కూడా లాగేసుకున్నారని, జీవిత చరమాంకంలో మానసిక క్షోభకు గురి చేసి మరణించేలా చేసిన చరిత్ర చంద్రబాబుదని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ జ్ఞాపకాలను చెరిపివేయాలని తపన పడిన టీడీపీ నాయకులు హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు గురించి మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎన్టీఆర్‌పై చంద్రబాబు చెప్పులు వేయించినప్పుడు ఆయన కుటుంబ సభ్యులు ఏం చేశారని ప్రశ్నించారు. ఎన్టీఆర్ అంటే తమ పార్టీకి, తమ నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గౌరవం ఉందని, అందువల్లే ఆయన పేరును ఒక జిల్లాకు పెట్టారని చెప్పారు. చంద్రబాబు కనీసం ఈ పని కూడా చేయలేదన్నారు.

అందరి బంధువు సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరి బంధువు అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఆదివారం ఆమె పల్నాడు జిల్లా చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పునరుత్పాదక ఇంధన రంగంలో

ఏపీ చర్యలు భేష్

- బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే
- ఇంధన, ఏపీఎస్ఈసీఎం అధికారులతో బీఈఈ సమీక్ష



సాక్షి, అమరావతి: పునరుత్పాదక ఇంధన రంగాన్ని ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే ప్రశంసించారు. రాష్ట్ర ఇంధన శాఖ, ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) అధికారులతో బాక్రే ఆదివారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. తొలుత ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పునరుత్పాదక ఇంధన రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టినట్లు అభయ్ బాక్రేకు వివరించారు. రాష్ట్రంలో మొత్తం విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం 18.8 గిగావాట్లు ఉండగా, అందులో 40 శాతం (7.5 గిగా వాట్లు) పునరుత్పాదక ఇంధన ఉత్పత్తే అని తెలిపారు. ఈ రంగాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లి ఇతర రాష్ట్రాలకు కూడా పునరుత్పాదక ఇంధనాన్ని ఎగుమతి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం అభయ్ బాక్రే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంధన పరిరక్షణ, ఇంధన సామర్థ్య రంగాలను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీని ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. ఏపీ, కేరళ తరహాలో అన్ని రాష్ట్రాలు ఇంధన సామర్థ్య విభాగాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, ఇంధన సామర్థ్యం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఏపీఎస్ఈసీఎం అధికారులకు బాక్రే సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి, ఇంధన శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

● తెలంగాణ

అతివేగానికి ముగ్గురి ప్రాణాలు బలి

మరికల్: అతివేగం ముగ్గురు యువకుల ప్రాణాలను బలిగొన్నది. ఈ ఘటన తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మరికల్ మండలం బండతండాకు చెందిన రాహుల్ నాయక్ (21), అమరచింత చంద్రప్ప తండాకు రాజేశ్ నాయక్(18), బూడ్యాగాని తండాకు చెందిన కిషన్‌నాయక్‌లు ఒకే బైక్‌పై బయలుదేరారు. శనివారంరాత్రి కన్మనూర్‌లో మద్యం కొనుగోలు చేసి మరికల్‌లోని ఓ హోటల్‌లో బిర్యానీ పార్సిల్ తీసుకొని పెట్రోల్ బంక్‌కు వెళ్లారు. అక్కడ పెట్రోల్ లేకపోవడంతో లాల్‌కోట చౌరస్తాలోని మరో బంక్ వద్దకు బయల్దేరారు. అతివేగంగా వెళ్తున్న వీరి బైక్ అదుపు తప్పి, షాద్‌నగర్ నుంచి నారాయణపేటకు మరో బైక్‌పై వస్తున్న నవీన్‌కుమార్(35) అనే వ్యక్తిని తీలేర్ స్టేజీ దగ్గర ఢీ కొట్టింది. ఈ ఘటనలో నవీన్‌కుమార్, రాజేశ్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రాహుల్, కిషన్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాహుల్ మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిషన్‌నాయక్ పరిస్థితి విషమంగా ఉంది.

చంద్రబాబుది గోబెల్స్ ప్రచారం

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత



చీరాల టౌన్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, దానిని తట్టుకోలేక ప్రతిపక్ష నేత చంద్రబాబు గోబెల్స్ ప్రచారం చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. బాపట్ల జిల్లా చీరాలలోని తన నివాసంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ అత్యంత ప్రాధాన్యత ఇవ్వడాన్ని ఓర్వలేక చంద్రబాబు దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవిత చరిత్రలో ఏనాడూ పేదలు, మహిళల ఆర్థికాభివృద్ధిని పట్టించుకోకుండా కేవలం సొంత సామాజికవర్గ అభివృద్ధి కోసం మాత్రమే చంద్రబాబు పనిచేశారన్నారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని కూడా సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వంపై కుట్రలు పన్నుతూ అభివృద్ధిని అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న వారిని ప్రజలు గమనిస్తున్నారని, ఓటుతోనే చంద్రబాబుకు బుద్ధి చెబుతారని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు కూడా రావని అన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యకు పెద్దపీట వేయడంతోపాటు పేదలకు కార్పొరేట్ వైద్యం అందించిన ఘనత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కిందని, అందుకే హెల్త్ యూనివర్సిటీకి వైఎస్సార్ పేరు పెట్టారని చెప్పారు. శాసనసభ, శాసన మండలిలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గమని అన్నారు.

● తెలంగాణ

రేపటినుంచి 'నాద బ్రహ్మోత్సవాలు'

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 27వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు హైటెక్ సిటీ సమీపంలోని అన్నమయ్యపురంలో అన్నమాచార్య భావనా వాహిని సంస్థ ఆధ్వర్యంలో 'నాద బ్రహ్మోత్సవాల'ను నిర్వహించనున్నట్లు డాక్టర్ శోభారాజు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్ర పారాయణంతో ప్రారంభమయ్యే కార్యక్రమంలో రోజూ ప్రముఖులు, వర్ధమాన ఔత్సాహిక కళాకారులతో నాట్యార్చన, స్వరార్చన, ప్రముఖుల సందేశాలుంటాయని పేర్కొన్నారు. హారతి, ప్రసాద వితరణతో రాత్రి 8.30 గంటలకు కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. అతిథులుగా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు, శాంతా బయోటెక్ చైర్మన్ వరప్రసాద్ రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదానికి కుటుంబం బలి

- తండ్రి, ఇద్దరు పిల్లలు దుర్మరణం
- ప్రాణాలతో బయటపడిన మృతుని భార్య, తల్లి
- ఇంట్లో నిద్రిస్తుండగా గ్యాస్ లీక్.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- తిరుపతి జిల్లా రేణిగుంటలో ఘటన



అగ్నిప్రమాదంతో మంటలు వ్యాపించిన భవనం

రేణిగుంట: అగ్నిప్రమాదం ఓ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. ఓ తండ్రి, ఇద్దరు పిల్లలు నిద్రలోనే అగ్నికి ఆహుతవ్వగా.. తల్లి ఏకాకిగా మారిపోయింది. తిరుపతి జిల్లా రేణిగుంటలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రేణిగుంట డీఎస్పీ రామచంద్ర తెలిపిన వివరాలు.. వైఎస్సార్ జిల్లా పాటూరుకు చెందిన డాక్టర్ ఎం.రవిశంకర్‌రెడ్డి(47), గుంటూరుకు చెందిన డాక్టర్ అనంతలక్ష్మికి సిద్దార్థ్‌రెడ్డి (14), కార్తీక (10) అనే ఇద్దరు పిల్లలున్నారు. వీరు ఏడాదిన్నర కిందట రేణిగుంటలోని బిస్మిల్లానగర్‌లో రెండంతస్తుల ఇల్లు నిర్మించుకుని.. కింద ఫ్లోర్‌లో క్లినిక్ నిర్వహిస్తున్నారు. రవిశంకర్‌రెడ్డి తిరుపతిలోని డీబీఆర్ ఆస్పత్రిలో రేడియాలజిస్ట్‌గా పనిచేస్తున్నాడు. రవిశంకర్‌రెడ్డి తల్లి రామసుబ్బమ్మ కూడా వీరితోనే నివసిస్తోంది. శనివారం రాత్రి మొదటి అంతస్తులోని బెడ్రూమ్‌లో రామసుబ్బమ్మ, 2వ అంతస్తులోని ఓ గదిలో ఇద్దరు పిల్లలతో అనంతలక్ష్మి, మరో గదిలో ఆమె భర్త రవిశంకర్‌రెడ్డి నిద్రపోయారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో 2వ అంతస్తులోని వంటగది నుంచి మంటలు వ్యాపించడాన్ని గమనించిన వాచ్‌మెన్ కేకలు వేస్తూ తలుపులు బాదాడు. అనంతలక్ష్మి తలుపు తీసి బయటకు రాగా.. అప్పటికే మంటలు దట్టంగా కమ్మేశాయి. దీంతో ఆమె ప్రాణభయంతో కిందకు పరుగు తీసింది. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. మొదటి అంతస్తులో ఉన్న రామసుబ్బమ్మను కిటికీ అద్దాలు పగలగొట్టి.. జేసీబీ సాయంతో సురక్షితంగా తీసుకొచ్చారు. 2వ అంతస్తులో ఉన్న పిల్లలను అతికష్టం మీద బయటకు తీసుకురాగా.. అప్పటికే వారు మృతి చెందారు. మరో గదిలో నిద్రించిన డాక్టర్ రవిశంకర్‌రెడ్డి పూర్తిగా కాలిపోయి మరణించాడు. ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆయన కుమార్తె పవిత్రారెడ్డి ఘటనాస్థలికి చేరుకున్నారు. అనంతలక్ష్మిని ఎమ్మెల్యే పరామర్శించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించినట్లు గాజులమండ్యం పోలీసులు తెలిపారు. గ్యాస్ లీకై.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.



మృతులు రవిశంకర్‌రెడ్డి, పిల్లలు సిద్ధార్థ్‌రెడ్డి, కార్తీక


విద్యుత్ దీపకాంతులతో వెలిగిపోతున్న తిరుమల

నేడు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

శోభాయమానంగా ముస్తాబైన తిరుమల గిరులు

తిరుమల: కలియుగ వైకుంఠనాథుడు తిరుమల శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు సోమవారం అంకురార్పణతో ఆరంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానించేందుకు విష్వక్సేనుడు ఆలయ మాడ వీధుల్లో విహరించనున్నారు. అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్న పెరుమాళ్ల తిరునాళ్లకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. మంగళవారం సాయంత్రం 5.45 నుంచి 6.15 గంటల మధ్య మీన లగ్నంలో అంగరంగ వైభవంగా ధ్వజారోహణతో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు ప్రారంభమవుతాయి. సాయంత్రం పెద్దశేషవాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఇల వైకుంఠనాథుని బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల సప్తగిరులను టీటీడీ సుందరంగా ముస్తాబు చేసింది. విద్యుత్ దీపాలు అలంకరణతో కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఆలయ పరిసర పాంతాలు, ప్రధాన మార్గాలను పలు రకాల పూల మొక్కలతో ప్రత్యేక అలంకరణ చేశారు.



శ్రీశైలంలో నేటి నుంచి దసరా మహోత్సవాలు

మొదటిరోజు శైలపుత్రి అలంకారంలో భ్రామరి


శ్రీశైల ఆలయం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాలు సోమవారం ఉదయం యాగశాల ప్రవేశంతో ప్రారంభం కానున్నాయి. సంప్రదాయాన్ని అనుసరించి శాస్త్రోక్తంగా ఈ ఉత్సవాల్లో అమ్మవారికి నవదుర్గ అలంకారాలు, ప్రత్యేక నవావరణ పూజలు, స్వామి అమ్మవార్లకు వాహనసేవలు, చండీయాగం, రుద్రయాగం నిర్వహించనున్నారు. దసరా మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శ్రీశైల భ్రమరాంబాదేవి శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజల అనంతరం అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు
ఇంద్రకీలాద్రి ముస్తాబు




స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా దుర్గమ్మ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా కేంద్రమైన విజయవాడలోని ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. అమ్మవారి సన్నిధిలో సోమవారం నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకు శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలిరోజు దుర్గమ్మ స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. రోజూ తెల్లవారుజామున నాలుగు నుంచి రాత్రి పదిగంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. అక్టోబర్ రెండో తేదీన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని రెండు లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అదేరోజు అమ్మవారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా సీపీ టి.కె.రాణా ప్రత్యేక పూజలు చేసి దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు.

రేపు తిరుమలకు సీఎం వైఎస్ జగన్

- బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పించనున్న ముఖ్యమంత్రి
- 28న మరోసారి స్వామిని దర్శించుకోనున్న సీఎం



సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామికి మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఆయన మంగళవారం మధ్యాహ్నం 3.35 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి తిరుపతి చేరుకుంటారు. అలిపిరి వద్ద తిరుమలకు విద్యుత్ బస్సును ప్రారంభిస్తారు. రాత్రి 8.20 గంటలకు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించి, స్వామిని దర్శించుకుం టారు. రాత్రికి తిరుమలలోనే బసచేసి బుధవారం ఉదయం మరోసారి శ్రీవారిని దర్శించుకుంటారు. తిరుమలలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిర్మించిన పరకామణి భవనాన్ని, తర్వాత లక్ష్మీ వీపీఆర్ రెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు.

నంద్యాల జిల్లాలో పర్యటన

సీఎం వైఎస్ జగన్ బుధవారం ఉదయం రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలోని రాంకో సిమెంట్ ఫ్యాక్టరీకి వెళతారు. కంపెనీ ప్రాంగణంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.55గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 2.20గంటలకు తాడేపల్లి వెళతారు.

సాక్షి 'ఫన్‌డే' ఆవిష్కరణ



తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక కథనాలతో 'కోనేటి రాయుడి బ్రహ్మోత్సవాలు' శీర్షికన ప్రచురితమైన సాక్షి 'ఫన్‌డే' పుస్తకాన్ని ఈవో కార్యాలయంలో ఆదివారం టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వీఆర్‌వో రవి ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక సంచిక తీసుకువచ్చిన ఘనత 'సాక్షి'కే దక్కిందని వారు కొనియాడారు. సాక్షియాజమాన్యం, ఫన్‌డే బృందాన్ని ఈవో అభినందించారు. ఇందులో తిరుమల రిపోర్టర్ ఎ. లక్ష్మీకాంత్, ట్రైనీ ఫొటోగ్రాఫర్ గిరిప్రసాద్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు శారదాపీఠం ముస్తాబు


శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు

సింహాచలం: చినముషిడివాడలోని విశాఖ శ్రీ శారదాపీఠంలో సోమవారం నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా సోమవారం ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు తొలి రోజు శారదాదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి రోజు సాయంత్రం మహిళలతో కుంకుమార్చనలు నిర్వహిస్తారు. అక్టోబర్ రెండో తేదీన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీపూజ, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నారు. లోకకల్యాణార్థం శ్రీమత్ దేవీభాగవత పారాయణం, శ్రీచక్ర నవావరణ అర్చన, విజయదశమి పండుగ రోజు శమీవృక్షం వద్ద ఆయుధపూజను వైభవంగా నిర్వహిస్తారు. భక్తులంతా శారదాపీఠంలో జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు తరలిరావాలని పీఠం ప్రతినిధులు పిలుపునిచ్చారు.

రోజూ రాజశ్యామల అమ్మవారి నిజరూప దర్శనం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు లభిస్తుంది. అలంకరణ లేకుండా నిజరూపంలో దర్శనమిచ్చే అమ్మవారికి స్వరూపానందేంద్ర సరస్వతి విశేష అభిషేకం చేస్తారు. సాయంత్రం రాజశ్యామల, చంద్రమౌళీశ్వరులకు పీఠార్చన, సాంస్కృతిక ఆరాధన నిర్వహిస్తారు.

గిరిజనులకు మెరుగైన విద్య

కుంభా రవిబాబు

సాక్షి, అమరావతి: గిరిజన ఆదివాసీ బిడ్డలకు మెరుగైన విద్యను అందించే గురుతర బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు కోరారు. ఏపీలోని గిరిజన ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకునేందుకు ఎస్టీ కమిషన్ విజయవాడలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో గిరిజనులకు మెరుగైన విద్య అందని కుసుమంగా మారిందన్నారు. అటువంటి పరిస్థితులను రూపుమాపేందుకు సీఎం వైఎస్ జగన్ నాడు–నేడు ద్వారా గట్టి ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి ఎస్సీ, ఎస్టీల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టేలా సీఎం అవకాశం కల్పించారన్నారు. పలువురు గిరిజన ఉపాధ్యాయ ప్రతినిధులు మాట్లాడుతూ..ఎస్టీలకు కేటాయించిన 5 డిప్యూటీ డీఈవో పోస్టులను భర్తీ చేయాలని, ఉపాధ్యాయ సమస్యలపై అధికారిక చర్చలకు పిలిచినప్పుడు గిరిజన టీచర్ల సంఘాలను కూడా గుర్తించాలని కోరగా వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రవిబాబు చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు మాట్లాడారు.

ఎన్టీఆర్‌ను మీరు చెప్పులతో కొట్టించలేదా?

బాలకృష్ణకు పలువురి నేతల ప్రశ్న

సాక్షి, అమరావతి: చంద్రబాబుతో కలిసి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఆయనపై చెప్పుల వర్షం కురిపించి ఆయన మరణానికి కారకుడైన బాలకృష్ణకు ఎన్టీఆర్ పై మాట్లాడే నైతిక అర్హత లేదని పలువురు నేతలు వ్యాఖ్యానించారు. పార్టీలకు అతీతంగా బాలకృష్ణ వ్యాఖ్యలను ఆదివారం ఖండించారు. బాలకృష్ణకు సినీ వారసత్వం తప్ప.. రాజకీయ వారసత్వం వంటపట్టలేదని పేర్కొంటూ పలువురు ట్వీట్లు, వీడియోలు పెట్టారు. ఎవరెవరు ఏమన్నారంటే...

- ఎన్టీఆర్‌పై వైస్రాయ్ హోటల్ ముందు చంద్రబాబు చెప్పుల వర్షం కురిపిస్తుంటే నీవు మందు తాగుతూ ఎంజాయ్ చేశావ్. ఎన్టీఆర్‌ని వెన్నుపోటు పొడిచిన చరిత్ర మీది. అదే ఎన్టీఆర్ పేరు కృష్ణా జిల్లాకు పెట్టిన చరిత్ర మా ప్రభుత్వానిది.
  – రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణ స్వామి
- చంద్రబాబుతో కుట్ర పన్ని ఎన్టీఆర్‌ను టీడీపీ నుంచి గెంటేసిన పాపంలో నీవు కూడా ముద్దాయివేనని గుర్తుపెట్టుకో బాలకృష్ణా..! నీకు పునర్జన్మను ప్రసాదించింది మహానేత దివంగత వైఎస్సార్. ఆ విషయం గుర్తుంచుకో.
  – నందిగం సురేష్, వైఎస్సార్‌సీపీ ఎంపీ
- ఎన్టీఆర్ మరణానికి కారణమైన వారు, ఈరోజు ఆయనపై అతిప్రేమను ఒలకపోస్తూ జూనియర్ ఎన్టీఆర్‌ను నువ్వు వారసుడివా అంటూ వెక్కిరించటం, అవమానించటం కార్యకర్తలను ఉసికొల్పడం దగా రాజకీయాలకు పరాకాష్ట.
  – జీవీఎల్ నరసింహారావు, బీజేపీ ఎంపీ
- ఎన్టీఆర్‌ని సీఎం పదవి నుంచి తప్పిద్దామని నా దగ్గరికి బాలకృష్ణ, హరికృష్ణ, చంద్రబాబు వచ్చారని మీ మరో బావ దగ్గుబాటి వెంకటేశ్వరరావు అనలేదా? ఆ రోజు మీ బ్లడ్, బ్రీడ్ ఏమైంది బాలకృష్ణా? ఎన్టీఆర్‌ను మీరు చెప్పులతో కొట్టించలేదా? ఎన్టీఆర్‌ను నువ్వు, చంద్రబాబు, మీ కుటుంబ సభ్యులు మానసిక క్షోభపెట్టి చంపేసిన మాట నిజం కాదా? పౌరుషం లేనివాడివి. నీకెందుకు మాటలు?
  – ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

ఆ కుట్రలో బాలకృష్ణ కూడా భాగమే

- ఎన్టీఆర్ ఆత్మక్షోభకు గురిచేసి ఇప్పుడు పెద్ద మనుషుల్లా ప్రగల్భాలు
- ఇందిరా సాగర్ పేరును చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుగా ఎందుకు మార్చారు?
- మాజీమంత్రి కురసాల కన్నబాబు



కాకినాడ రూరల్: ఎన్టీ రామారావును పదవీచ్యుతుడ్ని చేసి ఆయనపై రాళ్లు, చెప్పులు వేసి.. ఆయన మరణానికి కారకులైన వారు ఈ రోజు ప్రగల్భాలు పలుకుతున్నారని.. అలాగే, తండ్రి కన్నీళ్లకు కరగని తనయుడిగా బాలకృష్ణ చరిత్రలో నిలిచిపోయారని మాజీమంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఎద్దేవా చేశారు. కాకినాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కన్నతండ్రి కన్నీళ్లు పెట్టుకుంటే కరిగిపోని కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటారా? అని ప్రశ్నించారు. ఆ రోజు ఎన్టీఆర్ ఎంత ఆత్మక్షోభతో చనిపోయారో చెప్పడానికి ఈ రాష్ట్రమే సాక్ష్యమన్నారు. ఆ కుట్రలో బాలకృష్ణ కూడా ఒక భాగమని.. అటువంటి వ్యక్తి ఇప్పుడు పంచ్ డైలాగులు కొడుతున్నారని కన్నబాబు విమర్శించారు. కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెడతామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన వైఎస్ జగన్.. అధికారంలోకి వచ్చాక ఆ మాట నిలబెట్టుకున్నారని గుర్తుచేశారు. జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టినందుకు థ్యాంక్స్ చెప్పడానికి నోరుపెగలని నాయకులందరూ ఈరోజు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్‌పై చంద్రబాబు అండ్ కోకు ఎంత ప్రేమ ఉందో అందరికీ తెలుసని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇందిరాసాగర్ అనే పేరును రాజశేఖరరెడ్డి పెట్టారని, ఆ తర్వాత చంద్రబాబు ఆ పేరును ఎందుకు మార్చారో చెప్పాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరును డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పెడితే ఎన్టీఆర్ పేరు పెట్టారని.. దానిని కూడా ఉంచాలా.. వద్దా.. అని వాడు.. వీడు.. అంటూ ఎన్టీఆర్‌ను సంబోధించారని కన్నబాబు గుర్తుచేశారు. ప్రజలు చరిత్రను మరచిపోరని, బాలకృష్ణ ఆత్మపరిశీలన చేసుకుని మాట్లాడాలని హితవు పలికారు. డైలాగులు, పంచ్‌లు సినిమాల్లోనే పేలుతాయని, రాజకీయాల్లో పేలవన్నారు.

చెన్నై నుంచి తిరుమలకు గొడుగులు


గొడుగుల ఊరేగింపులో ఏజే శేఖర్, స్వాత్మానందేంద్ర, గోపాల్

సాక్షి, చెన్నై: శ్రీవారి బ్రహ్మోత్సవాల కోసం చెన్నై నుంచి తిరుమలకు ఆదివారం భారీ ఊరేగింపుగా గొడుగులు బయలుదేరాయి. ఈ నెల 30న ఈ గొడుగులను తిరుమల అధికారులకు హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ సమర్పించనుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఏటా చెన్నై నుంచి హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ నేతృత్వంలో పవిత్రంగా తీర్చిదిద్దిన 11 గొడుగులను శ్రీవారికి సమర్పిస్తారు. ఆదివారం చెన్నైలోని చెన్న కేశవ పెరుమాళ్ ఆలయంలో పూజల అనంతరం ఈ గొడుగులను తిరుమలకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. విశాఖ శారదా పీఠం ఉత్తర పీఠాధికారి స్వాత్మానందేంద్ర ఊరేగింపును ప్రారంభించారు. ఈ గొడుగులతో పాటుగా శ్రీవేంకటేశ్వర స్వామి అవతారాలు, ఉత్సవమూర్తులతో 16 రథాలు వెన్నంటి వెళ్లాయి. ఈనెల 30వ తేదీ ఈ గొడుగులు తిరుమల చేరుకుంటాయి. ట్రస్ట్ ట్రస్టీ ఆర్ ఆర్ గోపాల్, నిర్వాహక ట్రస్టీ వేదాంత, టీటీడీ స్థానిక సలహా మండలి చైర్మన్ ఏజే శేఖర్ పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌లో భూమి



▶ మొదటి పేజీ తరువాయి

భూములను కచ్చితంగా కొలుస్తారు. ప్రతి స్థిరాస్తి కొలతలు, హద్దులు, విస్తీర్ణం, భూ కమతపటం ల్యాండ్ రిజిస్టర్‌లో డిజిటల్ రూపంలో కచ్చితంగా నమోదవుతాయి. వీటితో మ్యాప్‌లో క్యూఆర్ కోడ్ రూపంలో పొందుపరుస్తారు.

నకిలీలు, ట్యాంపరింగ్‌కు తెర

ప్రతి భూమికి (ల్యాండ్ పార్శిల్) ఒక విశిష్ట సంఖ్య కేటాయించి భూమి వివరాలతోపాటు భూ యజమాని ఆధార్, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ సేకరించి భూ రికార్డులో భద్రపరుస్తారు. భూ యజమానికి తెలియకుండా రికార్డుల్లో ఎలాంటి మార్పులు చేయడానికి అవకాశం ఉండదు. డూప్లికేట్ రికార్డులు, ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదు. ఆయా భూముల క్రయ విక్రయాలు జరిగిన వెంటనే రికార్డుల్లో ఆటోమేటిక్‌గా మారిపోతాయి. తద్వారా భూ సమాచారాన్ని ఎవరైనా, ఎప్పుడైనా ఎక్కడి నుంచైనా తెలుసుకోవచ్చు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్ ఆధారిత భూ సమాచార వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. దీనిద్వారా ఎవరైనా తమ భూమిని మ్యాప్‌తో సహా చూసుకోవడానికి వీలుంటుంది.

రీ సర్వేతో ఇవీ ప్రయోజనాలు..

- ప్రతి ఆస్తికి యజమాని గుర్తింపు
- రికార్డుల్లో పదిలంగా ఆస్తి హక్కులు
- ఆ ఆస్తిని మరొకరు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు
- పకడ్బందీగా హద్దులు, కొలతలు
- క్షేత్రస్థాయిలో భూమి ఏ ఆకారంలో ఉందో రికార్డుల్లో అలాగే ఉంటుంది
- ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా ఆస్తి వివరాలు తెలుసుకోవచ్చు
- హద్దు రాళ్ల తొలగించినా, గట్టు తెగ్గొట్టినా మీ ఆస్తి డిజిటల్ రికార్డుల్లో భద్రంగా ఉంటుంది.
- భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం, సంపూర్ణ హక్కుతో ఉంటుంది.

సంపూర్ణ హక్కులు, రక్షణే లక్ష్యం

స్వతంత్ర భారత చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా భూముల రీ సర్వే నిర్వహిస్తున్నాం. రీ సర్వేతో అస్తవ్యస్తంగా ఉన్న రికార్డుల ప్రక్షాళన జరుగుతుంది. వాస్తవంగా ఉన్న భూముల విస్తీర్ణం ప్రకారం డిజిటల్ రికార్డులు తయారవుతాయి. దళారీ వ్యవస్థకు ఆస్కారం ఉండదు. వైఎస్సార్ జగనన్న హద్దురాళ్ల ఏర్పాటు చేస్తాం. ప్రతి భూమిపై సంబంధిత యజమానికి సంపూర్ణ హక్కు, రక్షణ కల్పించడమే రీ సర్వే ఉద్దేశం.
– సిద్ధార్థ జైన్, కమిషనర్, సర్వే సెటిల్మెంట్, భూ రికార్డుల శాఖ

పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా రమాప్రభ


రమాప్రభకు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా కె.రమాప్రభను ప్రజాసంఘాలు ఎన్నుకున్నాయి. విశాఖలోని మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రజా సంఘాల ప్రతినిధులు పీడీఎఫ్ అభ్యర్థిని ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల తరఫున ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న రమాప్రభకు ప్రజాసంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు. మండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపించడానికి పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దీక్షలకు మద్దతు లేకనే
పాదయాత్ర

728వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు


దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: అమరావతి రాజధాని పేరిట చేసిన దొంగ దీక్షలకు స్థానిక 29 గ్రామాల్లోనే మద్దతు లభించక కులవాదులు రోడ్డున పడి పాదయాత్రలకు శ్రీకారం చుట్టారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 728వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో పలువురు నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నట్లు మూడు రాజధానులు జరగడం తథ్యమని, కులవాదులకు భంగపాటు తప్పదన్నారు. మూడు రాజధానులతో రాష్ట్రాన్ని అన్ని విధాలా ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకుంటే... చంద్రబాబు మాత్రం కుల రాజధాని కోసం పాకులాడుతూ బినామీలకు దోచిపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని గుర్తిస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బినామీల కోసమే చంద్రబాబు పోరాటం

- తండ్రికే అన్నం పెట్టని బాలకృష్ణకు విశ్వాసం ఉందా?
- పురందేశ్వరి ఒక ఊసరవెల్లి
- రాష్ట్ర మంత్రి ఆర్.కె.రోజా



సింహాచలం: అమరావతిలో తన బినామీలు తీసుకున్న భూముల కోసమే చంద్రబాబు నాయుడు పోరాటం చేస్తున్నారని, రైతుల కోసం కాదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. విశాఖ జిల్లా సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆమె ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం రోజా మీడియాతో మాట్లాడుతూ ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా పాదయాత్రగా ఉత్తరాంధ్రకు వస్తున్నారన్నారు. అమరావతిలోనే రైతులు ఉన్నారా.. ఉత్తరాంధ్ర, రాయలసీమలో లేరా.. అని ప్రశ్నించారు. భవిష్యత్‌లో ప్రాంతాల మధ్య విభేదాలు రాకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారని చెప్పారు. హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పుపై చంద్రబాబు, ఎన్టీఆర్ కుటుంబం మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 'బాలకృష్ణ విశ్వాసం గురించి మాట్లాడుతున్నారు. అసలు విశ్వాసం లేనిది ఎవరికో ఆయన తెలుసుకోవాలి. సొంత మామ ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచి, చెప్పు లేసి, పార్టీ లాక్కున్న చంద్రబాబుకు విశ్వాసం ఉందా? తండ్రికే అన్నం పెట్టని మీకు విశ్వాసం ఉందా ? పురందేశ్వరి చరిత్రను మరిచి మాట్లాడుతున్నారు. ఆమె ఒక ఊసరవెల్లిలా కాంగ్రెస్‌కు వెళ్లారు. ఇప్పుడు బీజేపీలో ఉన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అందువల్లే హెల్త్ వర్సిటీకి ఆయన పేరు పెట్టారు. ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదు' అని రోజా అన్నారు.

వెన్నుపోటుదారులకు నువ్వు మద్దతివ్వలేదా?


బాలకృష్ణకు మంత్రి కారుమూరి ప్రశ్న



తణుకు అర్బన్: ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి కుర్చీలో కూర్చున్న చంద్రబాబుకు సహకరించింది నువ్వు కాదా బాలకృష్ణా అంటూ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. తణుకులో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రిగా దించేసి, కుంగి కృశించి మృతి చెందడానికి కారణమైన చంద్రబాబును నీవు భుజాలపైకి ఎక్కించుకోలేదా అని బాలకృష్ణను ప్రశ్నించారు. సినిమాల్లో విలన్‌లాంటి పాత్ర పోషిస్తున్న చంద్రబాబుకు మద్దతు పలుకుతున్నప్పుడే నీ తండ్రిపై నీకు ఎంతప్రేమ ఉందో ప్రజలందరికీ అర్థమైందన్నారు. సీఎం వైఎస్ జగన్‌కి ఎన్టీఆర్‌పై ప్రేమ ఉంది కాబట్టే ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టారని చెప్పారు.

వ్యవస్థలను నాశనం చేస్తే
సమాజం పురోగమించదు

కొమ్మారెడ్డి రాజారామ్మోహన్‌రావు శత జయంతి సదస్సులో వక్తలు


కొమ్మారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అజేయ కల్లం, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శ్రీకృష్ణదేవరాయలు, మాణిక్యవరప్రసాద్, లక్ష్మణరావు

పాత గుంటూరు: వ్యవస్థలను నాశనం చేసుకుంటూ పోతే సమాజం పురోగమించదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ కొమ్మారెడ్డి రాజారామ్మోహన్‌రావు శత జయంతి సందర్భంగా 'ఇండియా–75 అవకాశాలు, వాస్తవాలు'పై ఆదివారం గుంటూరులో సదస్సు జరిగింది. ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం ప్రసంగిస్తూ దేశ వ్యవసాయ రంగంలో సంక్షోభం కొనసాగటానికి పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవటమేనని పేర్కొన్నారు. రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ కేంద్రాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీల నేతలపై సీబీఐ, ఈడీ, ఐటీలతో దాడులు చేయించడం సరికాదన్నారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ దేశ లౌకికవాదానికి తూట్లు పొడిచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ 75 ఏళ్ల కాలంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించామన్నారు. ఇంకా ఎంతో సాధించాల్సి ఉందన్నారు. శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పురోగమించాలంటే ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులు ప్రజలకు రోల్ మోడల్‌గా ఉండాలని సూచించారు. ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు, సహకార మార్కెటింగ్ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ బీఎస్ శివారెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి విజయనగరం

సోమవారం । 26 । సెప్టెంబర్ । 2022



సాలూరుకు సలామ్..!

ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలోని సాలూరు మున్సిపాలిటీ జాతీయస్థాయి స్వచ్ఛసర్వేక్షణ్‌కు ఎంపికైంది. - 10లో



సేంద్రియమే ముద్దు..!

పంటలకు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని రైతులు తగ్గించడం లేదు. - 10లో

మడ్డువలస వద్ద రెండు గేట్ల ఎత్తివేత



వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద ఆదివారం రెండు గేట్లు ఎత్తివేశారు. సువర్ణముఖి, వేగావతి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. రెండు నదులు నుంచి 8వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్టు వద్ద రెండు గేట్లు ఎత్తి, వచ్చిన నీటిని కిందకు విడిచిపెడుతున్నట్లు ఏఈ నితిన్ తెలిపారు.

న్యూస్‌రీల్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు రేపు

విజయనగరం రూరల్: జిల్లాలో ఉత్సాహవంతులైన యువతను చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించి, జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంచాలనే లక్ష్యంతో ఈ నెల 27 ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సు నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల కేంద్రం జిల్లా జనరల్ మేనేజర్ పాపారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సదస్సులో చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహకాలు వివరించి వారిలో అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ఉత్సాహవంతులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని సదస్సుకు హాజరు కావాలని కోరారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, డీఆర్‌డీఏలు సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రామతీర్థంలో నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



రామతీర్థంలో వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానం మరో వేడుకకు ముస్తాబైంది. దేవస్థానంలో సోమవారం నుంచి తొమ్మిది రోజుల పాటు శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అర్చకులు అంగరంగ వైభవంగా జరిపించనున్నారు. సోమవారం సాయంత్రం 6గంటలకు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అర్చకులు అంకురారోపణం చేస్తారు. 27న అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణం, యాగశాలలో విశేష హోమాలను నిర్వహిస్తారు. స్వామివారికి నిత్య పూజల అనంతరం వచ్చే నెల 2న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. అలాగే 5న పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణం తదితర కార్యక్రమాలు ఉంటాయి. 6న శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి పుష్పయాగం జరిపించి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలకనున్నారు. ఈఓ ప్రసాదరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలపై ఎమ్మెల్సీతో చర్చలు



ఎమ్మెల్సీ రఘురాజుతో చర్చలు జరిపిన రాష్ట్ర వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు

శృంగవరపుకోట: రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణపై రాష్ట్ర వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యుడు మంగ వరప్రసాద్ తదితరులు ఎమ్మెల్సీ, రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చీఫ్ పేట్రన్ ఇందుకూరు రఘురాజు స్వగృహంలో ఆదివారం కలిసి చర్చించారు. నిర్వహణకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లు, క్రీడాకారులకు కల్పించాల్సిన సదుపాయాలపై మాట్లాడారు. ఈ చర్చల్లో మరుపల్లి రామారావు, ఎం.కొండలరావు, షకీలా బేగం, ఏఎస్‌వీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళల పెన్నిధి.. స్త్రీ నిధి



- డ్వాక్రా మహిళల ఆర్థికావసరాలు తీర్చుతున్న స్త్రీనిధి రుణాలు
- జిల్లాలో గతేడాది 100 శాతం రుణాల మంజూరు.. రికవరీ
- 2022 – 23 రుణ లక్ష్యం రూ.200 కోట్లు

జిల్లా : విజయనగరం	
గ్రామైక్య సంఘాలు :	1038
స్వయం సహాయక సంఘాలు :	39997
సభ్యుల సంఖ్య :	451279
గతేడాది స్త్రీ నిధి రుణాలు తీసుకున్న సభ్యులు :	42150

నెల్లిమర్ల:

వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న స్త్రీ నిధి రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయి. స్త్రీ నిధి బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలు వారి జీవనోపాధికి బాటలు వేస్తున్నాయి. రుణాల కోసం మహిళలు దరఖాస్తు చేసుకున్న రెండ్రోజుల్లోనే ఖాతాల్లో జమవుతున్నాయి. రుణాల మంజూరుతో పాటు రికవరీ కూడా వంద శాతం ఉండటంతో అధికారులు సైతం రుణ మంజూరుకు ముందుకొస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 42,150 మంది డ్వాక్రా మహిళలకు రూ.160 కోట్ల రుణాలను మంజూరు చేయగా శతశాతం రికవరీ సాధించారు. ఈ ఏడాది రూ 199.41 కోట్ల రుణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 22,035 మందికి రూ 77.44 కోట్లు మంజూరు చేసారు. మార్చిలోపు శతశాతం రుణాలు మంజూరు చేస్తామని వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు చెబుతున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న స్వయం సహాయక సంఘం సభ్యురాలి పేరు విభూది సుజాత. నెల్లిమర్ల మండలం అలుగోలు గ్రామానికి చెందిన ఈమె రూ.50 వేలు స్త్రీ నిధి రుణం తీసుకున్నారు. ఆ మొత్తంతో బ్యాంగిల్ షాప్ ప్రారంభించారు. సున్నా వడ్డీకే రుణం మంజూరు చెయ్యడం ఎంతగానో ఉపయోగపడిందని సుజాత చెబుతున్నారు.



సున్నా వడ్డీకే స్త్రీ నిధి రుణాలు

జిల్లాలో 1038 గ్రామైక్య సంఘాలుండగా 39,997 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఆయా సంఘాల్లో మొత్తం 4,51,279 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వారంతా ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం సున్నా వడ్డీకే బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. వాటితో పాటు నూటికి 90 పైసల(11 శాతం) వడ్డీకే స్త్రీ నిధి రుణాలను విరివిగా మంజూరు చేస్తోంది. ఇచ్చిన గడువు 24 నెలల్లో రుణాలను చెల్లిస్తే వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. ఒక్కో సభ్యురాలికి రూ.50 వేల చొప్పున సంఘానికి గరిష్ఠంగా రూ 3.5 లక్షల రుణాలను అందజేస్తున్నాయి. పది మంది సభ్యులున్న సంఘంలో ఐదుగురికి రూ 2.5 లక్షలు, 11మంది సభ్యులు దాటి ఉన్న సంఘంలో ఏడుగురికి రూ 3.5 లక్షలు మంజూరు చేస్తోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు రేవళ్ల అరుణకుమారి. నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామానికి చెందిన ఈమెకు రూ.1 లక్ష స్త్రీ నిధి రుణం మంజూరైంది. ఆ మొత్తంతో గ్రామంలో ఎరువుల షాపు ప్రారంభించారు. వడ్డీ లేకుండా మంజూరు చేసిన రుణం తన వ్యాపారానికి ఎంతగానో ఉపయోగపడిందని అరుణకుమారి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రుణాల మంజూరు.. రికవరీ భేష్

వైఎస్సార్ క్రాంతి పథం అధికారుల ఆధ్వర్యంలో స్త్రీ నిధి బ్యాంకు ద్వారా జిల్లాలో రుణాల మంజూరు భేషుగ్గా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరు లక్ష్యం రూ.160 కోట్లు కాగా శతశాతం సాధించారు. మొత్తం 42,150 మంది మహిళలకు రుణాలు మంజూరు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ 199.41 కోట్ల రుణాలుగా అందజేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఇప్పటి వరకు 22,305 మంది మహిళలకు రూ.77.44 కోట్ల మొత్తాన్ని రుణాలుగా అందజేశారు. మార్చిలోగా శతశాతం రుణాలను అందజేయడానికి వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

“ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ప్రత్యేకంగా స్త్రీనిధి ద్వారా మంజూరు చేస్తున్న రుణాలతో మహిళలు స్వయం సాధికారత సాధిస్తున్నారు. తద్వారా ఆయా కుటుంబాల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. ”



ఈ చిత్రంలో కనిపిస్తున్న స్వయం సహాయక సంఘం సభ్యురాలి పేరు దంతినాడ లక్ష్మి. నెల్లిమర్ల మండలం రామతీర్థం గ్రామానికి చెందిన ఈమె రూ.50వేలు స్త్రీ నిధి రుణం తీసుకుని, పేపరు ప్లేట్ల తయారీ సంస్థ ప్రారంభించారు. ప్రభుత్వం అందించిన స్త్రీ నిధి రుణం తన వ్యాపారానికి ఎంతగానో ఉపకరించిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



డెంకాడ మండలానికి చెందిన డ్వాక్రా మహిళలు (ఫైల్)

స్త్రీ నిధి రుణాలను వినియోగించుకోవాలి



వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న స్త్రీ నిధి రుణాలను స్వయం సహాయక సంఘాల మహిళలు వినియోగించుకోవాలి. గతేడాది జిల్లాలో శతశాతం రుణాలు మంజూరు చేయడమే కాకుండా రికవరీ కూడా శతశాతం సాధించాం. ఈ ఏడాది రూ 199.41 కోట్లు రుణాలుగా అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 22,305 మంది మహిళలకు రూ.77.44 కోట్లు అందజేశాం. మార్చిలోగా మిగిలిన మొత్తాన్ని కూడా రుణాలుగా అందజేస్తాం. – ఎ.కళ్యాణ చక్రవర్తి, పీడీ, వైఎస్సార్ క్రాంతి పథం

స్త్రీ నిధి బ్యాంకు ద్వారా మంజూరు చేసే రుణాలతో మహిళలు కిరాణా, బట్టల షాపుల ఏర్పాటు, ఆవులు, గేదెల డైరీల ప్రారంభం, గొర్రెలు, మేకల పెంపకం తదితర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జీవనోపాధులు పెంపొందించుకోవడమే గాకుండా ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

- ఆ దిశగా ఐక్యంగా పని చేస్తున్నాం..
- ఏడాది పాలన సంతృప్తినిచ్చింది
- చిన్నశ్రీనుగా ఎప్పుడూ ప్రజల మనిషినే...
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఇందుకోసం కిందస్థాయి కార్యకర్త నుంచి పెద్ద నాయకులవరకు అంతా సమన్వయంతో.. ఐక్యంగా పని చేస్తున్నామని చెప్పారు. తాను నాయకుడిని మాత్రమే కాదని, ప్రజా సేవకుడినని పేర్కొన్నారు. అధికారాన్ని తాను ఒక బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. చిన్నశ్రీనుగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా, జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణకు, మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏడాది పాలనకు తనకు సహకరించిన కలెక్టర్, ఇతర అధికారులకు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతోనే తాను విజయవంతంగా ఏడాది పాటు బాధ్యతలు నిర్వర్తించినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాకు చివరి చైర్మన్‌గా తాను చరిత్రలో నిలిచిపోతానని సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమం

ఈ ఏడాదిలో ఇటు జెడ్పీ చైర్మన్‌గా, అటు పార్టీ అధ్యక్షునిగా సమన్వయంతో ముందుకు వెళ్తున్నానని చెప్పారు. కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారికి ఎటువంటి సమస్య వచ్చినా, పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి ఫలాలను అందజేస్తున్నామన్నారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

రూ.8.84కోట్లుతో అభివృద్ధి పనులు

ఏడాది కాలంలో జిల్లా పరిషత్ నుంచి నేరుగా సుమారు రూ.8కోట్ల 84లక్షల 18వేల రూపాయల విలువైన పనులను మంజూరు చేసినట్టు చెప్పారు, వీటిలో 60 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చైర్మన్ తెలిపారు. కారుణ్య నియామకాల కింద 35 మందికి ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగి మరణిస్తే, అతని వారసునికి కేవలం 24 గంటల్లోనే ఉద్యోగం ఇచ్చిన సంఘటన తన హయాంలో జరిగిందన్నారు.

వ్యవస్థల సమన్వయం

సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను సమన్వయం చేయడమే జెడ్పీ వ్యవస్థ ముఖ్య విధి అని అన్నారు. జిల్లా అభివృద్ధికి కంకణబద్ధులై ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వ ఇసుక విధానం ఉందని, అందువల్లే భారీ స్థాయిలో జరుగుతున్న గృహ నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా సరఫరా చేయగలుగుతున్నామని చెప్పారు. ఎక్కడైనా అక్రమాలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. వన్యప్రాణి చట్టాలను గౌరవిస్తూ పులిని పట్టుకోవడానికి తగిన ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. పులి దాడి కారణంగా నష్టపోయిన వారికి పరిహారాన్ని అందించడం జరుగుతోందన్నారు.

టీడీపీ విధానం చెప్పాలి

పరిపాలనా వికేంద్రీకరణ తమ విధానమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేసారని, ఆ విధానం మేరకే మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చెప్పారని చైర్మన్ స్పష్టం చేశారు. విశాఖపట్నం పరిపాలనా రాజధాని కావాలన్నది ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల ఆకాంక్ష అని, వ్యక్తిగతంగా కూడా తన కోరిక కూడా అదేనని అన్నారు. అమరావతిని రాజధానిగా ఉంచడానికి తమ ముఖ్యమంత్రిగానీ, తమ పార్టీగానీ వ్యతిరేకం కాదని, మూడు రాజధానుల్లో అమరావతి కూడా ఒకటని స్పష్టం చేశారు. రాష్ట్రం అంతటినీ సమానంగా అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి అభిమతమని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు విశాఖను పరిపాలనా రాజధానిని చేయడానికి అంగీకారమో? కాదో? తేల్చి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా పూసపాటి అశోక్‌గజపతిరాజు దీనిపై పెదవి విప్పాలని కోరారు. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్రలో అమరావతి రైతులు పాదయాత్ర ఎలా చేస్తారని, అరసవల్లి ఆదిత్యుని వద్దకు వెళ్లి ఏమి కోరుతారని ప్రశ్నించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం



కోటదుర్గ అమ్మవారు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దసరా నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు దేవదాయ శాఖ అధికారులు చేపట్టారు. పోలీసులు బందోబస్తు కోసం ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు చేరుకున్నారు.

నేడు నిజరూప దర్శనం

ఏడాదిలో ఒక్కసారి మాత్రమే కనిపించే అమ్మవారి నిజరూప దర్శనం సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు భక్తులకు కల్పించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టారు. నిజరూప దర్శనం కోసం ఉత్తరాంధ్ర నుంచి కాకుండా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనం కోసం రావడం ఆనవాయితీ.

కోలగట్లకు ఆత్మీయ స్వాగతం



చెల్లూరు రోడ్డులో అభిమానులు, కార్యకర్తల మధ్య ర్యాలీలో కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మేళతాళాలు.. మంగళవాయిద్యాలు... వేలాది బైక్‌లు... వందలాది కార్లు... హెలీకాప్టర్‌తో పుష్పాభిషేకం....బాణాసంచా శబ్దాలు... అంతకుమించి అభిమానంతో తరలివచ్చిన అశేష జనవాహిని నడుమ రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి (డిప్యూటీ స్పీకర్) కోలగట్ల వీరభద్రస్వామికి ఆత్మీయ స్వాగతం లభించింది. ఉప సభాపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించి శాసనసభ సమావేశాలు ముగిసిన అనంతరం తొలిసారి తన సొంత నియోజకవర్గమైన విజయనగరం ఆదివారం చేరుకున్న కోలగట్లకు అభిమానం వెల్లువెత్తింది. తమ అభిమాన నాయకుడికి స్వాగతం పలికేందుకు వచ్చిన వారితో విజయనగరం – విశాఖ వెళ్లే జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. ముందుగా నియోజకవర్గంలోని చెల్లూరు గ్రామానికి చేరుకున్న కోలగట్లకు జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి.రాజేష్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు తదితరులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ప్రారంభమైన స్వాగత ర్యాలీ ముడిదాం మీదుగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో వై.జంక్షన్ వద్దకు చేరుకున్న ర్యాలీ జిల్లా కోర్టు జంక్షన్, ఎత్తుబ్రిడ్జి, మయూరి జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్, వైఎస్సార్ జంక్షన్ గంటస్తంభం, మూడులాంతర్లు, కోట జంక్షన్, బాలాజీ జంక్షన్ మీదుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసానికి చేరుకుంది. అనంతరం విజయనగరం పైడితల్లమ్మవారి దేవస్థానానికి చెందిన అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు.

ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్‌తో పుష్పాభిషేకం

ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామికి గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో పార్టీ నియోజకవర్గ నాయకులు చేసిన ఏర్పాట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రధానంగా ర్యాలీ సమయంలో హెలికాప్టర్‌తో తమ అభిమాన నాయకుడిపై పుష్పాభిషేకం చేయటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రజల అభిమానం మరువలేను : కోలగట్ల

శాసనసభ ఉప సభాపతిగా ఎన్నికైన అనంతరం మొదటి సారిగా విజయనగరం వచ్చిన నా పట్ల ఇక్కడి ప్రజలు చూపించిన ఆదరాభిమానాలు మరువలేనని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శాసనసభ సమావేశాలు ముగించుకుని విజయనగరం చేరుకున్న తనకు ఘన స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పని చేయటం ద్వారానే ఈ గుర్తింపు లభించిందన్నారు. తాను ఎప్పుడూ ప్రజలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉంటానని అన్నారు.

క్లుప్తంగా

గరివిడిలో చోరీ

- ఇంటిలో అందరూ ఉండగానే బంగారం, వెండి మాయం



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సభ్యులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని న్యూటీచర్స్ కాలనీలో శనివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఇంటిలో అందరూ ఉండగానే దొంగలు బెడ్‌రూంలో చొరబడి బీరువాలో బంగారం, వెండి చోరీ చేశారు. సంఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. గరివిడి పట్టణంలోని రేకులషెడ్డు వెనుకభాగాన గల న్యూటీచర్స్ కాలనీలో కెల్ల నారాయణమూర్తి నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి భోజనం అనంతరం ఇంటిసభ్యులంతా హాల్‌లో నిద్రపోయారు. డబుల్ బెడ్‌రూం ఇల్లు కావడంతో రెండు రూమ్‌లు ఖాళీగా ఉన్నాయి. బెడ్‌రూం వెనుకభాగాన కిటీకీ తలుపులు ఉన్నాయి. ఆ కిటీకీ తలుపుల గ్రిల్స్ తీసేసి బెడ్‌రూమ్‌లోకి దుండగులు చొరబడి బెడ్‌రూంలో ఉన్న బీరువా తాళం తెరిచి అందులో ఉన్న 9తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి ఆభరణాలను దోచుకుపోయారు. కుటుంబసభ్యులు ఆదివారం తెల్లవారు జామున లేచి బెడ్‌రూమ్ తలుపు తెరిచి చూసేసరికి బీరువాలో ఉన్న బట్టలు చిందరవందరగా పడి ఉండడంతో పాటు బంగారం, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని రాజాం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, చీపురుపల్లి ఎస్సై సన్యాసినాయుడు పరిశీలించారు. విజయనగరం క్లూస్‌టీమ్ సభ్యులు వచ్చి బెడ్‌రూంలో ఆధారాలు సేకరించారు. గరివిడి ఏఎస్సై రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తవలసలో భారీ వర్షం



భారీ వర్షం కారణంగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రవహిస్తున్న వరద

లక్కవరపుకోట (లక్కవరపుకోట): కొత్తవలస మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో మూడు రోడ్లు జంక్షన్‌లో, రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో వాహన చోదకులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. వర్షం కురిసిన ప్రతిసారీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వ రోగ నివారిణి దశపర్ణి కషాయం



దశపర్ణి కషాయం ప్రయోగపూర్వకంగా తయారు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

వేపాడ: ప్రకృతి వ్యవసాయంలో సర్వ రోగ నివారణకు దశపర్ణి కషాయం దోహదపడుతుందని ఐబీఎస్‌డీపీ డివిజనల్ యాంకర్ యశోద అన్నారు. వీలుపర్తి క్లస్టర్‌పరిధిలోని పలు గ్రామాల్లో దశపర్ణి కషాయం తయారీపై అవగాహన కల్పించి ప్రయోగపూర్వకంగా తయారు చేయించినట్లు ఆమె ఆదివారం తెలిపారు. ఈ కషాయం ఒక ట్యాంక్ నీటిలో ఒక లీటరు వేసి వరి పంటకు పిచికారీ చేస్తే తెగులు, చీడ పురుగులను నివారించుకోవచ్చు నన్నారు. ఈ కషాయం సర్వరోగ నివారిణిగా పంటలకు ఉపయోగపడుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్‌పీఎం షాపుల్లో దశపర్ణి కషాయం రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	50,130–00
బంగారం(22సి. 10గ్రా.)	45,950–00
వెండి (కిలో)	62,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

రసాయనం వద్దు.. సేంద్రియమే ముద్దు..!

- పెరుగుతున్న రసాయన ఎరువుల ఎరువుల వాడకం
- ఏడాదికి 1.13 లక్షల టన్నుల వినియోగం
- 1.60 లక్షల లీటర్ల వరకు పురుగుమందుల వాడకం
- సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలంటున్న వ్యవసాయ అధికారులు



విజయనగరం మండలం పినవేమలిలో వరి పంటకు యూరియా వేస్తున్న రైతు

విజయనగరం ఫోర్ట్: పంటలకు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని రైతులు తగ్గించడం లేదు. సాగువిస్తీర్ణానికి సరిసమాన స్థాయిలో రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో కూడా పురుగులు, తెగులును నివారించగలిగినప్పటికీ రైతులు దృష్టి సారించుకుండా పంట నిరంతరం పచ్చగా ఉండాలని కొందరు, త్వరగా ఎదగాలని మరి కొందరు విచక్షణా రహితంగా ఎరువులను వినియోగిస్తున్నారు.



డీఏపీ బస్తాలు

ఏడాదికి 1.13 లక్షల టన్నుల ఎరువుల వినియోగం

జిల్లాలో వరి, మొక్కజొన్న, గోగు, చెరకు, పత్తి, తదితర పంటల సాధారణ విస్తీర్ణం 1,29,073 హెక్టార్లు. కాగా ఆయా పంటలకు రసాయన ఎరువులను 1.13 లక్షల టన్నుల నుంచి 1.15 లక్షల టన్నుల వరకు వినియోగిస్తున్నారు. అధికంగా ఎరువులు వినియోగించడం వల్ల పంటలు విషతుల్యం అవడంతో పాటు భూసారం దెబ్బతినే ప్రమాదం ఉంది. అలాగే వివిధ పంటలను ఆశించే తెగులు, చీడపీడల నివారణకు పురుగుమందులను 1.60 లక్షల లీటర్ల వరకు ఏడాదికి వినియోగిస్తున్నారు. తెగులును పచ్చిమిర్చి వెల్లులి ద్రావణం, వేప కషాయం , వేపనూనె వంటి వాటితో తక్కువ ఖర్చుతో నివారించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నప్పటికీ రైతులు పట్టించుకోవడం లేదు.

రూ.220 కోట్లతో ఎరువులు,మందులు

రైతులు పంట దిగుబడి పెంచేందుకు పోటీపడి నారుమడి నుంచి పంటకోతదశ వరకు ఎకరాకి 3 నుంచి4 బస్తాల వరకు రసాయన ఎరువులు, 2 లీటర్ల వరకు పురుగుమందులు వాడుతున్నారు. ఎరువులు, పురుగుమందుల కోసం ఏడాదికి దాదాపు రూ.220 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం మేలు

వివిధ పంటలను ఆశించే తెగులు, పురుగులను సేంద్రియ ఎరువులతో కూడా నివారించవచ్చు. ప్రకృతిలో దొరికే వేపగింజలతో చేసే వేపకషాయం, పచ్చిమిర్చి వెల్లులి ద్రావణం, వేపనూనె తయారీకి అతి తక్కువ ఖర్చవుతుంది. వాటిని వినియోగించి తెగులును సమర్థంగా నివారించవచ్చు. వర్మీకంపోస్టు, అజొల్లా వేసి కూడా పంటలను పండించవచ్చు. దీని వల్ల పంటలు ఆరోగ్యకరంగా ఉంటాయి. వాటి ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంటుంది.

టీఎస్ఎస్‌కే పాత్రో, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి

ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నాం

పంటలలో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలనే లక్ష్యంతో ప్రకృతి పద్ధతిలో వ్యవసాయం చేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నాం. పంట ఎదుగుదలతో పాటు, చీడపీడలు, తెగులును సేంద్రియ ఎరువులు, కషాయలతో నివారించుకోవచ్చన్న విషయంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయ విభాగం వారు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఆవును చంపిన పులి

- ఆందోళనలో గ్రామస్తులు



పులి దాడిలో మృతి చెందిన పాడిఆవును పరిశీలి స్తున్న ఫారెస్ట్ సిబ్బంది, జెడ్పీటీసీ గారతవుడు

గజపతినగరం: మండలంలోని వేమలి గ్రామంలో ఆదివారం వేకువ జామున పులిదాడిలో ఆవు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోని పైడితల్లి తన నాలుగు ఆవులను శనివారం ఉదయం మేతకు తోలి యథావిధిగా సాయంత్రం పశువుల శాలలో కట్టాడు. పశువుల శాలకు పైడితల్లి ఇల్లు 100మీటర్ల దూరంలో ఉంది. అయితే ఆదివారం తెల్లవారు జామున పైడితల్లి తన పశువుల శాలలో ఆవులను చూడగా ఒక్కటి కూడా లేకపోవడంతో భయాందోళన చెందాడు. ఆ సమయంలో అటుగుండా వెళ్తున్న బైరిపురం గ్రామానికి చెందిన కొంతమంది పులి దాడిలో మృతి చెందిన ఆవును చూసి సమాచారం ఇవ్వడంతో పైడితల్లి అక్కడికి చేరుకుని లబోదిబోమన్నాడు. పశువుల శాల నుంచి 30మీటర్ల దూరం వరకు ఆవును పులి ఈడ్చుకువెళ్లి హతమార్చినట్లు స్థానికులు గుర్తించారు. పశువులశాలలో పులి దాడిచేయగానే మూడు ఆవులు కట్టు తెంపి పారిపోగా వాటిని గ్రామస్తులు గాలించి తీసుకువచ్చారు. పులి దాడిలో మృతి చెందిన పాడిఆవు (రూ.50వేలు ఖరీదు) 5నుంచి6లీటర్ల వరకు పాలు ఇచ్చేదని నిత్యం డెయిరీ ఫామ్‌కు పాలు ఇస్తూ జీవనం గడిపేవాళ్లమని బాధిత కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. సమాచారాన్ని ఫారెస్ట్ అధికారులకు అందించామని గ్రామస్తులు తెలిపారు.

పులిని హతమార్చే హక్కు లేదు

సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు, జెడ్పీటీసీ గారతవుడులు గ్రామస్తులతో మాట్లాడుతూ పులిని హతమార్చేందుకు ఎవరికీ ఎటువంటి హక్కు లేదన్నారు. పులి పాదముద్రలను గుర్తిస్తున్నామని ఆంధ్రఫారెస్ట్ ఆఫీసర్ కేఏఎస్ రాజు తెలిపారు. బోన్లు ఏర్పాటు చేసి దానిని పట్టుకునేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నామని పులి ఒక చోట ఉండడంలేదని చెప్పారు. గ్రామస్తులు రాత్రిసమయాల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నామన్నారు. బాధిత రైతుకు న్యాయం జరిగేలా చూసేందుకు ప్రభుత్వ అధికారులతో మాట్లాడతానని జెడ్పీటీసీ సభ్యుడు గారతవుడు బాధితుడికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తుమికాపల్లి వెటర్నరీ డాక్టర్ శశిభూషణ్ రావు పాల్గొన్నారు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మరణించిన పువ్వల చక్రవర్తి(ఫైల్), లింగాలవలస జంక్షన్ వద్ద మరణించిన అప్పలరాజు

డెంకాడ: మండలంలోని రెండు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదాలపై ఎస్సై మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి 8:30 గంటల సమయంలో విశాఖ-శ్రీకాకుళం జాతీయ రహదారిపై లింగాలవలస జంక్షన్ వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్ బట్టు అప్పలరాజు(46)ను విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న మోటార్ సైకిలిస్ట్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అప్పలరాజును విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. విశాఖ జిల్లాలోని భీమునిపట్నం మండలం మజ్జివలస గ్రామానికి చెందిన మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

పెదతాడివాడ వద్ద మరో ప్రమాదం

విజయనగరం–నాతవలస ఆర్‌అండ్‌బీ రహదారిపై మండలంలోని పెదతాడివాడ జంక్షన్ వద్ద జరిగిన ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ పువ్వల చక్రవర్తి(22) మృతి చెందాడు. పెదతాడివాడ జంక్షన్ వద్ద లారీ లెఫ్ట్‌కు తీసుకుంటున్న సమయంలో నాతవలస నుంచి విజయనగరం వస్తున్న మోటార్ సైకిల్ లారీని ఢీకొట్టి, పక్కనేఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో చక్రవర్తి తీవ్రంగా గాయపడడడంతో విజయనగరం ఆసపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న వ్యక్తి గాయపడ్డాడు. మరణించిన పువ్వల చక్రవర్తి పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమలక్ష్మీపురం మండలం బీరుపాడు గ్రామానికి చెందిన వ్యక్తి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాటల పోటీ నిర్వహణ అభినందనీయం

- డీసీఎంఎస్ ఛైర్‌పర్సన్ అవనాపు భావన



బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం: కళలకు నిలయం, విద్యలనగరం విజయనగరం వేదికగా ప్రతిభను ప్రోత్సహించే మంచి కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం ఎంతో సంతోషదాయకమని డీసీఎంఎస్ చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన, వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విక్రమ్‌లు పేర్కొన్నారు. స్పార్క్ సొసైటీ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాపీఠం సంయుక్తంగా యువతీయువకులకు నిర్వహించిన పాటలపోటీకి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు సినీ నేపథ్యగాయకులు బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా పాటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహనీయులు నడయాడిన నేల విజయనగరం అని, మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే విధంగా కళల పట్ల చిన్నారులకు మక్కువ పెంచే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మన మధ్య లేకపోయినా ఆయన పాటలు అజరామరంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బాలసుబ్రహ్మణ్యం అన్ని భాషల్లో సుమారు 40,000 పాటలు పాడి, సినీవినీలాకాశంలో తారల మధ్య చంద్రునిలా వెలుగొందారని కొనియాడారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పార్క్ సొసైటీ ప్రధాన కార్యదర్శి భవాని, ప్రతినిధులు పద్మనాభం, శ్రీనివాసరెడ్డి వేదవల్లి, మెహర్ లత, సుభద్ర దేవి, వజ్రపు శ్రీనివాసరావు, గాయనీగాయకులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు 450 మంది హాజరు



చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం: రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవతరోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు అనూహ్య స్పందన లభించింది. నగరంలోని మెసానిక్ టెంపుల్‌లో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విద్యార్థులు అందమైన చిత్రాలను గీసి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కృష్ణగోపాల్ అగర్వాల్, కార్యదర్శి కొల్లా మనోజ్, నవతరోత్సావాల డైరెక్టర్ కేఆర్‌కే రాజులు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉత్సవాల పేరిట వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు 450 మంది విద్యార్థులు హాజరుకావడం శుభపరిణామమన్నారు. ఈనెల 27న హోటల్ ఎస్‌వీఎస్ లేక్‌ప్యాలస్‌లో సూపర్‌సింగర్ ఫైనల్ పోటీలు నిర్వహించిన తరువాత ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. నెల రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో విజేతలుగా నిలిచిన వారికి వచ్చే నెల 2వ తేదీన అతిథులు బహుమతి ప్రదానం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఛైర్మన్ గోకవరపు ఉదయ్, సంతోష్, సునీల్ చౌదరి, కాపుగంటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు జిల్లా జట్ల పయనం



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పయనమవుతున్న జిల్లా బాల, బాలికల జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు ఆదివారం పయనమయ్యాయి. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరగబోయే పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ ఆదిలక్ష్మి, కొండపల్లి సత్యవతిలు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ఆటతీరు కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, బొప్పడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.నగేష్‌కుమార్, పీడీలు, సత్యనారాయణ, శ్రీను, సత్యప్రసాద్‌లతో పాటు బాల, బాలికల జట్లకు కోచ్‌లుగా వ్యవహరించే కె.శ్రీను, బి.గౌరు పాల్గొన్నారు.

సాలూరుకు సలామ్..!

- జాతీయస్థాయిలో మెరిసిన మున్సిపాలిటీ
- స్వచ్ఛసర్వేక్షణ్ పురస్కారానికి ఎంపిక



సాలూరు మున్సిపల్ కార్యాలయం

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలోని సాలూరు మున్సిపాలిటీ జాతీయ స్థాయి స్వచ్ఛసర్వేక్షణ్‌కు ఎంపికైంది. ఈ మేరకు అక్టోబరు 1న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌లు అవార్డు తీసుకోనున్నారు. మున్సిపాలిటీపై రాజన్నదొర ప్రత్యేక దృష్టిసారించి ఇచ్చిన సూచనలు, సలహాల మేరకు పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు సక్రమంగా చేపట్టడంతో జాతీయస్థాయిలో సాలూరు మున్సిపాలిటీకి అరుదైన గౌరవం లభించింది.

మూడురకాలుగా చెత్త సేకరణ

మున్సిపాలిటీలో ప్రజల నుంచి మూడు రకాలుగా చెత్త సేకరిస్తూ పట్టణంలో పరిశుభ్రతకు అధికారులు అడుగులు వేశారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తలను సేకరించేందుకు మూడు రకాల బుట్టలను అందించారు. మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ బుట్టలు కొనుగోలు చేసి ప్రజలకు అందజేశారు.

ప్రజల్లో అవగాహన పెంపు

మూడు రకాల చెత్త బుట్టలు, వాటి ఆవశ్యకతపై మున్సిపల్ సిబ్బంది, వలంటీర్లు, మహిళా సంఘాల సభ్యులు, సచివాలయాల సిబ్బంది ప్రజలకు అవగాహన పెంపొందించారు. ఇంటిలోని తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్తలను వేర్వేరు బుట్టలలో వేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని అవగాహన కల్పించి, అమలు చేయడంలో సఫలీకృతులయ్యారు. వార్డులో సేకరించిన చెత్తను ప్రణాళికా బద్ధంగా డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. తడి చెత్తను ఎరువుగా మార్చడం, పొడిచెత్తను పేపర్‌వేస్ట్‌గా, అట్టపెట్టెలుగా తయారుచేసి విక్రయించి మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చడం, హానికరమైన చెత్తను సైంటిఫిక్‌గా నిర్మూలించడం చేస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా ఏడాదికి రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు మున్సిపాలిటీకి ఆదాయం వస్తోందని మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు తెలిపారు.

తొలిసారిగా జాతీయస్థాయిలో గుర్తింపు

మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గతంలో రాష్ట్రస్థాయిలో 1,3,7,9 ర్యాంకులు వచ్చాయి. అయితే 2022 సంవత్సరానికి సంబంధించి తొలిసారిగా జాతీయస్థాయి స్వచ్ఛసర్వేక్షణ్ పురస్కారానికి ఎంపికైంది. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తరచూ నిర్వహిస్తున్న సమీక్షలతో అధికారులు, పాలకవర్గం, పారిశుద్ధ్య సిబ్బంది, సచివాలయ వ్యవస్థ నిబద్ధతతో పనిచేయడం, మున్సిపాలిటీ ప్రజల సహకారంతో జాతీయస్థాయి గుర్తింపు దక్కింది.

ఇది అందరి విజయం



జాతీయస్థాయి స్వచ్ఛసర్వేక్షణ్ పురస్కారానికి సాలూరు మున్సిపాలిటీ ఎంపికకావడం చాలా గర్వంగా ఉంది. ఇది అందరి విజయంగా భావిస్తున్నా. అధికారులు, పాలకవర్గం, మున్సిపల్ పారిశుద్ధ్య, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పాటు ప్రజా సహకారంతో ఇది సాధ్యమైంది.

–పీడిక రాజన్నదొర,ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి

బాధ్యత పెరిగింది



జాతీయస్థాయి స్వచ్ఛసర్వేక్షణ్ పురస్కారానికి సాలూరు మున్సిపాలిటీ ఎంపికకావడం చాలా సంతోషంగా ఉంది. మాపై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాం. మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయం, ప్రజలు సహకారంతో ఇది సాధ్యమైంది.

హెచ్.శంకరరావు, మున్సిపల్ కమిషనర్, సాలూరు

క్లుప్తంగా

నేటి నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: దేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక బొండాడ వీధిలోని మహాగణపతి కామాక్షీ సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్టోబరు 5వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఉదయం 9 గంటలకు కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ప్రతిరోజూ పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, మండపారాధనలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు లోకనాథ గణపతి, నాగమళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఎస్పీ బాలు



ఎస్పీ బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఘంటసాల స్మారక కళాపీఠం ప్రతినిధులు

విజయనగరం టౌన్: పట్టణంలోని ఘంటసాల స్మారక కళాపీఠంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి ఆదివారం నిర్వహించారు. కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు బాలు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్పీ బాలు చిరస్మరణీయుడని, సినీ రంగంలో ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



గీతాలాపనలో గాయనీగాయకులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని చదురుగుడి, వనంగుడి ఆవరణలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం రైల్వేస్టేషన్ వనంగుడి దగ్గర మస్తాన్ ఆర్కెస్ట్రా, షేక్ నన్నాసాహెబ్, ఇబ్రహీం బృందం పాడిన ట్రాక్ లైవ్ ఆర్కెస్ట్రా ఆద్యంతం ఆహూతులను అలరించింది. చదురుగుడి వద్ద చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్య నృత్యం ఆకట్టుకుంది. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆర్గనైజర్లను ఘనంగా సత్కరించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ముగ్గురు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు శంకరరావు

విజయనగరం: రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఖోఖో పోటీలకు నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలురు విభాగంలో జిల్లా జట్టుకు ఎం.శివ, ఎస్.కె.సలీమ్, బాలికల విభాగంలో జిల్లా జట్టుకు ఎం.వరలక్ష్మి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శంకరరావు తెలిపారు.

దొంగతనాల నియంత్రణకు చర్యలు

రామభద్రపురం: దొంగతనాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని సీఐ తిరుమలరావు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఆదివారం సందర్శించిన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతున్నట్లు సమాచారం ఉందని, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మండల కేంద్రం అంతర్ రాష్ట్ర కూడలి కావడంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి పట్టణం మీదుగా ఖైనీ, గుట్కా, గంజాయి వంటి నిషేధిత పదార్థాల రవాణాకు అవకాశం ఉంటుందని, ఈ నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

28న వాహనాల వేలం

బొబ్బిలి: వివిధ కేసుల్లో పట్టుబడిన 23 ద్విచక్ర వాహనాలను ఈ నెల 28వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు అదే రోజు ఉదయం 10 గంటలకు ఎస్ఈబీ సర్కిల్ కార్యాలయం ఆవరణకు రావాలని కోరారు.

సంక్షేమ రథ సారథి సీఎం జగన్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, రఘురాజు, ఎమ్మెల్యే అప్పలనాయుడు



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

డెంకాడ:

సంక్షేమ రథ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రశంసించారు. ఆదివారం మండలంలోని మోదవలస పంచాయతీ, గొండయ్యపాలెం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వారు ఇంటింటికీ వెళ్లి, మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా చెప్పాలని, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు గ్రామస్తులు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను సదరు నేతలు ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం జగన్ నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని మనబడి నాడు-నేడు పనులతో పాఠశాలల రూపురేఖలను మార్చడమే కాకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి, ఆర్థికసాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకు తీసుకురావాలన్న ధ్యేయంతో ఆయన తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రజల వద్దకే పథకాలు వచ్చి చేరుతున్నాయని వివరించారు. ప్రభుత్వానికి ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మునాయుడు, కూరాకుల అనిత, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి కనకల రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ గేదెల పోలమాంబ, ఎంపీటీసీ బోని యువశ్వేత, ఎంపీడీఓ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతను అభినందిస్తున్న నగర పంచాయతీ వైస్ చైర్మన్ రామారావు

నెల్లిమర్ల: ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, మెరకముడిదాం ఎంఈఓ పోలుబోతు రామారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని జరజాపుపేటలో స్థానిక సాధనా యువజన సంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ మూడు నెలలకోసారి యువత రక్తదానం చేయాలని తెలిపారు. రక్తదానం వల్ల ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. రక్తం దానం చేస్తే ఆరోగ్యం పాడవుతుందన్న అపోహలు వీడాలన్నారు. రక్త నిల్వలు తగ్గిన ప్రతీసారి సాధనా యువజన సంఘం వారు ఇటువంటి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన 25 మంది దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సాధనా ప్రతినిధులు పోలుబోతు దుర్గా ప్రసాద్, పసుమర్తి వెంకటరమణ, బెల్లాన వెంకటరావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై కమిషనర్ ఆరా



మహిళతో మాట్లాడి పారిశుద్ధ్య సేవలను అడిగి తెలుసుకుంటున్న నగర పంచాయతీ కమిషనర్

నెల్లిమర్ల: పట్టణంలోని పారిశుద్ధ్య పనుల నిర్వహణపై నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ ఆరాతీశారు. కౌన్సిలర్ ఫిర్యాదు మేరకు స్థానిక గాంధీనగర్ కాలనీలో ఆదివారం పర్యటించిన ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణ, మురుగు కాలువల్లో పూడికతీత పనులు, చెత్తకుప్పల తొలగింపు వంటి వాటి గురించి, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని కౌన్సిలర్‌కు తెలిపారు. ఎక్కడైనా చెత్తకుప్పలు ఉంటే వెంటనే సిబ్బందికి తెలియజేయాలని కమిషనర్ సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు రమణ, రాము ఉన్నారు.

ప్రజాసేవలో రాజీపడను



డిప్యూటీ స్పీకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

- రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

డెంకాడ: ఎంత పెద్ద పదవులు వచ్చినా ప్రజాసేవలో రాజీపడను అని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టి, ఆదివారం విజయనగరానికి విచ్చేస్తున్న ఆయనకు జిల్లా ముఖద్వారమైన మండలంలోని మోదవలస వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, సర్పంచ్ గేదెల పోలమాంబ, ఎంపీటీసీ బోని యువశ్వేత పుష్పగుచ్ఛాలు అందించి, సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను డిప్యూటీ స్పీకర్ అయినా ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన ప్రజానీకానికి ధన్యవాదాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, కందుల రఘుబాబు, డెంకాడ, నెల్లిమర్ల, ఎంపీపీలు బంటుపల్లి వాసుదేవరావు, అంబళ్ల సుధారాణి, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ, పతివాడ అప్పలనాయుడు, చనుమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

నెల్లిమర్ల: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జంగిల్ క్లియరెన్స్ ఆదివారం చేపట్టారు. కార్యాలయం చుట్టు పక్కలా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో పాములు, తేళ్లు సంచరిస్తుండడంతో వాటిని కూలీల సహాయంతో తొలగించినట్లు అధికారులు తెలిపారు.

నెల్లిమర్లలో 'వైఎస్సార్ చేయూత' నేడు

నెల్లిమర్ల: పట్టణంలోని బయిరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో వైఎస్సార్ చేయూత మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్న ట్లు ఎంపీపీ అంబళ్ల సుధారాణి ఓ ప్రకటనలో ఆది వారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు అధికారులంతా పాల్గొనాలని ఆమె కోరారు.

గీతాశ్రమంలో భగవద్గీత పఠనం

రేగిడి: ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేసుకోవాలని ఆధ్యాత్మిక వక్తలు రామ్మోహనరావు, త్రినాథరావు, గొర్లె దామోదరరావు అన్నారు. మండలంలోని దేవుదల గ్రామంలో వెలసిన గీతాశ్రమంలో ఆదివారం భగవద్గీత పఠనం చేశారు. భగవద్గీత చదివినా, వినినా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవరచుకోవాలని సూచించారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

బొబ్బిలి: పార్వతీపురం మన్యం జిల్లా, పాచిపెంట మండలంలోని కురుకూటి గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి బి.రవికుమార్ ఓ ప్రకటన లో ఆదివారం డిమాండ్ చేశారు. విద్యార్థినులపై సదరు వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడడం హేయమైన చర్య అని, అతడిని తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు.

ఘనంగా సైన్ లాంగ్వేజ్ దినోత్సవం



ర్యాలీకి సిద్ధమైన బధిరులు

విజయనగరం అర్బన్: పట్టణంలో డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైన్ లాంగ్వేజ్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సైన్ లాంగ్వేజ్ ఆవశ్యకత తెలియజెప్పేలా స్థానిక కోట జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో బధిరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీవీబీ జగదీష్, సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రెటర్ వి.లక్ష్మి, బధిరుల అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



పరుగుపందెంలో పోటీపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డి.ఉమాబాలాజీ తెలిపారు. ఆదివారం పట్టణంలోని విజ్జీ స్టేడియంలో విద్యార్థులకు పరుగు పోటీలను నిర్వహించారు. రోటరీ యూత్ మంత్ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీలను క్లబ్ అధ్యక్షులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగి ఉన్నత భవిష్యత్తును అందుకోవాలని కోరారు. పట్టుదల, కృషి ఉంటే ఉన్నత స్థాయి క్రీడాకారులుగా రాణిస్తారని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సూర్యలక్ష్మి, యూత్ సర్వీస్ డైరెక్టర్ రూప, చైర్మన్ జి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అయ్యకోనేరు గట్టు కథలు' ఆవిష్కరణ



రచయిత ప్రకాశ శర్మను సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో 'అయ్యకోనేరు గట్టు కథలు' అనే కథాసంపుటిని ఎస్‌బీఐ విశ్రాంత ఏజీఎం సీహెచ్ దుర్గాప్రసాద్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎ.గోపాలరావు కథలను సమీక్షించారు. రచయిత జయంతి ప్రకాశ శర్మ స్వీయ అనుభవాలతో రూపొందిన కథలు చాలా అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. అనంతరం రచయితను సన్మానించారు. కార్యక్రమంలో దామరాజు, లక్ష్మీ బాబూజీ, జక్కు రామకృష్ణ, గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి ముసుగులో దోపిడీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశభక్తి ముసుగులో దోపిడీ పాలన కొనసాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు ఆరోపించారు. అక్టోబరు 14వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు విజయవాడలో జరిగే సీపీఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న ఈ సభలకు ప్రతిఒక్కరూ హాజరై, జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన నవదుర్గ ఆలయం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ నెల 26 నుంచి వచ్చేనెల 6 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పి.శ్యామలరావు, ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు ఆదివారం తెలిపారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేయడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అమ్మవారు తొమ్మిరోజుల పాటు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. అలాగే తొమ్మిరోజుల పాటు ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి: సీఐ

రాజాం: ప్రశాంత వాతావరణంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని సీఐ డి.నవీన్‌కుమార్ సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. మండపాల ఏర్పాటు, విద్యుత్ లైట్ సెట్టింగులు, మైక్ సెట్ల ఏర్పాటుపై పోలీసులతో పాటు సంబంధిత శాఖ అధికారులకు ముందుగా సమాచారం అందివ్వాలని కోరారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో దేవీనవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కి, కారాడ, అలజంగి, పారాది, కృష్ణాపురం గ్రామాల్లో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఏర్పాటు చేసిన మండపాలకు దుర్గమ్మతల్లి విగ్రహాలను తీసుకువచ్చారు. సోమవారం నుంచి పూజల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

రాజాం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న దుర్గాదేవి ఆలయాలు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. పలు గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేసేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకరాల్లో భక్తులచే పూజలందుకోనుంది. 26న అమ్మవారు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా, 27న బాల త్రిపుర సుందరీ దేవిగా, 28న గాయత్రిదేవిగా, 29న అన్నపూర్ణాదేవిగా, 30న లలితాత్రిపుర సుందరీ దేవిగా, అక్టోబర్1 మహాలక్ష్మీదేవిగా, 2న సరస్వతీదేవిగా, 3న దుర్గాష్టమి రోజు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. 4న మహిషాసురమర్ధినిగా, 5న కనకదుర్గగా భక్తుల పూజలు అందుకోనుంది.

స్వాగతం.. సుస్వాగతం!



గజమాలతో డిప్యూటీ స్పీకర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామికి విజయనగరం జిల్లా కేంద్రంలో ఆదివారం ఘనస్వాగతం లభించింది. డిప్యూటీ స్పీకర్ పదవి చేపట్టి, తొలిసారి తన సొంత నియోజకవర్గమైన విజయనగరానికి విచ్చేస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున హాజరై, ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. నగరంలోని ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనల మధ్య ఆయనను ఘనంగా ఊరేగించారు. దారిపొడవునా ఆయనపై పుష్పవర్షం కురిపిస్తూ.. గజమాలలతో సత్కరిస్తూ ఆయన పట్ల తమకున్న అభిమానం చాటుకున్నారు.

– విజయనగరం



డిప్యూటీ స్పీకర్‌కు స్వాగతం పలికేందుకు తరలివచ్చిన జనం



శాసనసభ ఉప సభాపతిపై హెలికాప్టర్ నుంచి పూలవర్షం కురిపిస్తున్న దృశ్యం



ఊరేగింపులో అలరించిన డప్పు వాయిద్యాల ప్రదర్శన



రన్నరప్ అర్జున్

జూలియస్ బేర్ జనరేషన్ కప్ ఆన్‌లైన్ ర్యాపిడ్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ రన్నరప్‌గా నిలిచాడు. రెండు మ్యాచ్‌ల ఫైనల్స్‌లో ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) 2.5-0.5 ; 2-0తో అర్జున్‌పై గెలిచి విజేతగా అవతరించాడు. ఆదివారం జరిగిన రెండో ఫైనల్ రెండు గేముల్లోనూ కార్ల్‌సన్ గెలిచాడు. కార్ల్‌సన్‌కు 33,500 డాలర్లు (రూ. 27 లక్షల 21 వేలు), అర్జున్‌కు 21,250 డాలర్లు (రూ. 17 లక్షల 26 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

సిక్కి రెడ్డి జోడీకి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్

ఇండియా ఛత్తీస్‌గఢ్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ క్రీడాకారిణి సిక్కి రెడ్డి టైటిల్ సాధించింది. రాయ్‌పూర్‌లో ఆదివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జోడీ 22-20, 23-21తో రచాపోల్-చాసిని (థాయ్‌లాండ్) ద్వయంపై గెలిచింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో హైదరాబాద్ అమ్మాయి సామియా ఫారూఖి 21-14, 17-21, 11-21తో తస్నీమ్ మీర్ (భారత్) చేతిలో ఓడిపోయింది.



'దులీప్' చాంప్ వెస్ట్‌జోన్

కోయంబత్తూర్: రెండేళ్ల తర్వాత జరిగిన దులీప్ ట్రోఫీలో వెస్ట్‌జోన్ విజేతగా నిలిచింది. ఫైనల్ పోరులో వెస్ట్ 294 పరుగుల తేడాతో సౌత్ జోన్‌పై ఘనవిజయం సాధించింది. 529 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సౌత్‌జోన్ 71.2 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌటైంది. ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 154/6తో ఆట కొనసాగించిన సౌత్ మరో 80 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లను కోల్పోయింది. రవితేజ (53; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించాడు.

జైస్వాల్... నడు బయటికి!



వెస్ట్‌జోన్ యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ నోటి దురుసుకు మూల్యంగా మైదానం వీడాల్సి వచ్చింది. సౌత్ జోన్‌కు ఆడుతున్న హైదరాబాద్ క్రికెటర్ రవితేజ తదితరులపై యశస్వి అదేపనిగా స్లెడ్జింగ్‌కు పాల్పడటంతో కెప్టెన్ అజింక్య రహానే వారించాడు. రెండోసారి మందలించాడు. అంపైర్లూ హెచ్చరించారు. అయినా యశస్వి వినకపోవడంతో మూడోసారి మాత్రం రహానే యువ క్రికెటర్‌ను మైదానం నుంచి పంపించాడు. ఏడు ఓవర్ల తర్వాత యశస్వి మళ్లీ మైదానంలోకి వచ్చాడు. ఆ ఏడు ఓవర్లు వెస్ట్‌జోన్ పదిమందితోనే ఆడింది.

కుల్దీప్ యాదవ్ హ్యాట్రిక్



చెన్నై: న్యూజిలాండ్ 'ఎ'తో జరిగిన రెండో అనధికారిక వన్డేలో భారత్ 'ఎ' నాలుగు వికెట్లతో నెగ్గి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. భారత్ 'ఎ' స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (4/51) ఇన్నింగ్స్ 47వ ఓవర్లో వరుసగా మూడు బంతుల్లో కివీస్ 'ఎ' బ్యాటర్లు సీన్ లోగన్ వాన్ బీక్, జో వాకర్, జేకబ్ డఫీలను అవుట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. అంతకుముందు 45వ ఓవర్లో సీన్ సోలియాను కుల్దీప్ పెవిలియన్‌కు పంపించాడు. దాంతో కివీస్ 'ఎ' 47 ఓవర్లలో 219 పరుగులకు ఆలౌటైంది. అనంతరం భారత్ 34 ఓవర్లలో 6 వికెట్లకు 222 పరుగులు చేసి గెలిచింది. పృథ్వీ షా (48 బంతుల్లో 77; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. సామ్సన్ (37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శార్దుల్ (25 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించారు.



కోహ్లి

భారత్ భలే గెలుపు

ఆస్ట్రేలియాకు లభించిన ఆరంభం చూస్తే స్కోరు 200 ఖాయమనిపించింది. కానీ మన బౌలర్లు మిడిలార్డర్‌లో ప్రత్యర్థిని కదలనీయలేదు. చివరకు అంతకంటే తక్కువ స్కోరుకే పరిమితం చేసేశారు. మనకు లభించిన ఆరంభం చూస్తే ఛేదన కష్టమనిపించింది. కానీ సూర్యకుమార్, కోహ్లి దానిని సునాయాసం చేసేశారు. కీలక సమయాల్లో టీమిండియా ఆటగాళ్ల ప్రదర్శన జట్టుకు మరో గుర్తుంచుకోదగ్గ విజయాన్ని అందించింది. భారీ స్కోర్లతో ఆసక్తికరంగా సాగి ఆఖర్లో కాస్త ఉత్కంఠను పెంచిన పోరులో చివరకు టీమిండియాదే పైచేయి అయింది. రోహిత్ సేన ఖాతాలో మరో సిరీస్ చేరింది. రెండు రోజుల విరామం తర్వాత ఈనెల 28 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే టి20 సిరీస్‌లో భారత్ బరిలోకి దిగనుంది.

- మూడో టి20లో టీమిండియా విజయం
- 6 వికెట్లతో ఆస్ట్రేలియా ఓటమి
- 2–1తో సిరీస్ రోహిత్ సేన సొంతం
- మెరిసిన కోహ్లి, సూర్య కుమార్
- 28 నుంచి దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్

సాక్షి, హైదరాబాద్: చివరి ఓవర్లో భారత్ విజయానికి 11 పరుగులు అవసరం కాగా, తొలి బంతికే కోహ్లి సిక్స్ బాదాడు. తర్వాతి 3 బంతుల్లో ఒకే పరుగు రావడంతోపాటు కోహ్లి వెనుదిరిగాడు. దాంతో 2 బంతుల్లో 4 పరుగుల చేయాల్సి రాగా... హార్దిక్ తెలివిగా ఆడిన షాట్ థర్డ్‌మాన్ దిశగా బౌండరీకి దూసుకుపోవడంతో స్టేడియంలో సంబరాలు హోరెత్తాయి. మ్యాచ్‌లో విజయంతో టి20 సిరీస్ 2–1తో భారత్ సొంతం చేసుకుంది. ఆదివారం రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరిగిన చివరి టి20లో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (27 బంతుల్లో 54; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), కామెరాన్ గ్రీన్ (21 బంతుల్లో 52; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం భారత్ 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 187 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (36 బంతుల్లో 69; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు),


కామెరాన్ గ్రీన్

విరాట్ కోహ్లి (48 బంతుల్లో 63; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 62 బంతుల్లోనే 104 పరుగులు జోడించారు.

మెరుపు ఓపెనింగ్...

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ మూడు భిన్నమైన దశల్లో సాగింది. ముందుగా గ్రీన్ విధ్వంసం, ఆపై భారత బౌలర్ల కట్టడితో జోరు తగ్గగా... చివర్లో డేవిడ్ దూకుడు జట్టుకు భారీ స్కోరు అందించింది. కెప్టెన్ ఫించ్ (7) విఫలం కాగా, ఆసీస్ 5 ఓవర్లలో చేసిన తొలి 62 పరుగుల్లో 52 గ్రీన్ సాధించడం విశేషం. భువనేశ్వర్ వేసిన తొలి ఓవర్లో వరుసగా 6,4 కొట్టిన గ్రీన్... బుమ్రా ఓవర్లో ఫోర్, 2 వరుస సిక్స్‌లతో చెలరేగాడు. అక్షర్ ఓవర్లోనూ వరుసగా మూడు ఫోర్లు కొట్టిన అతను 19 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకోవడం విశేషం. అయితే గ్రీన్ అవుటైన తర్వాత ఆసీస్ స్కోరు వేగం ఒక్కసారిగా మందగించింది. ముఖ్యంగా అక్షర్ పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని నిలువరించాడు. ఒకదశలో 27 బంతుల వ్యవధిలో 22 పరుగులు మాత్రమే చేసి ఆసీస్ 3 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత అక్షర్ ఒకే ఓవర్లో 2 వికెట్లు పడగొట్టాడు. అయితే డేవిడ్, స్యామ్స్ భాగస్వామ్యం కంగారూలను మళ్లీ నిలబెట్టింది. వీరిద్దరు ఏడో వికెట్‌కు 34 బంతుల్లోనే 68 పరుగులు జోడించారు. భువనేశ్వర్ ఓవర్లో వరుసగా 6, 6, 4 కొట్టిన అనంతరం హర్షల్ ఓవర్లో మరో భారీ సిక్సర్‌తో 25 బంతుల్లో డేవిడ్ ఆసీస్ తరఫున తన తొలి అర్ధ సెంచరీని నమోదు చేశాడు. మరోవైపు బుమ్రా ఓవర్లో స్యామ్స్ 6, 4 కొట్టడం కూడా హైలైట్‌గా నిలిచింది.


సూర్య కుమార్

శతక భాగస్వామ్యం...

భారీ ఛేదనలో భారత్‌కు ఆశించిన ఆరంభం లభించలేదు. 4 ఓవర్లు ముగిసేసరికి 34 పరుగులు రాగా, రాహుల్ (1), రోహిత్ (17) వెనుదిరిగారు. అయితే కోహ్లి, సూర్య భాగస్వామ్యం భారత్‌ను గెలుపు దిశగా నడిపించింది. హాజల్‌వుడ్ ఓవర్లో వరుస బంతుల్లో కోహ్లి 6, 4 కొట్టగా, స్యామ్స్ బౌలింగ్‌లో సూర్య బాదిన సిక్సర్ మైదానాన్ని హోరెత్తించింది. ఆపై జంపా ఓవర్లో రెండు వరుస సిక్సర్లు బాది సూర్య 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. హాజల్‌వుడ్ ఓవర్లోనూ 4, 6 కొట్టిన అనంతరం మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అతను వెనుదిరిగాడు. అయితే 36 బంతుల్లో 53 పరుగులు చేయాల్సిన ఈ దశలో కోహ్లి తన జోరును కొనసాగించగా, హార్దిక్ (16 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచాడు. 37 బంతుల్లో అర్ధ సెంచరీ చేరుకున్న కోహ్లి జట్టును విజయానికి చేరువగా తెచ్చి చివరి ఓవర్లో నిష్క్రమించినా హార్దిక్ మరో బంతి మిగిలి ఉండగానే పని పూర్తి చేశాడు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: గ్రీన్ (సి) రాహుల్ (బి) భువనేశ్వర్ 52; ఫించ్ (సి) హార్దిక్ (బి) అక్షర్ 7; స్మిత్ (స్టంప్డ్) కార్తీక్ (బి) చహల్ 9; మ్యాక్స్‌వెల్ (రనౌట్) 6; ఇన్‌గ్లిస్ (సి) రోహిత్ (బి) అక్షర్ 24; డేవిడ్ (సి) రోహిత్ (బి) హర్షల్ 54; వేడ్ (సి అండ్ బి) అక్షర్ 1; స్యామ్స్ (నాటౌట్) 28; కమిన్స్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 186. వికెట్ల పతనం:** 1-44, 2-62, 3-75, 4-84, 5-115, 6-117, 7-185. **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-39-1, అక్షర్ 4-0-33-3, బుమ్రా 4-0-50-0, హార్దిక్ 3-0-23-0, చహల్ 4-0-22-1, హర్షల్ 2-0-18-1.

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) వేడ్ (బి) స్యామ్స్ 1; రోహిత్ (సి) స్యామ్స్ (బి) కమిన్స్ 17; కోహ్లి (సి) ఫించ్ (బి) స్యామ్స్ 63; సూర్యకుమార్ (సి) ఫించ్ (బి) హాజల్‌వుడ్ 69; హార్దిక్ (నాటౌట్) 25; కార్తీక్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (19.5 ఓవర్లలో 4 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1-5, 2-30, 3-134, 4-182. **బౌలింగ్:** స్యామ్స్ 3.5-0-33-2, హాజల్‌వుడ్ 4-0-40-1, జంపా 4-0-44-0, కమిన్స్ 4-0-40-1, గ్రీన్ 3-0-14-0, మ్యాక్స్‌వెల్ 1-0-11-0.


టిమ్ డేవిడ్


బీసీసీఐ కోశాధికారి అరుణ్ సింగ్ చేతుల మీదుగా టి20 సిరీస్ ట్రోఫీ అందుకుంటున్న రోహిత్ శర్మ

సినిమా


● అఖిల్, నాగార్జున, నాగచైతన్య

అప్పుడు చైన్‌తో వచ్చా... ఇప్పుడు కత్తితో వస్తున్నా - నాగార్జున

''ముప్పైమూడు సంవత్సరాల క్రితం అక్టోబరు 5న 'శివ' అనే ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ సినిమాతో సైకిల్ చైన్ పట్టుకుని వచ్చాను. ఇప్పుడు ఈ అక్టోబరు 5న ఓ కత్తితో 'ది ఘోస్ట్' అనే సినిమాతో వస్తున్నాను. ఇది కూడా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. విజయదశమి మా 'ది ఘోస్ట్' చిత్రానికి కూడా విజయాన్ని ఇస్తుందనుకుంటున్నాను'' అని నాగార్జున అన్నారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో నాగార్జున, సోనాల్ చౌహాన్ జంటగా నటించిన చిత్రం 'ది ఘోస్ట్'. నారాయణ్‌దాస్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు, శరత్ మరార్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 5న విడుదల కానుంది. కాగా ఆదివారం కర్నూలులో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో **నాగార్జున మాట్లాడుతూ–** ''ఈరోజు ఈ వేదికపై నేను, నాగచైతన్య, అఖిల్ ఇంత ప్రేమను పొందడానికి కారణమైన తెలుగు సినీ పరిశ్రమకి, మా నాన్నగారికి (దివంగత అక్కినేని నాగేశ్వరరావు) థ్యాంక్స్ చెప్పాలి. ఆడియన్స్ ఎలా చూడాలనుకుంటున్నారో 'ది ఘోస్ట్' లో అలానే కనపడతాను. నేను, చైతన్య చేసిన 'బంగార్రాజు' సినిమా థియేటర్స్‌లోనే కాదు.. టెలివిజన్ టీఆర్‌పీ, ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో కూడా రికార్డ్స్ క్రియేట్ చేసింది. నెక్ట్స్ అఖిల్‌తో నేను చేయబోయే సినిమా త్వరలో స్టార్ట్ అవుతుంది. మహేశ్‌బాబు ఎప్పుడంటే అప్పుడు అతనితో కలిసి నటిస్తాను. నాకు ఎంతో ఆప్తులైన చిరంజీవిగారి సినిమా 'గాడ్‌ఫాదర్' కూడా అక్టోబరు 5న రిలీజ్ కాబోతుంది.. 'ది ఘోస్ట్, గాడ్‌ఫాదర్' సినిమాలకు విజయాలు చేకూరాలి'' అన్నారు.

హీరో నాగచైతన్య మాట్లాడుతూ–''గత నాలుగైదు నెలలుగా నాన్నగారిని(నాగార్జున) కలిసిన ప్రతిసారి 'ది ఘోస్ట్' గురించే మాట్లాడుకుంటున్నాం.. ఇలాంటి ఎగ్జైట్‌మెంట్‌ను నాన్నలో చూసి చాలా రోజులైంది. 'బంగార్రాజు' చిత్రం నుంచి 'ది ఘోస్ట్'కి ఆయన ట్రాన్స్‌ఫార్మ్ అయిన తీరు అద్భుతం. ఈ విధంగా నాకు ఎంతో స్ఫూర్తిని ఇస్తున్నారు. స్క్రీన్‌పై నాన్నని ఎలా చూడాలనుకున్నానో అలా ప్రవీణ్‌గారు ఈ సినిమాలో చూపించారు''అన్నారు. **హీరో అఖిల్ మాట్లాడుతూ–** ''నేను, అన్నయ్య.. ఇప్పుడు కాలర్ ఎగరేస్తున్నాం. ముప్పై ఏళ్ల తర్వాత కూడా అదే క్రమశిక్షణతో నాన్నగారు సినిమాలు చేస్తున్నారు.. దాన్నిబట్టి మేం ఎంత పరిగెత్తాలనేది అర్థం అవుతోంది. 'ది ఘోస్ట్' లో ఏదో ఒక ఫైర్ ఉంది.. సినిమా సక్సెస్ అవుతుంది'' అన్నారు. ''నాగార్జునగారితో సినిమా చేయడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నాను. ఆయన అభిమానుల అంచనాలను అందుకునేలా 'ది ఘోస్ట్' ఉంటుంది'' అన్నారు **ప్రవీణ్ సత్తారు**. ''నాగార్జున ఎంత స్టైలిష్‌గా ఉంటారో అంతే స్టైలిష్‌గా ఈ సినిమా తీశాం'' అన్నారు నిర్మాత రామ్మోహన్ రావు. ''ది ఘోస్ట్' తీసినందుకు చాలా గర్వంగా, సంతోషంగా ఉంది'' అన్నారు నిర్మాత శరత్ మరార్. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, సోనాల్ చౌహాన్, నటుడు విక్రమాదిత్య, కెమెరామేన్ ముఖేష్, ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మకడలి, మ్యూజిక్ డైరెక్టర్ మార్క్ కె రాబిన్, మ్యూజిక్ డియో భరత్, సౌరభ్ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్‌కు వేళాయె!


● అల్లు అర్జున్

పుష్పరాజ్ మళ్లీ సెట్స్‌లోకి అడుగుపెట్టే సమయం ఆసన్నమైంది. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప: ది రైజ్' గత ఏడాది డిసెంబరులో విడుదలై అద్భుత విజయం సాధించింది. ఇందులో పుష్పరాజ్ పాత్రలో నటించారు అల్లు అర్జున్. తాజాగా రెండో భాగం 'పుష్ప: ది రూల్'కు రంగం సిద్ధం చేశారు సుకుమార్ అండ్ కో. ఇటీవలే 'పుష్ప: ది రైజ్' పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ అక్టోబరు 1 నుంచి ప్రారంభం కానుందని టాక్. ఈ షెడ్యూల్‌లో కొన్ని కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారు చిత్రయూనిట్. కొందరు హాలీవుడ్ టెక్నీషియన్స్ కూడా ఈ సినిమాకు వర్క్ చేస్తున్నారట. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. తొలిభాగంలో అల్లు అర్జున్‌తో జోడీ కట్టిన రష్మికా మందన్నానే రెండో భాగంలోనూ హీరోయిన్. ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. కాగా 'పుష్ప: ది రూల్' సినిమాను వచ్చే ఏడాది రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

అద్భుతమైన అభ్యాసం


● కాజల్ అగర్వాల్

పాత్ర డిమాండ్ చేయాలేగానీ ఎలాంటి విద్యలైనా నేర్చుకునేందుకు సిద్ధం అంటున్నారు కథానాయికలు. తాజాగా కాజల్ అగర్వాల్ కూడా కళరిపయట్టు కళపై మరింత పట్టు సాధించాలని తీవ్రంగా శ్రమిస్తున్నారు. హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్'(తెలుగులో 'భారతీయుడు') సూపర్‌హిట్ అయింది. తాజాగా కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చెన్నైలో జరుగుతుండగా కమల్ హాసన్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. త్వరలో ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ కానున్నారు కాజల్. తన పాత్ర కోసం రీసెంట్‌గా గుర్రపు స్వారీ చేస్తున్న వీడియోను షేర్ చేసిన కాజల్ తాజాగా కలరిపయట్టును సాధన చేస్తున్న వీడియోను పోస్ట్ చేశారు. ''భారతీయ పురాతన యుద్ధ కళ కళరిపయట్టు. కుంగ్ ఫు, కరాటే, తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ఈ కళ నుంచే పుట్టాయి. శారీరకంగా, మానసికంగా శక్తిని పొందేందుకు కూడా ఈ కళ అద్భుతమైన అభ్యాసం'' అన్నారు కాజల్ అగర్వాల్.


● నారా రోహిత్, శ్రీవిష్ణు

వినోదాల కుటుంబం

శ్రీవిష్ణు హీరోగా నూతన సినిమా షురూ అయింది. 'వివాహ భోజనంబు'(ఓటీటీ ప్రాజెక్ట్) ఫేమ్ రామ్ అబ్బరాజు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో నారా రోహిత్ క్లాప్ ఇచ్చారు. ''పూర్తి ఫన్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. ఈ సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ కార్యక్రమంలో నిర్మాత అనిల్ సుంకర, దర్శకులు వీఐ ఆనంద్, విజయ్ కనకమేడల, ఏఆర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు. సుదర్శన్, శ్రీకాంత్ అయ్యంగార్, దేవీ ప్రసాద్, ప్రియ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: గోపీ సుందర్, కెమెరా: రాంరెడ్డి.

తొలిసారి కలిసి రాశాం - సెల్వరాఘవన్



''నేను, నా తమ్ముడు ధనుష్ కలిసి 'పుదుపెట్టై- 2' సినిమా చేయాలనుకున్నాం. ఆ తర్వాత వేరే ప్రాజెక్ట్ చేద్దామనే ఆలోచన వచ్చింది. అయితే మేమిద్దరం కలిసి ఒక సినిమా కథ రాయాలని ధనుష్‌కి ఒక కోరిక ఉండేది.. అది 'నేనే వస్తున్నా' తో తీరింది. ఈ చిత్ర కథని ఇద్దరం రాశాం'' అని దర్శకుడు సెల్వరాఘవన్ అన్నారు. ధనుష్ హీరోగా సెల్వరాఘవన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నానే వరువేన్'. కలైపులి ఎస్.థాను నిర్మించిన ఈ తమిళ చిత్రాన్ని 'నేనే వస్తున్నా' పేరుతో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 29న తెలుగు, తమిళ భాషల్లో ఈ మూవీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సెల్వరాఘవన్ మాట్లాడుతూ– ''ధనుష్‌తో ఇప్పటి వరకు మూడు సినిమాలు చేశాను. ఆ తర్వాత ధనుష్ బాలీవుడ్, హాలీవుడ్ యాక్టర్ అయిపోయాడు. 'మీరిద్దరూ కలిసి మరో సినిమా చెయ్యండి' అని మా అమ్మ చెప్పడంతో పదకొండేళ్ల గ్యాప్ తర్వాత 'నేనే వస్తున్నా' చిత్రం చేశాం. ధనుష్ రెండోసారి డ్యూయల్ రోల్ చేస్తున్న సినిమా ఇది. డిఫరెంట్ ఎమోషన్స్, డిఫరెంట్ వేరియేషన్స్ ఉంటాయి. కలైపులి థానుసర్ ఈ కథ వినగానే బాగా ఎగ్జయిట్ అయ్యారు. సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజాతో ఇరవై రెండేళ్లుగా వర్క్ చేస్తున్నా. గీతా ఆర్ట్స్‌పై అల్లు అరవింద్‌గారు మా సినిమాను సమర్పించడం గౌరవంగా ఉంది. 'పుష్ప, ఆర్‌ఆర్‌ఆర్' సినిమాల్లో మంచి కంటెంట్ ఉంది, బాగా ఎంటర్‌టైన్ చేశాయి. రాజమౌళిగారి వల్ల ఇప్పుడు సౌత్ ఇండియన్ మూవీ అనే హద్దులు చెరిగిపోయి ఇండియన్ మూవీ అంటున్నాం'' అన్నారు.

మెడికల్ మాఫియా నేపథ్యంలో...


● ధృవన్, పృథ్వీ, నియా, సత్య

ధృవన్ కటకం, నియా త్రిపాఠీ జంటగా సత్య రాచకొండ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బలమెవ్వడు'. సుహాసిని, నాజర్, పృథ్వీరాజ్ కీలకపాత్రలు పోషించారు. సనాతన దృశ్యాలు సమర్పణలో ఆర్‌బీ మార్కండేయులు నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 1న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదలలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ–''మెడికల్ మాఫియా ఒక కామన్ మ్యాన్‌ను ఎంతలా దోచుకుంటుంది? దాన్ని ఎలా ఎదుర్కోవాలి? అనే సందేశాత్మక కథతో ఈ సినిమా తీశాం'' అన్నారు. ''కోవిడ్ వల్ల మాకు సపోర్ట్‌గా నిలిచిన నిర్మాతలు వెనక్కి వెళ్లడంతో చాలా ఇబ్బంది పడ్డాం. నా తల్లితండ్రులు ఇంటిని తాకట్టు పెట్టి నాకు సపోర్ట్‌గా నిలిచి ఈ సినిమాను పూర్తి చేసినందుకు థ్యాంక్స్'' అన్నారు సత్య రాచకొండ. ఈ చిత్రానికి కెమెరా: సంతోష్, గిరి, సంగీతం: మణిశర్మ. ద

మహిళల కోసం


● విశ్వానంద్, దివ్య

డా.విశ్వానంద్ పటార్, ఆద్య, నిహాంత్, దివ్య, రాజేష్, భావన హీరోహీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'లాట్స్ ఆఫ్ లవ్'. అనిత–ప్రఖ్యాంత్ సమర్పణలో డా.విశ్వానంద్ పటార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదలకానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకలో విశ్వానంద్ పటార్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో ఐదు కథలుంటాయి. మా సినిమా మహిళలకు కచ్చితంగా నచ్చుతుంది. పిల్లలతో కలిసి చూసే సినిమా ఇది'' అన్నారు. ''ఈ చిత్ర కథ నచ్చి నేను కూడా భాగస్వామి కావడం హ్యాపీ'' అన్నారు ఎస్ఎమ్ఆర్ ఐకాన్ ఫిల్మ్స్ అధినేత సోమేశ్వర్ రాజు. ''హీరోగా తొలి అవకాశం ఇచ్చిన విశ్వగారికి ధన్యవాదాలు'' అన్నారు రాజేష్. ఈ చిత్రానికి సంగీతం: విశ్వ, కెమెరా: మురళి, నగేష్, కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: డా. బీకే కిరణ్ కుమార్.



మంచి మాట

తీయని పలకరింపు మదిలో చక్కని భావనను రేపుతుంది. ఒక చల్లని అనుభూతినిస్తుంది. ఓ హాయిని చేకూరుస్తుంది. పలరింపు పెద్ద ఓదార్పు. కొన్ని సందర్భాలలో అద్భుతమైన ఊరటను, కొండంత బలాన్నిస్తుంది . 'తోడుగా నీకు నేనున్నాను' అనే ఆత్మీయత, ఆప్యాయతలతో నిండిన పలకరింపు గొప్ప భరోసానిస్తుంది. మన దుఃఖాన్ని, నిర్వేదాన్ని, నిరాశను, నిస్పృహను అమడ దూరంలో పెట్టే ఔషధమై మనసుకు సాంత్వననిస్తుంది.



పలకరింపు ఎంత మధురం!

బీటలుబారిన భూమికి ఎంతో హర్షాన్నిస్తుంది వర్షం. అదే విధంగా, చక్కని పలకరింపు శోకంతో ఛిద్రమైన మనోక్షేత్రాన్ని ఏకం చేసే ప్రేమజల్లు అవుతుంది. కొందరికి పలకరింపంటే మాటల మూట అనే భావన ఉంది. పలకరింపు అంటే అద్భుతమైన పదవిన్యాసము కాదు. భాషా సొబగులు చూపటం, భాషా సౌందర్యాన్ని ఒలికించటమూ అంతకన్నా కాదు. సమాసాల హోరు, జోరు కానే కాదు. పలకరింపు ఒక లాలిత్యం... ప్రేమ ధ్వనించాలి. స్నేహం తొంగి చూడాలి. పెదవుల చివర నుంచి కాక మనసులోంచి రావాలి. అపుడే అది ఎదుటివారి మనసును తాకి ఆహ్లాదాన్నిచ్చే మలయమారుతమవుతుంది. చక్కని పులకరింపై మనసుకు ఓ ప్రశాంతతనిచ్చి మన పలకరింపును స్వీకరించిన వారి ముఖాన చిరునవ్వును వెల్లి విరిసేటట్టు చేస్తుంది. కొందరు నోరు విప్పి పలుకరించటానికి ముందే వారి ముఖం మీద చిరునవ్వు పుడుతుంది. ఆ తరువాతే మాటలు. అటువంటి వారి మాటకు మృదు మధురంగానే ఉంటాయి. శ్రీరాముడు స్మిత పూర్వ భాషి అన్నారు. చిరునవ్వుతో తానే ముందు అందరిని పలకరిస్తాడు.

పదాల అర్థం వాటి పర్యవసానం, వాటి పయనం, వాటి ప్రభావాల గురించి మన అంచనా శక్తి మనకు తెలియాలి. మన పలకరింపు ఎదుటివారికి చేరేది మాటల రూపంలోనే కదా. అది మన గొంతు నుండి పెదవులను దాటి స్వరరూపంలో బయటకు వస్తుంది.

> కొందరు ఎంత ఉన్నతపదవుల్లోకి వెళ్లినా తమ హితులను, స్నేహితులను, బంధువులను విస్మరించరు. పలకరించే ఏ సందర్భాన్ని వదలుకోరు. వారి హోదాకు, అంతస్థుకి చెందినవారిని ఎంత ఆప్యాయంగా, ఆత్మీయంగా పలుకరిస్తారో పేదలైనా, ధనికులైనా, చదువుకున్న వారైనా, చదువుకోనివారైనా ఒకేరకమైన ప్రవర్తన. ఒకేరకంగా పలకరిస్తారు. అది ఎంతో గొప్ప లక్షణం. ఇది చాలామందిలో ఉండదు. అటువంటి వారు వేళ్ళమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉంటారు. అందుకే వారిది అపురూప వ్యక్తిత్వమవుతుంది. అదే మనకు ఆదర్శం కావాలి.

స్వరం స్థాయి, మాటల ఊనిక చాలా అవసరం. మనం ఎన్నుకున్న మాటల అర్థాన్ని, ఉద్దేశాన్ని ఎదుటివారికి తెలియజెప్పేది మాటల రూపంలో వ్యక్తమయ్యేది పలకరింపే. అందుకనే ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఒకరకంగా ఇది అతి సులువు గా కనిపించే అత్యంత క్లిష్టమైన విషయం. 'బావున్నారా' అనేది మనమందరం చేసే అతి సాధారణ పలకరింపు. ఈ నాలుగు అక్షరాలు మన గొంతులో పలికే మన స్వర స్థాయిని బట్టి మన మనోభావాన్ని తెలియ చేస్తుంది. అందుకే మాటలు అవే అయినా వాటిని పలికే తీరులో ఎంతో తేడా ఉంటుంది.

> "ఆర్థిక బాధల్లో ఉన్న వారందరికీ మనం సహాయం చేయడం సాధ్యం కాకపోవచ్చు. అయితే, కష్టాల కడలిలో ఉన్న మన చుట్టాలను, స్నేహితులను, ఇరుగు పొరుగుని ఓదార్పుగా పలకరించవచ్చు. అది వారికి హార్దికంగా ఎంతో శక్తినిస్తుంది. పెడతోవలో వెళ్ళే వారి ఆలోచనలకు ఒక క్రమ మార్గం ఏర్పరుస్తుంది. ఇటువంటి సందర్భాలలోనే మన సంభాషణ చాతుర్యం తెలిసేది. మన మాటల ఎన్నిక, కూర్పు, పొందికలలో ఎంతో జాగ్రత్త అవసరం. ఇవన్నీ మన పలకరింపు పెదవులను దాటటానికి ముందు మనసులో జరిగే ప్రక్రియ. ఇది పూర్వభాగమైతే, మన భావనలు పలకరింపై ఎదుటివారిని చేరటం ఉత్తరభాగం. సరిగ్గా, ఇక్కడే మాటలకున్న అర్థాన్ని మనమెంత లోతుగా గ్రహించగలిగామో తెలిసేది."

మన భావాన్ని తెలియచెప్పే మాటల ధ్వని, దాని అర్థం మనం స్వరం లో పలికేటట్టు మాట్లాడగలగాలి. అదే చక్కని పలకరింపుకు చిరునామా అవుతుంది. మనల్ని చక్కని సంభాషణ పరులుగా చేసేది.

పలకరింపు అంటే భాష మీద పట్టు, సాధికారత కానే కాదు. పలకరింపుకు మన విజ్ఞత, వివేచన ఉండాలి.. అపుడే అది చేయదగ్గ పనిని చేస్తుంది.

తల్లిదండ్రులు తమ జీవితమంతా పిల్లలకే ధారపోస్తారు. అహరహం వారి బంగారు భవిష్యత్తు గురించి ఆలోచిస్తారు. వయసు మీరిన తరువాత పలకరింపుకోసం తపించిపోతారు. ఈరోజు విషయాన్ని పిల్లలు అర్థం చేసుకోవాలి. స్వదేశంలో ఉన్నా, విదేశంలో ఉన్నా తమ తల్లి దండ్రులను పలకరించాలి. ఆ పలకరింపు, గడపబోయే సమయం కొన్ని క్షణాలైనా చాలు. అది వృద్ధులకు ఎంతో ధైర్యాన్ని, భరోసాను ఇస్తుంది. అన్నిటికీ మించి వర్ణించలేని సంతృప్తిని, అంతులేని ఆనందాన్ని ఇస్తుంది.

మనం పలకరించినా, లేకపోయినా ప్రకృతి మనల్ని పలకరిస్తూనే ఉంటుంది. ప్రకృతిపరమైన ఈ పలకరింపులు ఆలకించగలగాలి లేదా అలవాటు చేసుకోవాలి. అపుడు ఎంతో ఆనందాన్ని పొందగలం. ఆ దృష్టి ఆనంద హేతువు. ఉదయానే కొక్కోరోకో అనే ధ్వని, ఉదయపు వ్యాహ్యాళి వేళ తమ ఆవాసమైన వృక్షాన్ని వీడి పక్షులు తమ ఆహారన్వేషణకు ఆకాశానికెగిరే వేళ చేసే టప టప మనే ధ్వని ప్రకృతి పలకరింపు. పండిన నారింజ రంగులో ఉన్న భానోదయం, భాస్కరుని నులివెచ్చని కిరణాలు నిశ్శబ్ద పలకరింపులే కదా! గాలి ఈలలు, చిరుగాలి సవ్వడి, నీటి గలగలలు, నిన్నటి మొగ్గ నేడు తన రేకానయనాలను విప్పార్చుకుంటూ పరిమళాలతో మనల్ని మన ఆత్మీయులు పలుకరించిన అనుభూతి కలగదా!

పలకరింపు మాటల్లోనే ఉండనక్కరలేదు. అది ఒక చూపు, స్పర్శ, చిరునవ్వు, దృశ్యం, పుస్తకం.. ఇలా ఏదైనా కావచ్చు. ఇలా ఏదోరకమైన పలకరింపును మనం చేయగలగాలి. అది పొందిన వారు, కోరుకునే వారికి తీయని అనుభూతినిస్తుంది. వారి మనసు ఆనంద సంద్రమవుతుంది.

– లలితా వాసంతి

గురువాణి




బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కష్టాలన్నీ నాకే ఎందుకొస్తాయి!

ప్రతి చిన్న కష్టానికీ, ప్రతి అవాంతరానికీ, ప్రతి దుఃఖానికీ మనం కలవరపడిపోకూడదు, కదిలిపోకూడదు. తట్టుకొని నిలబడగలగాలి. అలా స్థైర్యంగా నిలదొక్కుకోవాలంటే... కష్టాలన్నీ నాకే ఎందుకొస్తాయని కుంగిపోకుండా ఉండాలంటే... మనకన్నా ఎన్నో రెట్లు గొప్పవారై ఉండి, మహాత్ములై ఉండి, సమాజంలో అత్యంత ఉన్నత స్థితి పొందినవారి జీవితాల్లోకి తొంగి చూస్తే... ఆశ్చర్యపోతాం. ఇన్ని కష్టాలను వారెలా తట్టుకోగలిగారనుకుంటాం. పగవాడికి కూడా ఇటువంటి కష్టం రాకూడదని వేటినయితే కోరుకుంటామో వాటిని వారు ఎదుర్కోవడమేగాక, ఎక్కడా నిరాశా నిస్పృహలకు లోను కాకుండా తిరిగి జీవితాల్లో వైభవాన్ని పొందిన వారి చరిత్రలు మననం చేసుకొంటే ... మనకొచ్చిన కష్టం అకస్మాత్తుగా చాలా చిన్నదిగా కనిపిస్తుంది. ఈ మాత్రం దానికేనా నేను ఇంతలా హడలిపోతున్నాననిపిస్తుంది.

మహాభారతంలో ద్రౌపదీ దేవిని చూడండి..శ్రీకృష్ణుడు రాయబారానికి వెళ్ళే సందర్భంలో ఆమె తన గురించి చెబుతూ... 'వరమున బుట్టితిన్, భరతవంశము జొచ్చితి, నందు/పాండుభూవరునకు కోడలైతి, జనవంద్యుల బొందితి,/నీతివిక్రమస్థిరులగు బుత్రులం వడసితిన్, సహజన్ముల/ప్రాపు గాంచితిన్ సరిసిజనాభ యిన్నిట ప్రశస్తికి నెక్కిన దాన నెంతయున్' .. అంటుంది. ద్రుపద మహారాజు యజ్ఞం చేస్తే, పరమేశ్వరుని వరం చేత దానిలోంచి పుట్టింది. పుట్టిల్లు గొప్పదే... కానీ మెట్టినిల్లో ! సామాన్యమైనది కాదు. భరత వంశం. అప్రతిహతమైన, పరాక్రమవంతుడైన, కీర్తివంతుడయిన పాండురాజుకు కోడలయింది. లోకంలో ఎవరి పేరు చెబితే అందరూ శిరస్సు వంచి నమస్కరిస్తారో అటువంటి మహాత్ములు, అరివీర భయంకరులు, ధర్మానుష్ఠానపరులయిన పాండవులకు ఇల్లాలయింది. పరాక్రమశాలులే కాదు, ప్రజ్ఞావంతులు, నీతివంతులయిన ఐదుగురు కొడుకులకు తల్లయింది. అన్నగారిగా సంభావించిన శ్రీ కృష్ణుడితో సహా తన పుట్టింటివారి ప్రేమను అపారంగా పొందింది.

అటువంటి ద్రౌపదిపడని కష్టం ఏముంది! ఆమెపడ్డ కష్టాలు ఎంత దారుణమైనవి. ఒక మనిషిని ఎంతగా కుదిపేయగలవు. ఒకనాడు రాజసభలో ఏకవస్త్రయైన ఆమెను దుశ్శాసనుడు జుట్టుపట్టుకొని ఈడ్చుకుంటూ సభలోకి తీసుకు వచ్చి, వస్త్రాలను ఊడదీసే ప్రయత్నం చేస్తుంటే ఆమె ఎంత క్షోభించి ఉంటుంది! అరణ్యవాసం చేసింది. శత్రువుల చేత అవమానింపబడింది. ఏ మాటలు పడకూడదో అవన్నీ సహించింది. అజ్ఞాతవాసంలో సైరంధ్రిగా గడిపింది. చిట్టచివర కురుక్షేత్రం యుద్ధం పరిసమాప్తం అయ్యేటప్పటికి ఐదుగురు కుమారులను ఒకే రాత్రిలో పోగొట్టుకుంది. అంతటి ద్రౌపదీ దేవి అన్ని కష్టాలను ఓర్చుకుని నిలబడ్డందుకు చివరకు రాజ్యాన్ని పొంది, ధర్మరాజుతో కలిసి పట్టాభిషిక్తురాలయింది.



కావ్యపురాణాదులు కేవలం కాలక్షేపానికి చదువుకొనేవి కావు. చిన్న చిన్న సమస్యలకే తడబడిపోయి, నిరాశా నిస్పృహ లతో శేష జీవితాన్ని కూడా పాడుచేసుకోకుండా మళ్ళీ పునర్ వైభవాన్ని పొందే ప్రయత్నం చేయడం వైపు అవి మనల్ని ఉత్తేజితుల్ని చేస్తాయి, మనకు కరదీపికలుగా నిలుస్తాయి.

అలాగే రామాయణంలో సీతమ్మను గురించి మనకు తెలియనిదేముంది కనుక. అంతటి మహాతల్లి కూడా వలవలా ఏడ్చింది. కానీ నిరాశకు లోనుకాలేదు. కట్టిన బట్ట కూడా మార్చకుండా శింశుపా వృక్షం కింద చాలా రోజుల పాటు అలాగే కూర్చుండిపోయింది. కామం తలకెక్కిన రావణాసురుడు ఎదురుగా నిలబడి మాట్లాడకూడని మాటలు మాట్లాడుతుంటే... మనసు దిటవు చేసుకొంది. కాలాన్ని ఎవరూ దాటలేరు. ఇటువంటి వారి కష్టాలు స్మరించుకొన్నప్పుడు మనం మన సమస్యలను మానసికంగా అధిగమించడమే కాక, వాటిని తట్టుకొని నిలబడగల తత్వాన్ని, శక్తిని పొందగలుగుతాం.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఓఎన్‌జీసీ, డెహ్రాడూన్‌లో 871 గ్రాడ్యుయేట్ ట్రైనీ పోస్టులు

డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ గేట్ స్కోర్-2022 ద్వారా ఇంజనీరింగ్, జియో-సైన్సెస్ విభాగాల్లో గ్రాడ్యుయేట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 871
» పోస్టుల వివరాలు: ఏఈఈ(సిమెంటింగ్)-మెకానికల్, ఏఈ (సిమెంటింగ్) -పెట్రోలియం, ఏఈఈ(సివిల్), కెమిస్ట్, జియాలజిస్ట్, జియోఫిజిసిస్ట్(సర్ఫేస్), ప్రోగ్రామింగ్ ఆఫీసర్, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ, బీటెక్, డిప్లొమా, ఎంఎస్సీ, ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్-2022 స్కోరు సాధించి ఉండాలి.
» వయసు: 31.07.2022 నాటికి ఏఈఈ-డ్రిల్లింగ్/సిమెంటింగ్ పోస్టులకు 28 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
» జీతం: నెలకు రూ.60,000 నుంచి రూ.1,80,000 వరకు చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: గేట్-2022 స్కోరు, విద్యార్హత, వ్యక్తిగత ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తు, రిజిస్ట్రేషన్‌కు చివరితేది: 12.10.2022
» వెబ్‌సైట్: www.ongcindia.com

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 72 ఉద్యోగాలు

బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 72
» పోస్టుల వివరాలు: డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్, డిజిటల్ లెండింగ్ రిస్క్ స్పెషలిస్ట్, స్పెషల్ అనలిస్ట్, బిజినెస్ మేనేజర్, జోనల్ మేనేజర్ తదితరాలు.
» విభాగాలు:పర్సనల్ లోన్,ఎంఎస్ఎంఈ లోన్, ఆటో లోన్, యూపీఐ, బీబీపీఎస్, ఫాస్టాగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, బీఎస్‌పీఎల్, డెబిట్ కార్డ్, యూఐ/యూఎక్స్ స్పెషలిస్ట్, లీడ్ కియాస్క్ ఆపరేషన్స్, డిజిటల్ పేమెంట్ ఫ్రాడ్ ప్రివెన్షన్, రెకన్ ప్రాసెస్ ఆటోమేషన్, డేటా ఇంజనీరింగ్,క్రియేటివ్ డిజైనింగ్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో గ్రాడ్యుయేషన్/బీఈ /బీటెక్ /బీఎస్సీ/బీసీఏ/ఎంసీఏ/సీఏ/సీఎఫ్ఏ/ఎంబీఏ/పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 3 నుంచి 10 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
» వయసు: 24 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఒప్పంద కాల వ్యవధి: ఐదేళ్లు
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.10.2022
» వెబ్‌సైట్: www.bankofbaroda.in

బామర్ లారీ అండ్ కోలిమిటెడ్, కోల్‌కతాలో 40 మేనేజర్ పోస్టులు

కోల్‌కతాలోని బామర్ లారీ అండ్ కోలిమిటెడ్.. మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 40
» పోస్టుల వివరాలు: సీనియర్ మేనేజర్-06, డిప్యూటీ మేనేజర్-17, మేనేజర్-03, అసిస్టెంట్ మేనేజర్-14.
» విభాగాలు: రిటైల్ సేల్స్, ఇండస్ట్రియల్ సేల్స్, మేనేజ్‌మెంట్, టెక్నికల్ సర్వీస్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ తదితరాలు.

అర్హత

» సీనియర్ మేనేజర్: సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ /ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 40 ఏళ్లు మించకూడదు. కనీసం 11 ఏళ్ల పని అనుభవం ఉండాలి. జీతం: నెలకు రూ.70,000 నుంచి రూ.2లక్షలు చెల్లిస్తారు.
» డిప్యూటీ మేనేజర్: సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 37 ఏళ్లు మించకూడదు. కనీసం 9 ఏళ్ల పని అనుభవం ఉండాలి. జీతం: నెలకు రూ.60,000 నుంచి రూ.1.8 లక్షలు చెల్లిస్తారు.
» మేనేజర్: సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 37 ఏళ్లు మించకూడదు. కనీసం 9 ఏళ్ల పని అనుభవం ఉండాలి. జీతం: నెలకు రూ.60,000 నుంచి రూ.1.8లక్షలు చెల్లిస్తారు.
» అసిస్టెంట్ మేనేజర్: సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్/పీజీ డిగ్రీ/ఎంబీఏ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 27ఏళ్లు మించకూడదు. కనీసం ఏడాది పని అనుభవం ఉండాలి. జీతం: నెలకు రూ.40,000 నుంచి రూ.1.4లక్షలు చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: పర్సనల్ ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.10.2022
» వెబ్‌సైట్: www.balmerlawrie.com



ఎస్ఎస్‌సీ.. కొలువుల మేళా!

» 20 వేల పోస్టులతో సీజీఎల్ఈ నోటిఫికేషన్
» పలు శాఖల్లో గ్రూప్-బి, గ్రూప్-సి ఉద్యోగాలు
» బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పోటీ పడే అవకాశం

బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు శుభవార్త! 20 వేల ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ).. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (సీజీఎల్)ఎగ్జామినేషన్-2022 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని..గ్రూప్-బి, గ్రూప్-సి కేడర్స్‌లో.. 35 హోదాల్లో..పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది! ఈ నేపథ్యంలో.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా విడుదల చేసిన.. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానంతోపాటు ప్రిపరేషన్ గైడెన్స్..

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-బి, గ్రూప్-సి, గ్రూప్-డి పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టే సంస్థ. ఏటా క్రమం తప్పకుండా నియామక ప్రక్రియలను చేపడుతున్న ఎస్ఎస్‌సీ.. తాజాగా గ్రూప్-బి, గ్రూప్-సి ఉద్యోగాల భర్తీకి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్-2022కు ప్రకటన విడుదల చేసింది.

20 వేల ఉద్యోగాలు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా విడుదల చేసిన సీజీఎల్ఈ నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో 35 హోదాల్లో దాదాపు 20 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టనుంది. వీటిలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్(ప్రివెంటివ్ ఆఫీసర్), ఇన్‌స్పెక్టర్ (ఎగ్జామినర్), అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(గ్రూప్-బి), సీబీఐలో సబ్ ఇన్‌స్పెక్టర్(గ్రూప్-బి), కాగ్‌లో డివిజినల్ అకౌంటెంట్(గ్రూప్-బి) వంటి పోస్టులు ఉన్నాయి.

విద్యార్హతలు

- అన్ని ఉద్యోగాలకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు బ్యాచిలర్ డిగ్రీతో పాటు సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఏ, ఎంకాం, ఎంబీఏ(ఫైనాన్స్) లేదా బిజినెస్ ఎకనామిక్స్‌లో పీజీ ఉత్తీర్ణతను అదనపు అర్హతగా పేర్కొన్నారు.
- జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి.. ఆ తర్వాత బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకుని ఉండాలి. లేదా.. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి.
- నిర్దిష్ట విద్యార్హతలను అక్టోబర్ 8, 2022లోపు పొంది ఉండాలి.

వయసు

దాదాపు అన్ని పోస్టులకు గరిష్ట వయో పరిమితిని 30 ఏళ్లుగా పేర్కొనగా.. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు 32 ఏళ్లుగా, గ్రూప్-సి పోస్టులకు 18-27 ఏళ్లుగా నిర్దేశించారు. జనవరి1, 2022ను గరిష్ట వయో పరిమితికి కటాఫ్ తేదీగా పేర్కొన్నారు.

వేతన శ్రేణి ఇలా

- గ్రూప్-బి గెజిటెడ్ పోస్టులకు రూ.47,600-రూ.1,51,100; గ్రూప్-బి నాన్ గెజిటెడ్ పోస్టులకు రూ.44,900-రూ.1,42,400; గ్రూప్-బిలోనే మరికొన్ని పోస్టులకు రూ.35,400- రూ.1,12,400; గ్రూప్-సి పోస్టులకు రూ.29,200-రూ.92,300, అదే విధంగా రూ.25,500-రూ.81,100 వేతన శ్రేణిని పేర్కొంది.

రెండు దశల రాత పరీక్ష

- ఎస్ఎస్‌సీ నిర్వహించనున్న సీజీఎల్ఈ పరీక్ష టైర్-1, టైర్-2 పేరుతో రెండు దశలుగా ఉంటుంది.

టైర్-1 పరీక్ష

తొలి దశలో టైర్-1 పరీక్ష 100 ప్రశ్నలు-200 మార్కులకు జరుగుతుంది. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(25 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (25 ప్రశ్నలు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయిస్తారు. పరీక్ష సమయం 1గంట.

టైర్-2లో నాలుగు పేపర్లు

టైర్-1లో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో టైర్-2 పరీక్ష నిర్వహిస్తారు. టైర్-2 పరీక్ష మొత్తం నాలుగు పేపర్లలో జరుగుతుంది. వివరాలు..

- పేపర్-1: పేపర్-1ను సెషన్-1, సెషన్-2లుగా నిర్వహిస్తారు. అదే విధంగా ప్రతి సెషన్‌ను రెండు సెక్షన్‌లుగా పేర్కొన్నారు. సెషన్-1 (సెక్షన్-1)లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్(మాడ్యూల్-1), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్(మాడ్యూల్-2) విభాగాల నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 60 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులు ఉంటాయి. సెషన్-1 సెక్షన్-2లో.. మాడ్యూల్-1 పేరుతో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌లో 45 ప్రశ్నలు, మాడ్యూల్-2 పేరిట జనరల్ అవేర్‌నెస్ విభాగాల్లో 25 ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 70 ప్రశ్నలకు 210 మార్కులు ఉంటాయి. సెషన్-1 సెక్షన్-3లో మాడ్యూల్-1 పేరుతో కంప్యూటర్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలతో 60 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ▪ సెషన్-2లో సెక్షన్-3 పేరుతో డేటాఎంట్రీ స్పీడ్ టెస్టను (మాడ్యూల్-3) 15 నిమిషాల వ్యవధిలో నిర్వహిస్తారు.
- పేపర్-2ను స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్‌తో 100 ప్రశ్నలతో 200 మార్కులకు నిర్వహిస్తారు.
- పేపర్-3ని జనరల్ స్టడీస్(ఫైనాన్స్ అండ్ ఎకనామిక్స్)తో 200 మార్కులకు 100 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ▪అన్ని పోస్టుల అభ్యర్థులు పేపర్-1కు తప్పనిసరిగా హాజరు కావాలి. ▪ పేపర్-2ను జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు మాత్రమే నిర్వహిస్తారు. ▪పేపర్-3ని అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహిస్తారు.

విజయం సాధించాలంటే

రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్

విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే ఈ విభాగంలో రాణించాలంటే..కోడింగ్, డీ-కోడింగ్, అనలిటికల్ పజిల్స్, క్రిటికల్ రీజనింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇంగ్లిష్ అక్షర క్రమాన్ని ముందు నుంచి వెనుకకు, వెనుక నుంచి ముందుకు ప్రాక్టీస్ చేయాలి. దీంతో పాటు ఏ అక్షరం ఎన్నో స్థానంలో ఉందో సులువుగా గుర్తించాలి. అదేవిధంగా అనలిటికల్ రీజనింగ్, సిలాజిజమ్స్, ఇనీక్వాలిటీస్, ఇన్‌పుట్, అవుట్‌పుట్, డేటా సఫిషియెన్సీ విభాగాలపై పట్టు సాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్/జనరల్ స్టడీస్‌లో.. మంచి స్కోర్ కోసం హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్, జీకే అంశాలపై పట్టు సాధించాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజ్, యావరేజెస్, రేషియో-ప్రపోర్షన్, ప్రాఫిట్-లాస్, సింపుల్-కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్-వర్క్, టైమ్-డిస్టెన్స్, పర్ముటేషన్స్-కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, మిక్షర్ అండ్ అలిగేషన్స్, పార్టనర్ షిప్‌పై దృష్టిపెట్టాలి. భాగహారాలు, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలను నోటితో గణించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. సింప్లిఫికేషన్స్‌కు బోడ్‌మస్ రూల్స్‌కు సంబంధించి ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తుంచుకోవాలి.

ఇంగ్లిష్ కాంప్రహెన్షన్

అభ్యర్థులు బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, రీడింగ్ కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్. అదేవిధంగా స్పెల్లింగ్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, టెన్సెస్, ప్రిపోజిషన్స్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, వొకాబ్యులరీ, రీ రైటింగ్ ద సెంటెన్స్, సెంటెన్స్ రీ-అరేంజ్‌మెంట్, ఆల్ఫాబెటికల్ ఆర్డర్, ప్రెసిస్ రైటింగ్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, కాంప్లెక్స్ సెంటెన్సెస్ వంటి ముఖ్యాంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, వొకాబ్యులరీల్లోనూ పూర్తి స్థాయిలో నైపుణ్యం పొందాలి.

డేటా ఇంటర్‌ప్రిటేషన్

టేబుల్స్, చార్ట్‌లు, గ్రాఫ్‌ల ద్వారా సమాచార మిస్తూ ప్రశ్నలు అడిగే డేటా ఇంటర్‌ప్రిటేషన్ ప్రశ్నలను సాధించాలంటే.. పర్సంటేజెస్, యావరేజెస్, రేషియోలలో అవగాహన ఉండాలి. వివిధ రకాల గ్రాఫ్‌లను సాధన చేయాలి. ఈ విభాగంలో పట్టు కోసం.. టేబుల్స్, బార్ చార్ట్స్, పై చార్ట్స్ మొదలైన వాటిని బాగా ప్రాక్టీస్ చేయాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించేందుకు కంప్యూటర్ ఫండమెంటల్స్, బేసిక్ కంప్యూటర్ స్ట్రక్చర్, ఆపరేటింగ్ సిస్టమ్, నెట్‌వర్క్, ఇంటర్నెట్, సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డీబీఎంఎస్, ఎంఎస్ ఆఫీస్‌లకు సంబంధించి బేసిక్ టెర్మినాలజీపై పట్టు సాధించాలి. సిస్టమ్‌కు సంబంధించి హార్డ్‌వేర్ టూల్స్, వాటి ఉపయోగాలు వంటి వాటిపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

పేపర్-2, పేపర్-3

జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే పేపర్-2,అదే విధంగా..అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే పేపర్-3లలో రాణించేందుకు అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను అభ్యసనం చేయాలి. అదే విధంగా గత ప్రశ్న పత్రాలు, నమూనా ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తు చివరి తేదీ: అక్టోబర్ 8, 2022
- దరఖాస్తులో సవరణలు: అక్టోబర్ 12-అక్టోబర్ 13, 2022
- టైర్-1 పరీక్ష తేదీ: డిసెంబర్, 2022లో
- టైర్-2 పరీక్ష తేదీ: ఫిబ్రవరి, 2023లో నిర్వహించే అవకాశం
- వెబ్‌సైట్: https://ssc.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,021	302
58,099	17,327

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	10,868	▽	199
డోజోన్స్	29,590	▽	486
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,019	▽	141
డాక్స్	12,284	▽	247
షాంఘై	3,088	▽	21
నికాయ్	27,154	▽	159

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

పెట్టుబడి.. పదికాలాలు పచ్చగా!

ఈఎస్‌జీ థీమ్‌కు పెరుగుతున్న ఆదరణ



- అన్నీ తెలుసుకున్నాకే ఇన్వెస్ట్ చేయాలి...
- దేశీయంగా అందుబాటులో 10 ఫండ్స్
- వీటిల్లో మోస్తరుగానే రాబడులు
- నిబంధనలను కఠినం చేస్తున్న సెబీ
- దీర్ఘకాలంలోనే మెరుగైన ఫలితాలు

అసలు పెట్టుబడి ఉద్దేశం రాబడే కదా..? ఈ రాబడి కాంక్షే ఇన్వెస్టర్ల నిర్ణయాలను ప్రభావితం చేస్తుంటుంది. కానీ, నేడు భూ మండలం వాతావరణ మార్పులు అనే పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వనరుల వినియోగం గరిష్ట స్థాయికి చేరి, కాలుష్యం అసాధారణ స్థాయికి చేరిపోయిన తరుణంలో.. పర్యావరణంపై మమకారంతో పుట్టుకొచ్చిందే ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంట్, సోషల్, గవర్నెన్స్) విధానం. తాము పెట్టుబడి కోసం ఎంపిక చేసుకుంటున్న కంపెనీ.. పర్యావరణాన్ని ఏ రకంగా చూస్తోందన్నది ఇన్వెస్టర్‌కు కీలకం అవుతుంది. అంటే పర్యావరణానికి తన ఉత్పత్తులు, తయారీ, సేవల ద్వారా హాని కలిగించకూడదు. తన ఉద్యోగులు, భాగస్వాములతో ఎలా వ్యవహరిస్తుందన్నది 'సోషల్'. ఇక కంపెనీ నిర్వహణ తీరుకు అద్దం పట్టేదే గవర్నెన్స్. ఈ మూడింటిలో పాస్ మార్కులు పొందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడమే ఈఎస్‌జీ ఇన్వెస్టింగ్. ప్రపంచవ్యాప్తంగా ఇటీవలి కాలంలో పాపులర్ అవుతున్న ఈ విధానం పట్ల రిటైల్ ఇన్వెస్టర్లు కూడా ఆకర్షితులవుతున్నారు. అయితే, ఇందులో కొన్ని పరిమితులు ఉన్నాయి. దేశీయంగా ఇంకా పూర్తి స్థాయిలో పరిణతి చెందలేదు. కనుక ఈఎస్‌జీ థీమ్ పట్ల ఆసక్తితో ఉన్న ఇన్వెస్టర్లు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. అవేంటో సమగ్రంగా వివరించే కథనమిది...

ప్రపంచవ్యాప్తంగా ఈఎస్‌జీ పెట్టుబడులు 2020 నాటికే 35 ట్రిలియన్ డాలర్లు (రూ. 2800 లక్షల కోట్లు) దాటాయంటే దీని ప్రాధాన్యం ఏ మేరకో అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఈ తరహా పర్యావరణ అనుకూల పెట్టుబడి విధానం కొత్తదేమీ కాదు. కాకపోతే దీని రూపం మారింది. గ్రీన్ ఇన్వెస్టింగ్, సామాజిక బాధ్యతా పెట్టుబడి విధానం, సుస్థిర పెట్టుబడి అన్నవి ఈఎస్‌జీని పోలినవే. ఈ తరహా పెట్టుబడులన్నింటినీ ఏకం చేసింది ఈఎస్‌జీ. ఇప్పుడు ఈఎస్‌జీ అనుకూలం. ఈఎస్‌జీ వ్యతిరేకం పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు కంపెనీలను చూస్తున్నారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ప్రత్యేకంగా ఈఎస్‌జీ ఫండ్స్‌ను ఆఫర్ చేస్తున్నాయి.

పెట్టుబడులు భిన్నం..

కంపెనీలు ఏ స్థాయిలో లాభాలను ఆర్జిస్తున్నాయనే దానికంటే.. ఏ విధంగా లాభాలను పొందుతున్నాయన్నది ఈఎస్‌జీ విధానంలో కీలకం. పర్యావరణానికి హాని తలపెట్టకుండా, వీలైతే మేలు చేస్తూ, చక్కని లాభాలను పోగేస్తున్న కంపెనీలకు ఈ విధానంలో మంచి డిమాండ్ ఉంటుంది. కేవలం గత రెండు సంవత్సరాల్లోనే సుమారు 32 బిలియన్ డాలర్లు (రూ.2.56 లక్షల కోట్లు) ఈఎస్‌జీ ఆధారిత యూఎస్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులుగా వెళ్లాయి. ముందే చెప్పుకున్నట్టు ఈ పెట్టుబడికి సామాజిక స్పృహ ఎక్కువ. కనుక రాబడుల విషయంలో కొంత రాజీ పడక తప్పదు. ఎంఎస్‌సీఐ వరల్డ్ ఈఎస్‌జీ ఇండెక్స్ రాబడులను పరిశీలిస్తే.. గత 10 ఏళ్లలో రెట్టింపైంది. ప్రపంచవ్యాప్తంగా ఆమోదించబడిన సార్వత్రిక నిబంధనలు, ప్రమాణాలు ఈఎస్‌జీకి లేవు. అలాగే ఏకీకృత నిర్వచనం, విధానం కూడా లేవు. అసలు ఈఎస్‌జీ పేరుతో మూలసూత్రాలకు విరుద్ధంగా పెట్టుబడులు పెడుతున్న కంపెనీలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు కొన్ని ఈఎస్‌జీ ఈక్విటీ ఫండ్స్.. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ తర్వాత చమురు ధరల పెరుగుదలతో షెల్, రెప్సోల్ కంపెనీల్లో పెట్టుబడులు పెంచుకున్నాయి. కాగా, పెట్టుబడులపై భవిష్యత్తులో మరింత స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఫండ్స్ మేనేజర్ల పెట్టుబడుల విధానాలకు, ఈఎస్‌జీ సూత్రాలు ఏ విధంగా సరిపోలుతున్నాయో వెల్లడించేలా త్వరలో యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మార్గదర్శకాలను అమల్లోకి తీసుకురానుంది. అలాగే, సెబీ సైతం ఫండ్స్ ఈఎస్‌జీ పథకాలకు సంబంధించి వెల్లడించాల్సిన సమాచారం విషయమై విస్తృతమైన సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేయడం గమనించదగిన అంశం.





కొంచెం జాగ్రత్త అవసరం..

ఈఎస్‌జీ స్టాక్స్‌కు మార్కెట్ కొంచెం ప్రీమియం వ్యాల్యూషన్ ఇస్తుంటుంది. దీంతో కొన్ని కంపెనీలు ఈఎస్‌జీ థీమ్‌ను దుర్వినియోగం చేస్తున్నాయి. తమ ఉత్పత్తులు పర్యావరణం అనుకూలమని తప్పుడు సమాచారాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ తరహా ధోరణలను అరికట్టేందుకు నూతన పర్యావరణ నిబంధనలను కేంద్రం అమల్లోకి తీసుకురానుంది. దీని కింద కంపెనీలు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కాలుష్య విడుదలకు సంబంధించి మరింత సమాచారం, వివరాలను వెల్లడించాలి. ఈఎస్‌జీ రేటింగ్ కోసం థర్డ్ పార్టీ సంస్థలపైనే కంపెనీలు ఆధారపడాల్సి వస్తోంది. సార్వత్రిక బెంచ్ మార్క్ లేదా పద్ధతి అనేది ఈఎస్‌జీ రేటింగ్‌లకు అమల్లో లేదు. కేంద్ర నూతన నిబంధనలు, సెబీ సంప్రదింపుల పత్రం తర్వాత విడుదల చేసే మార్గదర్శకాలతో ఈఎస్‌జీ థీమ్ మరింత పటిష్ఠం కానుంది. పెట్టుబడులకు ముందు ఆయా అంశాలపై అవగాహన అవసరం.

ఈఎస్‌జీ స్కోర్ ఎలా?

ఎన్విరాన్‌మెంట్

కంపెనీ కార్యకలాపాలు పర్యావరణంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి? పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకున్న చర్యలు? గతంలో ఇలాంటి లక్ష్యాలను ఏ మేరకు సాధించింది? ఏ మేరకు ఇంధనాన్ని వినియోగిస్తోంది? పునరుత్పాదక ఇంధన వనరులను ఏర్పాటు చేసుకుందా? నీటి వినియోగం, కాలుష్యం విడుదల, వ్యర్థాల నిర్వహణ ఇలాంటి అంశాలన్నీ ఈఎస్‌జీ స్కోర్‌కు ముందు థర్డ్ పార్టీ సంస్థలు చూస్తాయి.

సోషల్

ఉద్యోగులతో కంపెనీకి ఉన్న అనుబంధం, వారి భద్రతకు, ఆరోగ్యానికి తీసుకున్న చర్యలు, సమాజంతో ఉన్న సంబంధాలు, భాగస్వాములతో సంబంధాలను అధ్యయనం చేస్తారు. భాగస్వాములు, ఉద్యోగులు అందరినీ ఏకరీతిన చూసేందుకు వీలుగా కంపెనీలు అమలు చేస్తున్న విధానాలు, పద్ధతులను పరిశీలించడం జరుగుతుంది. నాణ్యత, సైబర్ సెక్యూరిటీ, డేటా భద్రత చర్యలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది.

గవర్నెన్స్

కంపెనీ బోర్డు నిర్మాణం ఎలా ఉంది? నిపుణులు, మహిళలకు చోటు కల్పించారా? బోర్డు కమిటీల ఏర్పాటు, బోర్డు పనితీరు, అవినీతి నిరోధానికి తీసుకున్న చర్యలు, స్టాట్యుటరీ ఆడిటర్లు, ఆడిట్, ఫైనాన్షియల్ రిపోర్టింగ్‌ను కూడా పరిశీలిస్తారు.

దేశీయంగా... ఇంకా ఆరంభ దశలోనే

దేశీయంగా ఈఎస్‌జీ థీమ్ ఇంకా ఆరంభ దశలోనే ఉందని చెప్పుకోవచ్చు. కనుక రిటైల్ ఇన్వెస్టర్లు నేరుగా ఈఎస్‌జీ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం రిస్క్‌తో కూడుకున్నదే. ఎందుకంటే ఇది లోతైన అంశం. విస్తృత సమాచారాన్ని అధ్యయనం చేయాల్సి వస్తుంది. ఎస్ఈఎస్ (స్టేక్ హోల్డర్స్ ఎంపవర్‌మెంట్ సర్వీసెస్) తదితర కొన్ని ఉచిత వేదికలు ఈఎస్‌జీ కంపెనీలకు సంబంధించి ర్యాంకులను ప్రకటిస్తున్నాయి. ఇతర సంస్థల నుంచి ఈఎస్‌జీ కంపెనీల వివరాలు పొందాలంటే కొంత చెల్లించుకోవాల్సి వస్తుంది. నేరుగా కంటే మ్యూచువల్ ఫండ్స్ రూట్ నయం. ప్రస్తుతం 10 వరకు ఈఎస్‌జీ ఆధారిత థీమాటిక్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఎనిమిది పథకాలు గత రెండేళ్లలో ప్రారంభమైనవే ఉన్నాయి. రెండు పథకాలు ప్యాసివ్‌గా (ఇండెక్స్‌ల్లో ఇన్వెస్ట్ చేసేవి) పనిచేస్తున్నాయి. ఒక పథకం దీర్ఘకాలం నుంచి ఉన్నా కానీ, ఆరంభంలో ఈఎస్‌జీ పథకంగా లేదు.

దీర్ఘకాలంలో వ్యాపార పరంగా నిలదొక్కుకోగలవా? ఈఎస్‌జీలో ఏ అంశాల పరంగా కంపెనీ మెరుగ్గా ఉంది? వాటిని ఇక ముందూ కొనసాగించగలదా? భవిష్యత్తు వృద్ధి అవకాశాలు ఇలాంటి అంశాలను సాధారణ ఇన్వెస్టర్ కంటే మ్యూచువల్ ఫండ్స్ పరిశోధన బృందాలు మెరుగ్గా అంచనా వేయగలవు. ఇక ఈఎస్‌జీలో రెండు అంశాల్లో టిక్ మార్క్‌లు పడినా ఆయా కంపెనీలను సైతం ఫండ్స్ ఎంపిక చేసుకుంటున్నాయి. ఎందుకంటే పర్యావరణం, సోషల్, గవర్నెన్స్ మూడింటిలోనూ సరితూగే కంపెనీలు కొన్నే ఉంటున్నాయి. అలాంటప్పుడు అదనపు పెట్టుబడుల సర్దుబాటుకు వీలుగా రెండు అంశాల్లో మెరుగైన పనితీరు చూపిస్తున్న వాటిని కూడా ఫండ్స్ ఎంపిక చేసుకుంటున్నాయి. 2022 అక్టోబర్ 1 నుంచి బిజినెస్ రెస్పాన్సిబిలిటీ అండ్ సస్టెయినబిలిటీ రిపోర్ట్ (బీఆర్ఎస్ఆర్)ను విడుదల చేసే కంపెనీల్లోనే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే నిర్వహిస్తున్న పెట్టుబడులకు 2023 సెప్టెంబర్ 30 వరకు సెబీ వెసులుబాటు కల్పించింది. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌లో (పీఎంఎస్) ఎస్‌బీఐ ఈఎస్‌జీ పోర్ట్‌ఫోలియో, అవెండస్ ఈఎస్‌జీ ఫండ్స్ పీఎంఎస్, వైట్ ఓక్ ఇండియా పయనీర్స్ ఈక్విటీ ఈఎస్‌జీ తదితర సంస్థల సేవలు అందుబాటులో ఉన్నాయి.



ఈఎస్‌జీ ఫండ్స్ రాబడులు

పథకం	ఏడాది రాబడులు (శాతంలో)	మూడేళ్లలో రాబడులు	నిర్వహణ ఆస్తులు (రూ.కోట్లలో)
క్వాంట్ ఈఎస్‌జీ ఫండ్	27.11	-	107
ఎస్‌బీఐ మాగ్నమ్ ఈక్విటీ ఈఎస్‌జీ	3.02	18.48	4,742
క్వాంటమ్ ఇండియా ఈఎస్‌జీ	మైనస్ 0.34	20.60	63
ఇన్వెస్కో ఇండియా ఈఎస్‌జీ	మైనస్ 2	-	750
ఏబీఎస్ఎల్ ఈఎస్‌జీ	మైనస్ 2.85	-	1,031
కోటక్ ఈఎస్‌జీ అపార్చునిటీస్	మైనస్ 2.86	-	1,428
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈఎస్‌జీ	మైనస్ 3.70	-	1,442
యాక్సిస్ ఈఎస్‌జీ ఈక్విటీ	మైనస్ 8.62	-	1,793
నిఫ్టీ 100 ఈఎస్‌జీ టీఆర్ఐ	0.26	21.16	-

దీర్ఘకాలంలోనే రాబడులు..?

ఈఎస్‌జీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల కంటే నిఫ్టీ 100 ఈఎస్‌జీ ఇండెక్స్ పనితీరే కాస్త మెరుగ్గా కనిపిస్తోంది. గత పదేళ్ల కాలంలో వార్షికంగా 15.25 శాతం కాంపౌండెడ్ రాబడిని ఈ సూచీ ఇచ్చింది. నిఫ్టీ 100 రాబడి కంటే ఇది ఒక శాతం ఎక్కువ. ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ రాబడులు మిశ్రమంగా ఉన్నాయి. ఏడాది కాలంలో రాబడులు మైనస్ 9 శాతం నుంచి ప్లస్ 27 శాతం మధ్య ఉన్నాయి. కానీ, మూడేళ్ల కాలంలో మాత్రం సానుకూల పనితీరు చూపించాయి. ఏడు పథకాలు ఏడాది కాలంలో నష్టాలను ఇవ్వడం గమనించాలి. సెక్టోరల్ ఫండ్స్.. ఫార్మా (12 శాతం డౌన్), ఐటీ (15 శాతం డౌన్) కంటే ఈఎస్‌జీ ఫండ్స్ కాస్త నయమనే చెప్పుకోవాలి. మార్కెట్లో ఒక్కో సైకిల్‌లో కొన్ని రంగాల షేర్లు ర్యాలీ చేయడం, కొన్ని ప్రతికూల రాబడులను ఇవ్వడం సాధారణంగా ఉండే పరిణామమే. ఈఎస్‌జీ పథకాలు రాబడులను ఇవ్వాలంటే పెట్టుబడులకు తగినంత వ్యవధి ఇవ్వాలన్నది మర్చిపోవద్దు.

పోర్ట్‌ఫోలియో భిన్నమేమీ కాదు..

ఈఎస్‌జీ థీమ్ పట్ల ఆసక్తిగా ఉన్న ఇన్వెస్టర్లు ముందుగా ఈఎస్‌జీ ఫండ్స్ పోర్ట్‌ఫోలియోను పరిశీలించడం, అధ్యయనం చేయడం ద్వారా కొన్ని అంశాలను అయినా తెలుసుకునే వీలుంటుంది. ఈఎస్‌జీ ప్యారామీటర్లకు తూగే దేశీ స్టాక్స్ 200 వరకు, ఇంటర్నేషనల్ స్టాక్స్ 40 వరకు ఉంటాయి. ఇవన్నీ థీమ్యాటిక్ ఫండ్స్ కిందకు వస్తాయి. కనుక మొత్తం పెట్టుబడుల్లో 80 శాతాన్ని ఈఎస్‌జీ కంపెనీల్లోనే అవి ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మిగిలిన 20 శాతం కూడా ఈఎస్‌జీ థీమ్‌కు పూర్తి వ్యతిరేకంగా ఉండకూడదని సెబీ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ప్రముఖ మ్యూచువల్ ఫండ్స్ పథకాల పోర్ట్‌ఫోలియోల్లో కనిపించే స్టాక్సే ఈఎస్‌జీ పథకాల్లోనూ కనిపించడం ఆశ్చర్యమేమీ కాదు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బీఎఫ్ఎస్ఐ), ఐటీ రంగ కంపెనీలు ఎక్కువ శాతం ఈఎస్‌జీ పథకాల్లో ప్రముఖంగా ఉన్నాయి. ఇవి పర్యావరణానికి హాని చేయకపోవడం, ప్రజల జీవనాన్ని సౌకర్యవంతం, మెరుగు చేయడం కోసం పనిచేస్తుంటాయి. కనుక వీటికి ఎక్కువ పథకాలు ఓటేస్తున్నాయి. 80 శాతం ఈఎస్‌జీ పథకాల్లో ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంకు, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ ప్రముఖ స్టాక్స్‌గా ఉన్నాయి. దాదాపు అన్ని ఈఎస్‌జీ పథకాల్లోనూ టాప్-10 హోల్డింగ్స్‌లో 4 నుంచి 9 వరకు అవే కంపెనీలు దర్శనమిస్తాయి. పీఎంఎస్, ఫండ్స్ పోర్ట్‌ఫోలియోలో సాధారణంగా కనిపించే ఇతర స్టాక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, టైటాన్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, విప్రో, హెచ్‌యూఎల్ ఉన్నాయి.



ఫ్రీడమ్ కుకింగ్ ఆయిల్స్‌కు ప్రతిష్టాత్మక ఐమా అవార్డు



హైదరాబాద్: ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ అత్యంత ప్రతిష్టాత్మకమైన ఏఐఎంఏ (ఐమా)- ఆర్‌కె స్వామి హై పెర్ఫార్మెన్స్ బ్రాండ్ అవార్డు 2022 ను అందుకుంది. 'అడ్వాంటేజ్ ఇండియా : థ్రైవింగ్ ఇన్ ద న్యూ వరల్డ్ ఆర్డర్' నేపథ్యంతో నిర్వహించిన ఐమా 49 వ జాతీయ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం జరిగింది. ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) పీ చంద్రశేఖర రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఎడ్వర్టయిజింగ్ ఏజెన్సీ వ్యవస్థాపకులు ఆర్ కె స్వామి జ్ఞాపకార్థం 2009లో ప్రారంభించిన ఈ అవార్డును అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ, వృద్ధి చెందుతున్న భారతీయ బ్రాండ్‌కు అందజేస్తుంటారు. ఇటీవల ప్రైడ్ ఆఫ్ ఇండియా బ్రాండ్ అవార్డు 2022ను 'బెస్ట్ బ్రాండ్స్ ఆఫ్ సౌత్ ఇండియా' విభాగంలో ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ అందుకున్న సంగతి తెలిసిందే.

30లో ఫండ్స్ పెట్టుబడులు ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయసు 30 ఏళ్లు. మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ప్రతి నెలా రూ.5,000 చొప్పున పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నాను. సిప్ కోసం ఏ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు అనుకూలం?

– మొహినీష్

మీరు తీసుకున్న మంచి నిర్ణయానికి అభినందనలు. పెట్టుబడులను మరీ ఆలస్యం చేయొద్దంటూ తరచుగా మేము చెబుతుంటాం. మీరు పన్ను ఆదా చేయడం కోసం పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నట్టు అయితే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) మంచి ఆప్షన్ అవుతుంది. ఈఎల్ఎస్ఎస్‌లో పెట్టుబడులు పెడితే ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల ఆదాయంపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ఈ ప్రయోజనం కల్పిస్తోంది. ఒకవేళ మీరు కనీసం ఐదేళ్లు, అంతకంటే దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేసేట్టు అయితే అందుకు ఈఎల్ఎస్ఎస్ మెరుగైన సాధనమే అవుతుంది. ఇవి పూర్తి ఈక్విటీ పథకాలు. వేర్వేరు మార్కెట్ పరిమాణంతో కూడిన, వివిధ రంగాల్లోని కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. దీంతో దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని మించి మెరుగైన రాబడినిస్తాయి. అయితే, వీటిల్లో పెట్టుబడులకు మూడేళ్ల లాకిన్ ఉంటుందని మర్చిపోవద్దు. సిప్ అయితే విడిగా ప్రతి సిప్ పెట్టుబడికి మూడేళ్లు అమలవుతుంది. ఒకవేళ మీరు ఈక్విటీ పెట్టుబడులకు సంబంధించి ఎటువంటి పన్ను ఆదాను కోరుకోనట్టయితే.. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల పన్ను ఆదా ప్రయోజనాన్ని వాడుకుని ఉంటే, అప్పుడు మీ ప్రణాళిక వేరే విధంగా ఉండొచ్చు. మీరు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అగ్రెస్సివ్ హైబ్రిడ్ పథకాలు సాధారణంగా 65 నుంచి 80 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మిగిలిన మొత్తాన్ని స్థిరాదాయ పథకాలకు కేటాయిస్తాయి. డెట్ అన్నది ఈక్విటీలతో సంబంధం లేనిది. డెట్ పెట్టుబడుల రాబడులు ఈక్విటీల మాదిరిగా భారీ అస్థిరతలకు లోను కావు. మొదటి సారి పెట్టుబడులు పెట్టే వారికి అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ మంచి ఎంపిక అవుతుంది. కనుక ఈఎల్ఎస్ఎస్ లేదా అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో సిప్ మొదలు పెట్టుకోవచ్చు. రెండు నుంచి మూడేళ్ల పాటు వీటిల్లో ఇన్వెస్ట్ చేసి, ఈక్విటీలు ఎలా పనిచేస్తాయో అవగాహన వచ్చిన తర్వాత.. అప్పుడు అచ్చమైన ఈక్విటీ పథకాలైన.. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌ను దీర్ఘకాల లక్ష్యాల కోసం ఎంపిక చేసుకోవచ్చు.

నేను రూ.50,000 మొత్తాన్ని మూడు నుంచి ఆరు నెలల కాలానికి ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. మా పిల్లల విద్య కోసం ఆరు నెలల తర్వాత ఈ మొత్తం కావాల్సి ఉంది. మెరుగైన రాబడుల కోసం ఈ మొత్తాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– సంతోష్ కుమార్

ఇంత స్వల్ప కాలం కోసం పెట్టుబడులు పెట్టాలనుకుంటే, ముందు లక్ష్యం విషయంలో రాజీ పడడానికి అవకాశం ఉండదు. ఎంతో కాలం లేదు కనుక పెట్టుబడికి భద్రత ఎక్కువ ఉండాలి. రాబడుల కంటే పెట్టుబడిని కాపాడుకునే విధంగా వ్యూహం ఉండాలి. కనుక ఈ మొత్తాన్ని మీరు బ్యాంకు ఖాతాలోనే కొనసాగించుకోవచ్చు. లేదంటే ఆరు నెలల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వీటిల్లో రాబడులు తక్కువే అయినా గ్యారంటీతో కూడినవి. పైగా పెట్టుబడికి భద్రత ఎక్కువ. ఆరు నెలలే ఉంది కనుక కచ్చితంగా ఆ సమయానికి పెట్టుబడిని రాబడితో పాటు సులభంగా వెనక్కి తీసుకోవచ్చు. బ్యాంకులో చేసే డిపాజిట్ రూ.5 లక్షల వరకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ నుంచి బీమా ఉంటుంది. ఇవి కాకుండా లిక్విడ్ ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి ట్రెజరీ బిల్లులు, ప్రభుత్వ సెక్యూరిటీలు, రెపో సర్టిఫికెట్లలో ఇన్వెస్ట్ చేస్తాయి. గరిష్ఠంగా 91 రోజుల కాల వ్యవధి కలిగిన సెక్యూరిటీల్లోనే లిక్విడ్ పథకాలు ఇన్వెస్ట్ చేస్తాయి. బ్యాంకు డిపాజిట్ల కంటే లిక్విడ్ ఫండ్స్‌లో కొంచెం అదనపు రాబడి వస్తుంది. కాకపోతే పెట్టుబడి భద్రతకు అవి హామీ ఇవ్వవు.

సాక్షి స్టాక్స్

బాలాజీ అమైన్స్	సీడీ ఈక్విసెర్చ్ ప్రయివేట్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,548 టార్గెట్: రూ. 4,542

ఎందుకంటే: వివిధ రసాయనాల తయారీ బాలాజీ అమైన్స్ ఆదాయం 2022-23 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 49% జంప్‌చేసి రూ. 670 కోట్లను తాకింది. కొత్తగా ఏర్పాటు చేసిన ఎథిలామైన్స్ యూనిట్‌తోపాటు సామర్థ్య విస్తరణ చేపట్టిన డైమిథైల్ ఫార్మామైడ్(డీఎంఎఫ్)వినియోగం ఊపందుకోవడం ఇందుకు దోహదపడింది. దీంతో క్యూ1లో టర్నోవర్ భారీగా ఎగసింది. మొత్తం అమ్మకాల పరిమాణం 7% వృద్ధితో 27,358 మిలియన్ టన్నులకు చేరింది. ఇది అంతర్గత ట్రెండును తెలియజేస్తున్నప్పటికీ ప్రొడక్టుల మిక్స్ కారణంగా మరింత మెరుగుపడే అవకాశముంది. ముడిసరుకుల ధరలు మందగించడంతో త్రైమాసికవారీగా చూస్తే ఆదాయం 14 శాతం వెనకడుగు వేసింది. అయితే నిర్వహణ లాభాలు అమ్మకాల ట్రెండ్‌ను అధిగమిస్తూ 52 శాతం దూసుకెళ్లాయి. ప్రపంచ మార్కెట్లలో సరఫరా అవాంతరాలకు తోడు.. అత్యధిక శాతం ఉత్పత్తులకు అధిక ధరలు లభించడంతో బాలాజీ స్పెషాలిటీ కెమికల్స్ మార్జిన్లు హైజంప్ చేశాయి. ఈ ఏడాది క్యూ1లో ఈ అనుబంధ సంస్థ అమ్మకాలు రూ. 79 కోట్ల నుంచి రూ. 224 కోట్లకు దూసుకెళ్లాయి.



భారతీ ఎయిర్‌టెల్	ప్రభుదాస్ లీలాధర్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 771 టార్గెట్: రూ. 1,032

ఎందుకంటే: వర్ధమాన డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న వివిధ వృద్ధి అవకాశాలు టెలికం దిగ్గజం ఎయిర్‌టెల్‌కు భారీ లబ్ధిని చేకూర్చనున్నాయి. పటిష్ట బ్రాండుతో మొబైల్, ఎంటర్‌ప్రైజ్ బిజినెస్, హోమ్ సర్వీసులు, డీటీహెచ్ విభాగాలలో సేవలు విస్తరించడం ఇందుకు సహకరించనుంది. మరోవైపు ఆఫ్రికా బిజినెస్ సైతం మద్దతివ్వనుంది. అత్యంత నాణ్యమైన, ఉపయుక్తమైన కస్టమర్లను ఆకట్టుకోవడం ద్వారా ఒక్కో సగటు వినియోగదారుపై ఆదాయం(ఏఆర్‌పీయూ) పెంచుకుంటూ వస్తోంది. గతేడాది(2022)లో రూ. 166గా నమోదైన ఏఆర్‌పీయూ 2025కల్లా రూ. 266కు పుంజుకోగలదని అంచనా. ప్రభుత్వ విధానాల మద్దతుకు జతగా డిజిటైజేషన్, ఇన్నోవేషన్ కంపెనీ బలాలుగా చెప్పవచ్చు. 4జీ మౌలిక సదుపాయాల ద్వారానే అందుబాటులో 5జీ సేవలను ప్రారంభించనుండటం వీటికి జత కలవనున్నాయి. ఇటీవల సొంతం చేసుకున్న 3.5 జీహెచ్‌జెడ్ స్పెక్ట్రమ్‌ను ఇందుకు వినియోగించనుంది. కాగా.. 2022-25 కాలంలో దేశీ టెలికం రంగం అత్యంత వేగవంత వృద్ధి దశలో ప్రవేశిస్తున్నట్లు అంచనా. వివిధ మార్గాలలో సమీకరించిన రూ. లక్ష కోట్లతో రుణ భారాన్ని తగ్గించుకోనుంది.



గమనిక: షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే..

వరి నాట్లు వేసిన కలెక్టర్లు



వరి నాట్లు వేస్తున్న విజయ్‌కృష్ణన్, దినేష్‌కుమార్

బాపట్ల: అది బాపట్ల జిల్లాలోని మురుకొండపాడు గ్రామం. శివారున జలయజ్ఞంలో తడిసిన పంట పొలం. మరో వైపు ఆకాశాన భగభగ మండుతున్న భానుడు..ఇంతలో ఓ కూలీల బృందం ఆ పంట చేలో వడివడిగా అడుగులు వేసింది. అప్పటికే పరిచి ఉన్న వరి మొక్కలను చేత పట్టారు ఆ కూలీలు. ఎర్రటి ఎండలో నేలమ్మ ఒడిలో మట్టి గంధంలో తడిసిన ఆ కూలీలే కలెక్టర్ దంపతులు. ఒకరు ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, మరొకరు బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్. ఆదివారం మురుకొండపాడు వరి చేలోకి వీరు తమ కుటుంబంతో సహా వచ్చి వరినాట్లు వేశారు. గంటకు పైగా వరి మొక్కల నాటారు. అక్కడికే క్యారేజీలు తెప్పించుకొని గట్టుపై కూర్చుని భోజనం చేశారు.

రైతులకు పుష్కలంగా రుణాలు

- ప్రభుత్వం సున్నా వడ్డీ చెల్లింపుతో రుణాలివ్వడానికి ముందుకొస్తున్న బ్యాంకులు
- ఏడాదికేడాది రైతుల సంఖ్య, రుణాల మంజూరులో పెరుగుదల
- మూడేళ్లలో 307.20 లక్షల మంది రైతులకు రూ.4,37,828 కోట్ల రుణాలు

మూడేళ్లుగా రైతులకు వ్యవసాయ రుణాల మంజూరు ఇలా

సంవత్సరం	రుణ మొత్తం (రూ.కోట్లలో)	రైతుల సంఖ్య
2019-20	1,13,998	94,47,136
2020-21	1,46,876	1,05,92,984
2021-22	1,76,954	1,06,80,256
2022-23 ఖరీఫ్	85,346	48,49,808

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడేళ్లుగా అన్నదాతలకు పుష్కలంగా వ్యవసాయ రుణాలు మంజూరవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సున్నా వడ్డీని క్రమం తప్పకుండా చెల్లిస్తుండటంతో రైతులకు అవసరమైన వ్యవసాయ రుణాలను బ్యాంకులు విరివిగా మంజూరు చేస్తున్నాయి. ఏడాదికేడాదికి రైతుల సంఖ్యతో పాటు రుణాల మంజూరులో పెరుగుదల ఉంది. గత మూడేళ్లలో అంటే 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి 2021–22 ఆర్థిక సంవత్సరం వరకు 307.20 లక్షల మంది రైతులకు రూ.4,37,828 కోట్ల వ్యవసాయ రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో వ్యవసాయ రుణాల మంజూరు లక్ష్యం రూ.97,197 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.85,346 కోట్ల రుణాలను 48.49 లక్షల మంది రైతులకు బ్యాంకులు మంజూరు చేశాయి. మరో పక్క రాష్ట్రంలో కౌలు సాగుదారులకు కూడా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించడానికి రాష్ట్ర ప్రభుత్వం పంట సాగుదారు హక్కుల చట్టం–2019ను తీసుకువచ్చింది. ఈ చట్టం కింద పంట సాగుదారుల హక్కు పత్రాలు పంపిణీ చేస్తోంది. వాస్తవ సాగుదారులకు సీసీఆర్‌సీ పత్రాలు జారీ చేయడంతో బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నాయి. కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడానికి ఆర్‌బీకేల్లోని సిబ్బంది సహకరిస్తున్నారు. ఇప్పటి వరకు 4.75 లక్షల మంది కౌలు రైతులకు రూ.3595.02 కోట్ల మేర బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయి. వీలైనంత ఎక్కువ మంది కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బ్యాంకర్ల సమావేశాల్లో ఈ విషయంపై సీఎంతో పాటు జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. గత సర్కారు.. రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని మోసం చేయడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి రుణాలు పొందలేకపోయిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఆ పరిస్థితి పూర్తిగా మార్చేసి, రైతులకు మేలు చేసే పలు నిర్ణయాలు తీసుకుంది.

వృద్ధుడి అవయవదానం



గన్నవరం రూరల్: ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురైన వృద్ధుడి అవయవాలను బంధువులు జీవన్‌ధాన్ ద్వారా దానం చేశారు. కృష్ణా జిల్లా, గన్నవరం మండలంలోని చిన అవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి ఈ వివరాలను ఆదివారం తెలిపారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కానుమోలుకి చెందిన ప్రసాద్ (63) ఈ నెల 23న తేలప్రోలు వచ్చి తిరిగి వెళ్తుండగా హనుమాన్ జంక్షన్ వద్ద ఆయన ప్రయాణించే కారును వెనుక నుండి మరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ తలకు తీవ్రగాయమైంది. ఆయనను పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో ఐసీయూ విభాగంలో అడ్మిట్ చేసి వైద్యం అందించినా బ్రెయిన్ డెడ్ అయ్యింది. బంధువులు ఆయన అవయవాలను దానం చేయడానికి ముందుకువచ్చారు. ఆస్పత్రి యాజమాన్యం జీవన్‌ధాన్‌కు సమాచారమివ్వగా వారు కిడ్నీలు, కళ్లు సేకరించారు. ఒక కిడ్నీ డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో రోగికి, మరో కిడ్నీని జీవన్‌ధాన్ ఆధ్వర్యంలో విజయ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని రోగికి అమర్చేందుకు తరలించారు. కళ్లను అగర్వాల్ కంటి ఆస్పత్రికి పంపారు.

'లోన్ యాప్' కేసులో మరో ముగ్గురి అరెస్ట్

పోలీసుల నుంచి తప్పించుకున్న ప్రధాన నిందితుడు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో లోన్ యాప్ వేధింపులు భరించలేక దంపతుల ఆత్మహత్య కేసులో పోలీసులు గుజరాత్‌కు చెందిన ముగ్గురు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు. లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఈ నెల ఏడో తేదీన రాజమహేంద్రవరానికి చెందిన దంపతులు కొల్లి దుర్గారావు, రమ్యలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై సీఎం వైఎస్ జగన్ వెంటనే స్పందించి మానవతా దృక్పథంతో బాధిత కుటుంబంలోని చిన్నారులకు రూ.10 లక్షల సాయాన్ని అధికార యంత్రాంగం ద్వారా అందజేశారు. లోన్ యాప్ కేసుల విచారణను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 12వ తేదీన హ్యాండీ లోన్, స్పీడ్ లోన్ యాప్ సహాయకులుగా పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి పలు ఆధారాలను సేకరించి, కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. గుజరాత్‌లోని షెల్ కంపెనీ యజమానులుగా ఉన్న అదే రాష్ట్రంలోని సబర్కత జిల్లా లిల్పూర్ ప్రాంతానికి చెందిన పటేల్ నితిన్‌కుమార్ రమేష్‌భాయి(19), గాంధీనగర్‌లోని ముఖిన్‌పథ్‌కు చెందిన పటేల్ మిలన్‌కుమార్ రాజేష్‌భాయి (26), రాభారి విధాన్ (26)తో పాటు ప్రధాన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. అయితే, ప్రధాన నిందితుడు పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యాడు. అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. వీరితోపాటు కొద్ది రోజుల కిందట తెలంగాణలోని బండారిగూడేనికి చెందిన గోవింద్ రాజేంద్రప్రసాద్‌ను కూడా పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకున్నారు. దీంతో లోన్ యాప్ కేసులో ఇప్పటి వరకు మొత్తం 11 మందిని అరెస్ట్ చేశారు. కేవలం 20 రోజుల్లోనే ఈ కేసును పోలీసులు ఛేదించారు. మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీలు ఎం.రజని, జి.వెంకటేశ్వరరావు, డీఎస్పీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.